సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 126

శనివారం 27-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



**ఫైనల్లో హుసాముద్దీన్**

థాయిలాండ్ బాక్సింగ్ టోర్నీ తుది పోరుకు నిఖత్ జరీన్ - స్పోర్ట్స్‌లో



**ఆరు రోజుల నష్టాలకు బ్రేక్**

52 పాయింట్ల లాభపడిన సెన్సెక్స్

32 పాయింట్లు పెరిగిన నిఫ్టీ - బిజినెస్‌లో

# కేబినెట్‌లోకి నలుగురు!

## ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

**హరీశ్, కేటీఆర్, సబితతోపాటు తుమ్మలకు అవకాశం**

**దాదాపుగా ఖరారైన జాబితా**

**మునిసిపల్ ఎన్నికల తరువాత మరో ఇద్దరికి చాన్స్**

**అప్పుడు గుత్తా, లక్ష్మారెడ్డికి కేబినెట్ బెర్త్!**



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ఆగస్టు మొదటి వారంలో తెలంగాణ మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశముంది. అత్యున్నత విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ఈ విస్తరణలో నలుగురు సీనియర్ నేతలకు చోటు లభించనుందని తెలిసింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని, ఆగస్టు 6వ తేదీన మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని ఆ వర్గాలు వెల్లడించాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను మంత్రివర్గంలోకి తీసుకోవడం దాదాపుగా ఖరారైందని విశ్వసనీయ సమాచారం. మంత్రివర్గంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి సహా 12 మంది మంత్రులున్నారు. పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరిస్తే ఆరుగురిని తీసుకోవడానికి అవకాశం ఉంది. అయితే, ప్రస్తుతానికి నలుగురికే అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నారు. మునిసిపాలిటీ ఎన్నికల తరువాత మరో ఇద్దరికీ అవకాశం ఉంటుందని సమాచారం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఇప్పటికే ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్ మంత్రివర్గంలో ఉన్నారు. త్వరలో జరగబోయే విస్తరణలో సిరిసిల్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌కు అవకాశం వస్తే అక్కడి నుంచి మంత్రివర్గంలో ముగ్గురికి స్థానం లభిస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి

మిగతా 2వ పేజీలో ▶

### తెలంగాణ తొలి మహిళా మంత్రి సబిత!

మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి స్థానం లభిస్తే.. ఆమె తెలంగాణ తొలి మహిళా మంత్రి కానున్నారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేబినెట్‌లో ఇప్పటిదాకా మహిళలకు ప్రాతినిధ్యం లభించలేదు. దీనిపై శాసనసభలో కాంగ్రెస్ విమర్శించగా.. ఈసారి ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు దక్కుతాయని సీఎం పేర్కొన్న సంగతి తెలిసిందే. 2018 శాసనసభ ఎన్నికల్లో మహేశ్వరం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన సబిత తదనంతరం టీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు చెందిన మూడింట రెండొంతుల మంది టీఆర్ఎస్‌లో చేరడంతో సబిత అధికారికంగానే టీఆర్ఎస్ శాసనసభ్యులయ్యారు.



తిరుగు ప్రయాణంలో వైద్య సిబ్బందిని వాగు దాటిస్తున్న గిరిజనులు

# మా ఊరికి.. డాక్టరొచ్చిండు!

**ఉబ్బితబ్బిబ్బయిన పెనుగోలు ఆదివాసీలు.. ఘనంగా ఆతిథ్యం**

- మారుమూల ఆదివాసీ గ్రామానికి మండల వైద్యాధికారి
- వైద్య సిబ్బందితో కలసి 15 కిలోమీటర్లపాటు గుట్టలెక్కి వాగులు, వంకలు దాటి చేరుకున్న వైనం
- గ్రామస్తులకు వైద్యసేవలు, మందులు, దోమ తెరల పంపిణీ

అన్ని వసతులు సవ్యంగా, పట్టణాలకు దగ్గరగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో డ్యూటీలకు వెళ్లమంటేనే డాక్టర్లు, ఇతర ప్రభుత్వాధికారులు అలసత్వం వహిస్తారు. తప్పదనుకుంటే వారంలో రెండ్రోజులు అలా వెళ్లి ఇలా రావడమే మహా గగనం. అలాంటిది దట్టమైన అరణ్యంలో కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటుకుని వెళ్లాల్సిన గ్రామాల్లో వైద్య పరిస్థితి సంగతి గురించి మాట్లాడుకోవడం తప్పే. జ్వరమొస్తేనే దేవుడిపై భారం వేసే ఆదివాసీ గ్రామాలకు లెక్కేలేదు. సీజన్ మారిందంటే చాలు ఏజెన్సీల్లో పడకేసిన వైద్యం, విషజ్వరాలతో చనిపోయే సాటి మనుషుల గురించి లెక్కలేనన్ని వార్తలు చదువుతుంటాం. మారుమూల గిరిజన పల్లెల్లో నేటికీ డాక్టర్ అంటే తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. రెండువారాలకోసారి ఓ ఆశ వర్కర్ వస్తే వస్తారు లేదంటే అదీ లేదు. అలాంటిది ఓ మండల వైద్యాధికారి సిబ్బందిని వెంటబెట్టుకుని తమ వద్దకే వస్తే.. ఇది అలాంటి తండాలవాసుల ఊహకూ అందదు. కానీ ములుగు జిల్లా వాజేడు వైద్యాధికారి మంకిడి వెంకటేశ్వర్లు దీన్ని నిజం చేశారు. స్వయంగా ఓ గిరిజన తండాకు వెళ్లి వైద్యసేవలందించారు. - వివరాలు 2లో




# తెలంగాణకు ఐఐఐటీ

- సంగారెడ్డి ఐఐటీ ప్రాంగణంలో వచ్చే నెల నుంచే తరగతులు
- వాస్తవానికి కర్ణాటకలోని రాయచూర్‌కు ట్రిపుల్ ఐటీ కేటాయించిన కేంద్రం
- భూ కేటాయింపులో జాప్యం చేసిన ఆ రాష్ట్ర సర్కారు
- ఫలితంగా సంగారెడ్డి క్యాంపస్‌కు తాత్కాలికంగా తరలించిన హెచ్ఆర్‌డీ శాఖ

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) క్యాంపస్ తెలంగాణలో ఏర్పాటు కానుంది. సంగారెడ్డి ఐఐటీ ప్రాంగణంలో ఈ ఏడాది నుంచే దీన్ని ప్రారంభించాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ (హెచ్ఆర్‌డీ) నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా ఐఐఐటీ కౌన్సిల్ అడ్మిషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించింది. వచ్చే నెల నుంచి 30 మంది విద్యార్థులతో సంగారెడ్డి ఐఐటీ ప్రాంగణంలో తరగతులు ప్రారంభించనుంది. వాస్తవానికి కర్ణాటకలోని బెంగళూరులో ఇప్పటికే ఒక ఐఐఐటీ ఉంది. దీనికి అదనంగా ఆ రాష్ట్రంలోని

మిగతా 2వ పేజీలో ▶



# కన్నడ పీఠంపై మళ్లీ 'కమలం'

- నాలుగోసారి కర్ణాటక సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన బీఎస్ యడియూరప్ప - 5లో







# ఆజంఖాన్‌పై మండిపడ్డ మహిళా లోకం



- సభలో బేషరతు క్షమాపణకు స్పీకర్ ఉత్తర్వులు
- లేనిపక్షంలో ఆజంఖాన్‌పై చర్యలు తీసుకునేందుకు స్పీకర్‌కు అధికారం - 5లో



వర్షానికి జలమయమైన భద్రాచలం సమీపంలోని పర్ణశాల

# భారత ఖ్యాతిపై బురదజల్లేందుకే..

**'ఆ 49 మంది'పై ప్రధానికి లేఖలో 61 మంది బాలీవుడ్ ప్రముఖుల వ్యంగ్యాస్త్రాలు**

- అంతర్జాతీయంగా భారత ఖ్యాతికి నష్టం వాటిల్లేలా, ప్రధాని నరేంద్ర మోదీపై బురద జల్లేందుకే కొందరు పనికట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని హీరోయిన్ కంగనా రనౌత్ సహా 61 మంది బాలీవుడ్ ప్రముఖులు లేఖ రాశారు. మంచి పాలన అందించేందుకు, మానవత్వాన్ని చాటేందుకు, నిజమైన జాతీయవాదాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తున్న నరేంద్ర మోదీ ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఇలా చేస్తున్నారని వారు మండిపడ్డారు. 5లో

# విస్తారంగా వర్షాలు

- ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో చాలా చోట్ల వానలు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపూర్‌లో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షపాతం
- నేడు, రేపు ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం

సాక్షి, హైదరాబాద్, కొత్తగూడెం: రాష్ట్రాన్ని ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఎండిన నేలతల్లిని పలకరించాడు. దిగాలుపడ్డ రైతన్న మోములో మళ్లీ ఆశలు చిగురింపజేశాడు. పశ్చిమ బెంగాల్ ఉత్తర భాగం, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతోపాటు వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటం, రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో శుక్రవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మిగతా 2వ పేజీలో ▶




# కార్గిల్ విజయానికి 20 ఏళ్లు

**ఘనంగా నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని**

- కార్గిల్ యుద్ధంలో భారత్ గెలిచి శుక్రవారానికి 20 ఏళ్లయిన సందర్భంగా రణభూమిలో అమరులైన భారత సైనికులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ సహా అనేక మంది ఘనంగా నివాళులర్పించారు. 1999, మే 3 నుంచి జూలై 26 వరకు పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో చివరకు భారత్ విజయం సాధించింది. దాదాపు 500 మంది భారత సైనికులు ఈ యుద్ధంలో అమరులయ్యారు. - వివరాలు 5లో



## రాష్ట్రంలో పెద్ద పులులెన్ని?

- సోమవారం వివరాలు వెల్లడించనున్న మోదీ

- వివరాలు 4లో



## తెలంగాణలోనే అమిత్ షాకు సభ్యత్వం

- రంగారెడ్డి లేదా మహబూబ్‌నగర్‌లో తీసుకోనున్న బీజేపీ చీఫ్

- వివరాలు 4లో



# సామాన్యుల నుంచే 'టోల్' తీస్తున్నారు!

## టోల్ ట్యాక్స్ వసూలు రాజ్యాంగ వ్యతిరేకమని పిల్



సాక్షి, హైదరాబాద్: రహదారులపై టోల్ ట్యాక్స్ వసూళ్ల నుంచి మినహాయింపు పొందిన వీఐపీలు, వీవీఐపీల వివరాలు అందజేయాలని ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. జాతీయ, రాష్ట్ర రహదారులపై టోల్ ఫీజు వసూలు చేయొద్దంటూ సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది డి.విద్యాసాగర్, ఇతరులు దాఖలు చేసిన పిల్‌ను శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. వీవీఐపీల నుంచి టోల్ ఫీ వసూలు చేయడం లేదని, సామాన్యుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని పిటిషనర్ న్యాయవాది శశికిరణ్ పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎవరెవరికి మినహాయింపు ఇచ్చారో పూర్తి వివరాలు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. రోడ్ల నిర్వహణ సజావుగా జరగాలంటే టోల్ ఫీ వంటివి వసూలు చేయకపోతే ఎలాగని పిటిషనర్‌ను ప్రశ్నించింది. దేశంలోని వ్యక్తి ఒకచోట నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే టోల్ ట్యాక్స్ వసూలు చేయడం ద్వారా అడ్డంకులు కలిగించడం రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషనర్ న్యాయవాది బదులిచ్చారు. విచారణను ధర్మాసనం 4 వారాలు వాయిదా వేసింది.

# గ్లైఫోసేట్ అమ్మకాలపై పరిమితులు

సాక్షి, హైదరాబాద్: గ్లైఫోసేట్ కలుపు మందుల వినియోగం, అమ్మకాలపై పరిమితులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారులు, ఏడీఏలు, ఏఓలు గ్లైఫోసేట్ అమ్మకాలు, వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. పురుగుమందుల షాపుల యజమానులు కచ్చితంగా వ్యవసాయాధికారి స్లిప్పు ఆధారంగానే ఇవ్వాలని స్పష్టం చేశారు. పత్తి సాగవుతున్న జిల్లాల్లో గత రెండేళ్లలో గ్లైఫోసేట్ వినియోగం విపరీతంగా పెరిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. దీని వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతినడంతోపాటు, మనుషుల్లో క్యాన్సర్ కారకం కానుంది. దీంతో జూన్ 1 నుంచి అక్టోబర్ 30 వరకు పంటలు, తోటలు ఉన్నచోట్ల గ్లైఫోసేట్ అమ్మకాలపై నిషేధం విధించింది. రైతులు నవంబర్ నుంచి మే నెల మధ్యలో నాన్ క్రాప్డ్ ఏరియాలో కలుపు మందు వినియోగించే వెసులుబాటు కల్పించింది.

# వేతనాల సమస్యలపై ఫిర్యాదు చేయండి

## ఏఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ దృష్టి సారించింది. కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కాలేజీ యాజమాన్యాలు చెల్లిస్తున్న వేతనాల్లో కొంత మొత్తాన్ని తిరిగి తీసుకుంటున్నట్లు ఏఎఫ్‌ఆర్‌సీ గుర్తించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.60 వేలు చెల్లిస్తున్నట్లు చూపుతూ తిరిగి రూ.30 వేలు వెనక్కి తీసుకుంటున్నట్లు సమాచారం రావడంతో చైర్మన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి స్పందించారు. అలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న లెక్చరర్లు తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, వారికి యాజమాన్యాల నుంచి ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తామని స్పష్టంచేశారు. అలాగే ఆయా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో సూచిస్తే వాటిని పరిశీలిస్తామని వెల్లడించారు. అయితే సమస్యలు ఎదుర్కొంటున్న వారు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే తాము తగిన చర్యలు చేపట్టగలుగుతామన్నారు.

# పసుపుపై కేంద్ర వ్యవసాయ శాఖ సమీక్ష

## సమీక్షలో పాల్గొన్న ఎంపీ అరవింద్, తెలంగాణ రైతులు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పసుపు పంట సాగులో రైతులకు కేంద్రం నుంచి అందే సహకారంపై కేంద్ర వ్యవసాయ శాఖ శుక్రవారం ఢిల్లీలో సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్ సహా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నిజామాబాద్, కరీంనగర్ రైతులు పాల్గొన్నారు. పసుపు పంట సాగులో విత్తనాలు వేసేనాటి నుంచి మార్కెట్‌లో పంట అమ్మకం వరకు జరిగే ప్రక్రియపై సమావేశంలో చర్చించారు. పసుపు పంట బరువు తగ్గకుండానే కుర్కుమిన్ శాతం పెంచే విధంగా విత్తన సరఫరా, పంటలో కుర్కుమిన్ శాతం తెలుసుకొనేలా మార్కెట్‌లోనే ల్యాబ్‌లు ఏర్పాటు, పంట మార్కెటింగ్ కోసం వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రేడర్స్‌ను నిజామాబాద్‌కు తీసుకురానున్నామని వెల్లడించారు. ఇక పసుపు బోర్డు ఏర్పాటు, మద్దతు ధర అంశాలపై ప్రభుత్వంతో చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు.

# 500 ఆసు యంత్రాలు సరఫరా చేయండి

## కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ కోమటిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల పరిధిలో పెద్ద సంఖ్యలో చేనేత రంగంపై ఆధారపడి ఉన్న కార్మికులకు చేయూతనిచ్చేలా 500 ఆసు యంత్రాలు సరఫరా చేయాలని కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రాన్ని ఇచ్చారు. చేనేత రంగాన్ని రక్షించేందుకు, చేనేత కార్మికులకు స్థిర జీవనోపాధి కల్పించేందుకు జనగాం, చౌటుప్పల్, నారాయణ్‌పూర్, రామన్నపేట, వెలిగొండ, యాదగిరిగుట్ట, చండూర్‌లో బ్లాక్ లెవెల్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. చేనేత రంగ కార్మికులకు ఆరోగ్య, జీవిత బీమా కల్పనకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎక్కువ మందికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో రాక్షస పాలన

## ఎంపీ బండి సంజయ్ ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ ధ్వజమెత్తారు. పేద ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. నేరెళ్ల ఘటన మరవకముందే కొడిముంజలో 13 మంది గౌడ కులస్తులపై టీఆర్‌ఎస్ నేతలు అక్రమ కేసులు పెట్టించి 33 రోజులపాటు జైలుపాలు చేశారన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వారు టీఆర్‌ఎస్ నేతలతో కుమ్మక్కై బాధితులపైనే సెక్షన్ 307 కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి బెయిల్ రానివ్వకుండా చేశారన్నారు. గ్రామస్తులపై అక్రమ కేసులు బనాయించడంపై కేంద్ర హోం మంత్రికి ఫిర్యాదు చేశామని, ఆయన బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

# ఖాళీల భర్తీపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై విచారణను సుప్రీంకోర్టు 3 వారాలపాటు వాయిదా వేసింది. పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై గతంలో జేకే రాజు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌లో భాగంగా ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై కోర్టు విచారణ చేపట్టింది. అయితే నివేదిక సమర్పణకు ఏపీ ప్రభుత్వ ఏఓఆర్ జి.ఎన్.రెడ్డి కొంత సమయం కోరడంతో విచారణను ఆగస్టు 18కి వాయిదా వేసింది.

# 30 నుంచి ఆయుష్ ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్యవిద్య కళాశాలల్లోని ఆయుష్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఈనెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు నిర్వహిస్తున్నట్టు ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తెలిపారు. ఆయుష్ కళాశాలల్లో బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైసీ కోర్సుల్లో కేటగిరీ–ఏ సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను వర్సిటీ ఇప్పటికే విడుదల చేసింది. అభ్యర్థులు ఉస్మానియా వర్సిటీలో ఏర్పాటు చేసిన సెంటర్లో ర్యాంకులవారీగా నిర్దేశిత తేదీల్లో హాజరు కావాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ, క్యాప్, పీడబ్ల్యూడీ కోటా అభ్యర్థులు ఆగస్టు 2 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హాజరు కావాలని, పూర్తి సమాచారానికి వర్సిటీ వెబ్‌సైట్ **www.knruhs.in, www.knruhs.telangana.gov.in** సందర్శించాలని సూచించారు.



# 'బొగత'లో జలసవ్వడి

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం కనువిందు చేస్తోంది. ప్రకృతి ఒడి నుంచి పాల నురగలు కక్కుతూ జల సవ్వడి చేస్తున్న ఈ జలపాతం పర్యాటకులను మైమరిపిస్తోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు దండ కారణ్యంలో కురుస్తున్న వర్షాలకు నీరు నల్లాందేవి (నల్లవాగు) వద్ద పుట్టి కొండలు దాటుతూ కిందకు వస్తోంది. గుట్టలు దిగి కిందకు వచ్చే సమయంలో బొగత జలపాతంగా మారింది. జలహోరు.. పాల నురుగలు.. పై నుంచి కిందకు జలధారలు పడే అద్భుత దృశ్యాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు.

# మా ఊరికి.. డాక్టరొచ్చిండు!

## ములుగు జిల్లా మారుమూల ఆదివాసీ గ్రామానికి మండల వైద్యాధికారి

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామపంచాయతీ పరిధిలో గుట్టలపైన ఉన్న పెనుగోలు ఓ ఆదివాసీల కుగ్రామం. ఊళ్లో 18 ఇండ్లు, 23 కుటుంబాలు, 78 మంది జనాభా ఉన్నారు. వీరికి కనీసం మట్టి రోడ్డు సౌకర్యం కూడా లేదు. గుట్ట దిగి వస్తేనే సరుకులు, వైద్యం అందేది. అదేం ఒకట్రెండు కిలోమీటర్లు కాదు ఏకంగా 15 కిలోమీటర్ల మేర గుట్ట పైకెక్కి దిగి కిందకు రావడం అంత సులభమేం కాదు. వర్షాకాలంలోనైతే అదో పెద్ద యజ్ఞమే. ఒకే వాగును మూడు చోట్ల దాటాల్సి ఉంది. అనారోగ్యం పాలైతే కనీస వైద్యం అందే వరకు ప్రాణాలు ఉంటాయో.. పోతాయో తెలియని దారుణమైన పరిస్థితులు. పది, పదిహేను రోజులకోసారి ఆశ వర్కర్, ఏఎన్‌ఎంలు వచ్చి ఏదో మందులు ఇచ్చి వెళ్తా ఉంటారు. అయితే.. ఇక్కడి గిరిజనులకు వైద్యమందించాలని జిల్లా వైద్యాధికారి మంకిడి వెంకటేశ్వర్లు సంకల్పించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ శరత్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్ సమ్మక్కతో కలిసి గురువారం ఉదయం ఏడు గంటలకు వాజేడు నుంచి బయలుదేరారు. గుమ్మడిదొడ్డి గ్రామ చివర నుంచి గుట్ట ఎక్కుతూ 5 గంటల పాటు మధ్యలో వాగును మూడుచోట్ల దాటి 15 కిలోమీటర్లు కాలినడకన పెనుగోలుకు చేరుకున్నారు.



గుట్టపైకి చేరుకుంటున్న వైద్య సిబ్బంది



రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

### వర్షంతో ఆగిన ప్రయాణం

మధ్యాహ్నం 12 గంటలకు పెనుగోలుకు చేరుకున్న వైద్య బృందం ఆదివాసీలకు పరీక్షలు, మందులు, దోమ తెరల పంపిణీ పూర్తయ్యే సమయానికి వర్షం ప్రారంభమైంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో గురువారం రాత్రి అక్కడే బసచేశారు. తమకు కలగా మారిన వైద్యాన్ని అందించిన అధికారులపై ఆదివాసీలు తమ గౌరవాన్ని చాటుకున్నారు. వైద్య సిబ్బందికి భోజనాలు పెట్టడంతోపాటు పడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గుడ్డి దీపాల వెలుగులోనే వైద్యాధికారి సహా సిబ్బంది విశ్రమించారు. ఉదయం లేవగానే వాజేడుకు రావడానికి పయనమైన వైద్య సిబ్బందికి జోరు వర్షంలోనూ గ్రామస్తులు వెంటుండి మరీ జాగ్రత్తగా వాగు దాటించారు.

### అదో మధురానుభూతి



గుట్టల పైనున్న పెనుగోలు గిరిజనులకు వైద్యం అందించడం మధురానుభూతిని మిగిల్చింది. అక్కడికి వెళ్లాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా.. అది ఇప్పుడు కుదిరింది. వారి ఆతిథ్యం, ఆదరణ మర్చిపోలేనివి. నేను పడుకున్నప్పుడు ఓ తేలు నా దగ్గరగా వస్తే దాన్ని గుర్తించి గ్రామస్తులు చంపారు. చిమ్మ చీకట్లో వారు ఉంటున్న దృశ్యం కలవరం కలిగించింది.

– మంకిడి వెంకటేశ్వర్లు, వైద్యాధికారి

గుమ్మడిదొడ్డి గ్రామం వరకు మెడికల్ కిట్లను మోసుకొచ్చి దింపి వెళ్లారు. వైద్యం చేసి వాజేడుకు చేరుకునేంతవరకూ ఆ గ్రామస్తులు కొందరు వీరి వెంటే ఉన్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రేమగా, జాగ్రత్తగా చూసుకున్నారు. వాజేడుకు ఎందరో వైద్యాధికారులు వచ్చినా.. ఇంతవరకు ఎవరూ తమ ఊరి వైపు కన్నెత్తి కూడా చూడలేదని డాక్టర్ మంకిడి వెంకటేశ్వర్లు సేవలను జీవితాంతం గుర్తుంచుకుంటామని పెనుగోలు గ్రామస్తులు తెలిపారు.

### ఆదివాసీలకు వైద్య పరీక్షలు

ఆశ వర్కర్, ఏఎన్‌ఎం రావడమే ఎక్కువైన ఆ ఊరికి వైద్య సిబ్బంది వచ్చారనే సమాచారంతో గ్రామస్తులంతా ఒక్క చోటికి చేరారు. ముందు గిరిజనులతో మాట్లాడిన వైద్య బృందం అందరినీ పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. రోగులను పరీక్షించే సమయంలో ఊకే శ్రీలత, బొగ్గుల మల్లేష్, జనార్దన్‌లకు మలేరియా పాజిటివ్ ఉన్నట్లు నిర్ధారించి వైద్యం అందించారు. మరో 10 మందికి జ్వరాలు ఉండటంతో వారికి వైద్యం చేశారు. దగ్గు, జలుబు, ఒంటి నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్స చేసి మందులు ఇచ్చారు. ఆ తరువాత గ్రామస్తులకు దోమ తెరలను పంపిణీ చేసి 18 గృహాల్లో దోమల మందు పిచికారీ చేశారు.

# కేబినెట్‌లోకి నలుగురు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం కేసీఆర్ ఒక్కరే ఉన్నారు. తదుపరి విస్తరణలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు స్థానం లభిస్తుంది. టీఆర్‌ఎస్ తొలి ప్రభుత్వంలో కేబినెట్‌లో ఉన్న కేటీఆర్, హరీశ్ రావులను ఈసారి మంత్రివర్గంలో తీసుకోకపోవడం రాజకీయ వర్గాల్లో సంచలనమైంది. మంత్రివర్గంలో స్థానం లభించని కేటీఆర్ టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడయ్యారు. హరీశ్‌రావు మాత్రం 8 నెలలుగా సిద్దిపేటతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా కార్యకలాపాలకు పరిమితమయ్యారు.

### తుమ్మలకు మరో చాన్స్

శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పాలేరు నుంచి పోటీ చేసిన మాజీ రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఆ జిల్లాలో ఖమ్మం మినహా అన్ని నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో తనకు కెబినెట్‌లో స్థానం లభిస్తుందని ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్ భావించారు. పార్టీ అంతర్గత కలహాల కారణంగా తుమ్మల ఓడిపోయారని భావిస్తున్న కేసీఆర్ చివరకు ఆయన్నే మంత్రివర్గంలో తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారని టీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి. గత ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు టిక్కెట్ కేటాయించినప్పుడే తుమ్మలకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం.

### మునిసిపల్ ఎన్నికల తర్వాత ఇద్దరికి

మునిసిపల్ ఎన్నికల తరువాత మరో ఇద్దరికీ కేబినెట్లో స్థానం లభించే అవకాశముంది. రాష్ట్ర రైతు సాధికార కమిషన్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డికి అవకాశం దొరకవచ్చని ప్రచారం జరుగుతోంది. భవిష్యత్‌లో మంత్రివర్గంలో తీసుకుంటానని లక్ష్మారెడ్డికి సీఎం హామీ ఇచ్చినట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముగ్గురికి ప్రాతినిధ్యం లభించినట్లు అవుతుంది. ఇప్పటికే వి.శ్రీనివాస్ గౌడ్, ఎస్.నిరంజన్‌రెడ్డి మంత్రివర్గంలో కొనసాగుతున్నారు.

# విస్తారంగా వర్షాలు

▶ మొదటి పేజీ తరువాయి

వెంకటాపూర్‌లో అత్యధికంగా 8 సెంటీమీటర్ల వర్షం కురవగా ఏటూరునాగారం, పరకాల, నాగిరెడ్డిపేటలలో 7 సెంటీమీటర్ల చొప్పున, హుజూరాబాద్, గోవిందరావుపేట, నర్మెట్ట, పేరూరు, బెజ్జంకి, ఖమ్మం అర్బన్, జాజిరెడ్డిగూడెంలలో 6 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. అలాగే ఘన్‌పూర్, మొగుళ్లపల్లి, నూతన్‌కల్, మెదక్‌లలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరికొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కురిసిన వర్షంతో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధంగా ఉన్న దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల ఆలయ ప్రాంగణంలోకి వరద నీరు చేరింది. దీంతో సీతమ్మ, రావణుడి ప్రతిమలు సగం వరకు నీట మునిగాయి. మరోవైపు శని, ఆదివారాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు, అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

### ప్రాణహితలో పెరగనున్న వరద...

ఎగువ ప్రాణహిత నదీ పరీవాహకంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రాణహితపై ఉన్న టెక్రా గెయిజ్ పాయింట్ వద్ద శుక్రవారం 98.39 మీటర్ల లెవల్‌లో 15,714 క్యూసెక్కుల మేర వరద వస్తోంది. ఈ వరద మేడిగడ్డ బ్యారేజీకి చేరుకునే వరకు 8 వేల క్యూసెక్కులుగా నమోదైంది. అయితే ఎగువ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశం ఉందని నీటి పారుదల వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వస్తున్న కొద్దిపాటి వరదనే మేడిగడ్డ బ్యారేజీ 85 గేట్లను మూసివేసి ఒడిసిపడుతున్నారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద 95.3 మీటర్ల లెవల్‌లో నీటి ప్రవాహం కొనసాగుతుండగా బ్యారేజీలో 5.7 టీఎంసీల నిల్వ ఉంది. ఈ నీటినే ప్రస్తుతం కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని ఆరు మోటార్ల ద్వారా 13,500 క్యూసెక్కుల మేర నీటిని అన్నారంలోకి ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు మోటార్లు 1,250 గంటల పాటు పనిచేయగా 11.5 టీఎంసీల నీటిని ఎత్తిపోశాయి. ఇక అన్నారం బ్యారేజీలో ఇప్పటివరకు నాలుగు మోటార్లు 180 గంటలు పనిచేయగా 2.5 టీఎంసీలను పంప్ చేశాయి. సుందిళ్ల బ్యారేజీలో 2.5 టీఎంసీల నీరు చేరగా నిల్వ మరింత పెరిగితే వచ్చే సోమ లేక మంగళవారం గోలివాడ పంప్‌హౌస్ నుంచి నీటిని ఎల్లంపల్లికి ఎత్తిపోయనున్నారు.

# 9 జూనియర్ అసిస్టెంట్‌ల భర్తీకి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ పరిధిలో 9 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వీటిని భర్తీ చేస్తారు. అలాగే లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ శాఖలో 1 సీనియర్ గ్రేడ్ ల్యాబరేటరీ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయనున్నారు.

### గవర్నర్ డిప్యూటీ సెక్రటరీగా రఘుప్రసాద్

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డైరెక్టర్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా ఉన్న సీఎన్ రఘుప్రసాద్‌ను రాష్ట్ర గవర్నర్‌కు డిప్యూటీ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ ఎస్‌కే జోషి జీవో జారీ చేశారు.

# తెలంగాణకు ఐఐఐటీ

▶ మొదటి పేజీ తరువాయి

వెనుకబడిన ప్రాంతమైన రాయచూర్‌కు కేంద్ర ప్రభుత్వం మరో ఐఐఐటీని మంజూరు చేసింది. అయితే అక్కడ ఐఐఐటీ విద్యా సంస్థకు భూమి కేటాయించడంలో కర్ణాటక ప్రభుత్వం విఫలమైంది. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభిస్తామని హెచ్‌ఆర్‌డీశాఖ ముందే సమాచారం ఇచ్చినా కర్ణాటక సర్కారు పట్టించుకోలేదు. ఫలితంగా దీన్ని తాత్కాలికంగా సంగారెడ్డిలోని ఐఐటీ ప్రాంగణంలో ప్రారంభించాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం దీన్ని అదునుగా తీసుకొని ఐఐఐటీకి వెంటనే స్థలం కేటాయిస్తే రాయచూర్‌కు మంజూరు చేసిన ఈ సంస్థను తెలంగాణకు తరలించే అవకాశం లేకపోలేదని హెచ్‌ఆర్‌డీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. మంజూరు చేసిన ఐఐఐటీ ఏర్పాటుకు కర్ణాటక తగిన చర్యలు తీసుకోలేకపోయిందని, ఆ కారణంగానే ఈ క్యాంపస్‌ను సంగారెడ్డిలోని ఐఐటీ ప్రాంగణానికి తరలించాల్సి వచ్చిందని ఆ అధికారి చెప్పారు. అయితే తెలంగాణకు తరలించిన ఐఐఐటీని తాము వెనక్కి తెప్పించుకుంటామని కర్ణాటక బీజేపీ నేతలు అంటున్నారు.

# రెచ్చగొట్టేలా వాఖ్యలు చేయలేదు: అక్బరుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ సభలో తాను ఎవరినీ రెచ్చగొట్టేలా వాఖ్యలు చేయలేదని మజ్లిస్ శాసన సభ పక్షా నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. సభలో ఎలాంటి చట్టవిరుద్ధ ప్రకటన చేయలేదని, ఏ ఒక్కరి మనోభావాలను దెబ్బతీసేలా తాను మాట్లాడలేదని చెప్పారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం తాను చేసిన వాఖ్యలను వక్రీకరిస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రతిభకు సాయం...పేదలకు ఊతం

- ఆపన్నులకు అండగా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం
- గల్ఫ్‌లో కాళ్లు పోగొట్టుకున్న సాగర్‌కు ట్రైసైకిల్ అందజేత

సాక్షి, హైదరాబాద్: ప్రతిభ ఉన్నా పేదరికంతో వైద్యం, ఇతర వృత్తివిద్యా కోర్సుల్లో చేరలేని విద్యార్థులకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. తెలంగాణ ఎంసెట్‌లో మొదటి ర్యాంకు, ఏపీ ఎంసెట్‌లో 8వ ర్యాంకు, నీట్ జాతీయ స్థాయిలో 50వ ర్యాంకు సాధించిన ఏంపటి కుష్వంత్‌కు ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు వచ్చినా పేదరికం అడ్డుగా నిలిచింది. కుష్వంత్ కుటుంబం మంచిర్యాల జిల్లా శ్రీరాంపురంలో ఉంటుండగా,. కొన్ని నెలల క్రితం అతని తండ్రి లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. తల్లి అనిత ప్రస్తుతం భూపాలపల్లిలో కుట్టు పనిచేస్తూ తన కుమారులను పోషిస్తున్నారు.తన తల్లి, తన ఉన్నత చదువులకు అవసరమైన ఫీజులను భరించలేని నేపథ్యాన్ని కుష్వంత్ సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న కేటీఆర్ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కుష్వంత్ పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సమక్షంలో రూ.5 లక్షల చెక్కును కేటీఆర్ అందజేశారు.

### మరో ఇద్దరు విద్యార్థులకు కూడా...

మరో ఇద్దరు విద్యార్థులకు కేటీఆర్ వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పోటీ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన కె. లావణ్య ఫీజుకు అవసరమైన మొత్తం అందించారు. మేడ్చల్ జిల్లాలోని గాజుల రామారానికి చెందిన లావణ్య తండ్రి స్థానికంగా ఉన్న ఒక కంపెనీలో రోజువారీ కూలి. తన పేదరికం వలన తన ఫీజులు చెల్లించలేకపోతున్నానని కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా లావణ్య తన సమస్యను తెలిపింది. దీనిపై స్పందించిన కేటీఆర్ ఆర్థిక సహాయం అందజేశారు. సిరిసిల్ల పట్టణం, సుందరయ్య నగర్‌కు చెందిన యస్.పవన్ ఫ్రీ సీటు సాధించి వీఎన్‌అర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో మూడో ఏడాది బీటెక్ చదువుతున్నారు. తన తండ్రి చిన్న టీకొట్టు ద్వారా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పవన్ ఫీజుల కోసం అవసరమైన సాయాన్ని కేటీఆర్ అందించారు.

### దివ్యాంగునికి త్రిచక్రవాహనం

ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ప్రమాదంలో తన కాళ్లు పోగొట్టుకున్న దివ్యాంగుడు సాగర్‌కు తెలంగాణభవన్‌లో కేటీఆర్ త్రిచక్ర వాహనాన్ని అందజేశారు.సిరిసిల్ల నియోజకవర్గం రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన కాంభోజ సాగర్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అక్కడ జరిగిన ట్రక్కు ప్రమాదంలో కాలును కోల్పోయారు. ఆ తర్వాత స్వదేశానికి చేరుకొని గ్రామంలో ఒక చిన్న కిరాణా కొట్టుతో జీవనం సాగిస్తున్నాడు. తన జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు తన వైకల్యం అడ్డుగా వస్తున్న విషయాన్ని కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలిపారు. దీన్ని తెలుసుకున్న టీఆర్‌ఎస్ నేత గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి సాగర్‌కు త్రిచక్ర వాహనాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. శుక్రవారం కేటీఆర్ చేతుల మీదుగా ఆ వాహనాన్ని అందించారు. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఈ సహాయం అందించడం సంతోషంగా ఉందని రవీందర్‌రెడ్డి తెలిపారు. సాగర్ జీవనోపాధికి సాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.



సాగర్‌కు వాహనాన్ని అందిస్తున్న కేటీఆర్



ఆల్‌రెడీ.. 'ఇంటికి పంపించి' విజయవంతం చేశారుగా!

## రైతు ఆత్మహత్యల వివరాలివ్వండి

### కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** గతేడాది జనవరి నుంచి ఆగస్టు 14వ తేదీ మధ్యలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల వివరాలు పంపాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శి రామ్‌సింగ్ కలెక్టర్లకు లేఖ రాశారు. ఎంతమంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు? త్రిసభ్య కమిటీలు విచారణ పూర్తి చేశాయా? విచారణలో ఆత్మహత్యలు నిజమని తేలాయా? ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేశారా? అనే వివరాలను నిర్దేశిత ఫార్మెట్‌లో నివేదించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

## బీజేపీ, టీఆర్ఎస్‌లు ఒక్కటే: రేవంత్ రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, రెండు పార్టీల నేతలు మంచి మిత్రులని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేసీఆర్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఒక్కటిగానే వ్యవహరిస్తున్నారని, కేసీఆర్ రెండు చేతులతో అటు బీజేపీ, ఇటు ఎంఐఎంను నడిపిస్తున్నారని అన్నారు. బీజేపీ, ఎంఐఎంకు సీఎం కేసీఆర్ సమన్వయకర్తలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రవారం అసెంబ్లీలోని మీడియాహాల్‌లో ఆయన మీడియా తో మాట్లాడారు. రాజ్యసభలో సమాచార హక్కు చట్టం సవరణ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని ఆ పార్టీ నేత కె.కేశవరావు మొదట సంతకం చేశారని, అనంతరం కేసీఆర్‌కు అమిత్‌షా ఫోన్ చేయడంతో బిల్లును మొదట వ్యతిరేకించిన టీఆర్ఎస్ తర్వాత మద్దతిచ్చిందని తెలిపారు. సమాచార హక్కు చట్టం సవరణ ద్వారా ప్రజలకు ఎలాంటి లాభం జరుగుతుందో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కి తామే ప్రత్యామ్నాయం అని చెప్పే బీజేపీ, కేసీఆర్ మద్దతు ఎందుకు తీసుకుందో చెప్పాలన్నారు.

## టీజేఎస్ యువజన సమితి అడ్‌హక్ కమిటీ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర యువజన సమితి అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. శుక్రవారం టీజేఎస్ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం, యువజన సమితి రాష్ట్ర ఇన్‌చార్జి పీఎల్ విశ్వేశ్వరరావు సమక్షంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన సమితి అడ్‌హక్ కమిటీని కోదండరాం ప్రకటించినట్లు తెలిసింది. రాష్ట్ర కన్వీనర్‌గా ఆశప్ప, రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా సలీంపాషా, రాష్ట్ర కో కన్వీనర్లుగా కొత్త రవి, టి.వినయ్ కుమార్, వెంకట్‌రెడ్డి, జీవన్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సంజీవ్, కిరణ్, రమణ్ సింగ్, భరత్, మోరే గణేశ్, కార్తీక్, రాములు తదితరులను ఎన్నుకున్నట్లు సమాచారం. కమిటీ ఏర్పాటు అనంతరం కోదండరాం మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన కోసం యువజన సమితి నాయకులు ఉధృతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## 'కల్లు దుకాణాల బకాయిల రద్దుపై హర్షం'

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడ సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్ కుంభం సతీశ్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం గీత కార్మికుల కో–ఆపరేటివ్ సొసైటీ పరిధిలోని కల్లు దుకాణాలు కట్టవలసిన బకాయిలను ప్రభుత్వం రద్దు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. గీత కార్మికుల కో–ఆపరేటివ్ సొసైటీ రూ.7.98 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, ఈ మొత్తాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని వారు పేర్కొన్నారు. గౌడ సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్, ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నీరాను ఆ యాక్టు నుంచి తొలగించాలి

### కేటీఆర్‌ను కోరిన గౌడ సంఘం నేతలు

**సాక్షి, హైదరాబాద్:** నీరా సేకరణ, అమ్మకాలకు అధికారికంగా అనుమతులివ్వాలని తెలంగాణ నీరా, పాల్మైరా ప్రొడ్యూసర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, తెలంగాణ గౌడ సంఘం డిమాండ్ చేసింది. నీరా ఉత్పత్తులను ప్రోత్సహించాలని, నీరాను ఆల్కహాల్ రహిత పదార్థంగా గుర్తించాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ నీరా, పాల్మైరా ప్రొడ్యూసర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు మద్దెల రమేశ్‌బాబుగౌడ్, డాక్టర్ ఆనంద్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ తదితరులు టీఆర్ఎస్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎక్సైజ్ యాక్టు నుంచి నీరాను తొలగించాలని కోరారు. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, అతి త్వరలో గౌడ సమాజం శుభకరమైన సమాచారం వింటుందని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## రాజీవ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, కార్మికుల కోసం నిర్మించతలపెట్టిన రాజీవ్ స్వగృహ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరముందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి తెలిపారు. నిర్మాణ పనులకు నిధుల్లేక పదేళ్లుగా అవి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గాజుల రామారం, జవహర్‌నగర్, పోచారం, బండ్లగూడల్లో 15 అంతస్తులతో కూడిన దాదాపు 15 వేల అపార్ట్‌మెంట్ల నిర్మాణం పూర్తి చేయకుండా, ఎవరికీ కేటాయించకుండా అర్ధంతరంగా పనులు ఆగిపోవడంతో బిల్డింగులు కూలిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. స్వగృహ కార్పొరేషన్‌ను రద్దు చేసిన ప్రభుత్వం ఆ నిర్మాణాలను హెచ్ఎండీఏ కానీ, జీహెచ్ఎంసీ, హౌసింగ్‌బోర్డుకు గానీ అప్పగించి నిర్మాణం పూర్తి చేస్తే ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని మల్లారెడ్డి పేర్కొన్నారు.



ఇంటర్ బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న అఖిల పక్ష నేతలు

## ఆ విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

### అఖిల పక్ష నేతల డిమాండ్

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ బోర్డు తప్పిదాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తామే భిక్షాటన ద్వారా, ఇతర రూపాల్లో విరాళాల సేకరణ చేసి బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున అందజేయాలని నిర్ణయించామన్నారు. శుక్రవారం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండో విడతగా హారికకు (ఆత్మహత్య చేసుకున్న అనామిక తల్లి) చాడ వెంకటరెడ్డి, సుధాకర్ (సీపీఐ), కోదండరామ్ (టీజేఎస్), రావుల చంద్రశేఖరరెడ్డి, అచ్యుతరామారావు (టీడీపీ), తెలంగి పీపుల్స్ సొసైటీ అధ్యక్షుడు డీపీరెడ్డి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఇప్పటికే అఖిలపక్షం ఆధ్వర్యంలో వనపర్తికి చెందిన ఒక విద్యార్థిని కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. బాధిత కుటుంబాలను ఈ ప్రభుత్వం ఆదుకోక పోగా తాము భిక్షాటన చేసి సాయం చేస్తామంటే తమను అరెస్టు చేస్తోందని, ఇదెక్కడి ప్రభుత్వం అని రావుల దుయ్యబట్టారు. ప్రభుత్వం పట్టించుకోని కారణంగా తాము బాధ్యత తీసుకున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. సీఎం కేసీఆర్ తాను ఆదుకోకపోగా విరాళాల సేకరణకు సిద్ధమైన అఖిలపక్షనేతలను అరెస్టు చేయడం సిగ్గు చేటని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. కేసీఆర్ తన నియోజకవర్గంలో ఒక్కొక్కరికి రూ.10 లక్షలిచ్చినా తమకు అభ్యంతరం లేదని కానీ రాష్ట్రంలోని అందరినీ సమాన దృష్టితో ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటర్ బోర్డు బాధిత విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి దాతలు ఉదారంగా విరాళాలు ఇవ్వాలని విరాళాలను తెలంగాణ పీపుల్స్ సొసైటీ, ఖాతా నం 33260100009102, బ్యాంక్ ఆఫ్ బరోడా, తార్నాక బ్రాంచి, IFSC code: BARBOTARNAKకు పంపాల్సిందిగా సుధాకర్ కోరారు. లేదా మొబైల్ నంబర్ 9440801836 సంప్రదించాలన్నారు.

# పట్టణాలపై పూర్తి ఆధిపత్యం!

- బీజేపీ గెలిచిన 4ఎంపీ స్థానాల్లో సత్తా చాటాలి
- పార్టీ నాయకులకు కేటీఆర్ దిశానిర్దేశం
- సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వచ్చిందని ప్రశంస
- ఇప్పటిదాకా 40లక్షల సభ్యత్వ నమోదు.. 20 లక్షల సభ్యత్వాల డిజిటలైజేషన్
- గజ్వేల్, పాలకుర్తిల్లో 70వేలకు పైగానే..
- పలు నియోజకవర్గాల్లో లక్ష్యానికి మించి సభ్యత్వం



శుక్రవారం తెలంగాణ భవన్‌లో పార్టీ సభ్యత్వ ఇన్‌చార్జీలతో మాట్లాడుతున్న కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించేలా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీపై పూర్తి ఆధిక్యాన్ని చాటేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన 4 ఎంపీ సీట్ల పరిధిలో పార్టీ సభ్యత్వాన్ని భారీగా నమోదు చేసి రాజకీయంగా బలపడేలా గట్టి చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల సభ్యత్వ ఇన్‌చార్జీలను ఆదేశించారు. అంతేకాకుండా కార్పొరేషన్ ఎన్నికలు జరగాల్సిన హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లలో ఇప్పటి నుంచే పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీని, కేడర్‌ను పటిష్టం చేసుకోవాలని సూచించారు. బీజేపీ ఎంపీ సీట్లు గెలిచిన చోట ఎక్కడా కూడా టీఆర్ఎస్ బలం, ఓట్లు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పార్టీకి ఎదురైన ఓటములను పూర్తిస్థాయిలో అధిగమించేలా మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా 60 లక్షల సభ్యత్వాల నమోదు పూర్తిచేయాలని, పట్టణాల్లో బూత్ కమిటీల నియామకం చేపట్టాలని సూచించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో పార్టీ సభ్యత్వ ఇన్‌చార్జీలు, సభ్యత్వ డిజిటలైజేషన్ ఇన్‌చార్జీలతో సమీక్ష సందర్భంగా ఆయా అంశాలు చర్చకు వచ్చాయి. హైదరాబాద్‌లోని కొన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వం తక్కువగా నమోదు కావడం, మందకొడిగా సాగడంపై అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. నగర నేతలతో విడివిడిగా ఈ అంశంపై మాట్లాడి ఈ నెలాఖరులోగా తక్కువ సభ్యత్వం ఉన్న చోట్ల కూడా నమోదును మరింత పెంచాలని ఆదేశించినట్టు తెలిసింది.

### చురుగ్గా సభ్యత్వ నమోదు

ఇప్పటికే 50 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, ఇంకా సభ్యత్వ నమోదు చురుగ్గా కొనసాగుతోందని సమీక్ష సమావేశంలో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు చేరిన సభ్యుల్లో దాదాపు 20లక్షల మంది వివరాలను పార్టీ డిజిటలైజేషన్ పూర్తి చేసిందని చెప్పారు. పలు నియోజక వర్గాల్లో లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు జరిగిందని, ఇలాంటి చోట్ల మరిన్ని సభత్వ నమోదు పుస్తకాలను పార్టీ కార్యాలయం నుంచి తీసుకున్నారని తెలియజేశారు. సభ్యత్వ లక్ష్యం పూర్తి చేసుకున్న ప్రాంతాల్లో కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించాలని కేటీఆర్ ఆదేశించారు. ఒక్కో నియోజకవర్గం వారీగా ఏ మేరకు సభ్యత్వ నమోదు జరిగింది, ఎంత డిజిటలైజేషన్ జరిగింది వంటి వివరాలను ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల పూర్తి వివరాలను సేకరించాలని ఇచ్చిన మార్గదర్శకాల మేరకు కనీస వివరాలను అందిస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ వివరాల ఆధారంగానే కార్యకర్తల బీమా సౌకర్యం ముడిపడుందని స్పష్టంచేశారు. సరైన వివరాలు ఇస్తేనే బీమా సౌకర్యానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సభ్యత్వం నమోదు పూర్తయిన చోట్ల బూత్ స్థాయిలో కమిటీల ఏర్పాటు వెంటనే మొదలుపెట్టాలని కేటీఆర్ ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించిన కేటీఆర్, లక్ష్యం మేరకు సభ్యత్వాన్ని పూర్తి చేసిన పార్టీ ఇన్‌చార్జీలను, స్థానిక ఎమ్మెల్యేలను అభినందించారు.

### గజ్వేల్, పాలకుర్తి టాప్: పల్లా

టీఆర్ఎస్‌లో చేరిన సభ్యులందరికి రూ.2లక్షల చొప్పున ప్రమాదబీమా ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చేలా కేటీఆర్ ఆదేశించారని టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో బూత్ కమిటీల నియామకం పూర్తి చేయాలని చెప్పారన్నారు. ఈ నెలాఖరు లోపు 60 లక్షల సభ్యత్వం పూర్తి చేయడం దేశ రాజకీయాల్లో అరుదని.. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటున్నాయన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి శిక్షణాకార్య క్రమాలు నిర్వహించి క్రమశిక్షణతో పాటు పరిజ్ఞానం, మేధోపరంగా సుశిక్షితులైన సైనికులుగా తీర్చిదిద్దుతామన్నారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్, పీఆర్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు నియోజకవర్గం పాలకుర్తిలలో అత్యధికంగా 70 వేలకు మించి సభ్యత్వ నమోదు జరిగిందన్నారు. 50వేల చొప్పున సభ్యత్వం దాటిన నియోజకవర్గాలు ఇరవైకి పైగానే ఉన్నాయన్నారు. సభ్యత్వ రుసుము కింద ఇప్పటికే రూ.15 కోట్లు పార్టీకి అందాయని, ఈ నెల 30 లోపు సభ్యత్వ నమోదు వివరాలను అందచేయాలని పార్టీ నాయకులకు సూచించారు.

# ఎక్కడ నుంచైనా రేషన్

- ఆగస్టు ఒకటి నుంచి 4 రాష్ట్రాల్లో నేషనల్ పోర్టబిలిటీకి శ్రీకారం
- కేంద్ర ఆహార భద్రతాచట్టం పరిధిలోని కార్డుదారులకు లబ్ధి
- హైదరాబాద్ ట్రయల్‌రన్‌లో సరుకులు తీసుకున్న ఏపీ లబ్ధిదారులు
- దేశం.. ఒకే కార్డు'విధానంలో ఆదర్శంగా తెలంగాణ

సాక్షి, హైదరాబాద్

ఇక రేషన్‌కు పరేషాన్ ఉండదు. నిరుపేదలకు నిట్టూర్పులు ఉండవు. సరుకుల కోసం నిర్దేశిత షాపు వద్దకే లబ్ధిదారులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పనిలేదు. తెలుగురాష్ట్రాల్లో ఎక్కడినుంచైనా రేషన్ సరుకులు పొందవచ్చు. దేశవ్యాప్తంగా 'ఒకే దేశం–ఒకే కార్డు'కింద నేషనల్ పోర్టబిలిటీ విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనికి ఏపీ, తెలంగాణల నుంచే శ్రీకారం చుట్టింది. ఆయా ప్రాంతాలకు వలసలు వెళ్లేవారి సౌకర్యార్థం ఈ విధానాన్ని చేపట్టింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకక్లస్టర్, గుజరాత్, మహారాష్ట్రలు మరో క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఆగస్ట్ ఒకటి నుంచి నేషనల్ పోర్టబిలిటీ విధానాన్ని అమలులోకితేనుంది. దీనికి సంబంధించి హైదరాబాద్ పంజగుట్టలోని ఒక రేషన్ షాప్‌లో శుక్రవారం పౌర సరఫరాల శాఖ నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఏపీ చెందిన ఇద్దరు లబ్ధిదారులు హైదరాబాద్‌లో సరుకులు తీసుకున్నారు. పోర్టబిలిటీ ట్రయల్ రన్ విజయవంతం కావడంపట్ల పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సంతోషం వ్యక్తం చేశారు.

### ఎవరెవరు అర్హులు

- కేంద్ర ఆహార భద్రత పరిధిలో ఉన్న లబ్ధిదారులు
- లబ్ధిదారుడి ఆధార్ నంబర్ అతని రేషన్ కార్డుతో సీడింగ్ అయి ఉండాలి.
- తెలంగాణ, ఏపీ క్లస్టర్‌లో పోర్టబిలిటీ విధానం ద్వారా తెలంగాణకు చెందిన 56 లక్షల మంది లబ్ధిదారులకు సౌకర్యం
- బియ్యం, గోధుమలు, చిరు ధాన్యాలను కేంద్రం నిర్దేశించిన మొత్తంలో, నిర్ణయించిన ధరల ప్రకారం లబ్ధిదారులకు సరఫరా చేస్తారు.
- ప్రతి ఒక్కరికీ బియ్యం కిలో రూ.3 చొప్పున ఐదు కిలోలు, గోధుమలు కిలో రూ.2కు పంపిణీ

### 'ట్రయల్‌రన్' లబ్ధిదారులు

పంజగుట్టలోని షాప్ నంబర్ 1677750లో పౌర సరఫరాల శాఖ శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన ఈశ్వరరావు(కార్డు నంబర్ డబ్ల్యూఏపీ 048102580472), విశాఖపట్నం జిల్లా యలమంచిలికి చెందిన అప్పారావు (కార్డు నంబర్ డబ్ల్యూఏపీ 0034109700550) లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారు.

### పర్యవేక్షణ నిమిత్తం...

ప్రజాపంపిణీ వ్యవస్థ సమగ్ర నిర్వహణ పథకాన్ని పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా రాష్ట్ర అపెక్స్ కమిటీ, పౌర సరఫరాల శాఖ కమిషనర్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రాజెక్ట్ ఈ–మిషన్ బృందాన్ని కేంద్రం ఏర్పాటు చేసింది.

### తెలంగాణే ఆదర్శం..

రాష్ట్రంలోని 2.82 కోట్ల లబ్ధిదారులు రాష్ట్రంలోని ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ విధానాన్ని గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ విధానాన్ని ఇప్పటి వరకు 2.07 కోట్ల మంది లబ్ధిదారుల వినియోగించుకున్నారు. హైదరాబాద్ జిల్లాలో 42 లక్షలు, మేడ్చల్ 29 లక్షలు, రంగారెడ్డి 18 లక్షలు, నిజామాబాద్ 10 లక్షలు, వరంగల్ 9 లక్షల మంది పోర్టబిలిటీ ద్వారా రేషన్ సరుకులను తీసుకున్నారు. ఈ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచింది.

### వచ్చే జూన్‌నుంచి దేశవ్యాప్తంగా

దేశానికి మోడల్‌గా నిలిచిన ఈ పోర్టబిలిటీ విధానాన్ని వచ్చే ఏడాది జూన్ నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయడానికి కేంద్రం నిర్ణయించింది. ఇందుకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది.

## టీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలు



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో టీఆర్ఎస్, బీజేపీలు ప్రత్యర్థులుగా నటిస్తున్నాయి కానీ ఆ రెండు పార్టీలు తోడు దొంగలేనని ఏఐసీసీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఆర్‌సీ కుంతియా విమర్శించారు. బయటకు ఒక పార్టీపై మరో పార్టీ పోరాటం చేస్తున్నట్లు నటిస్తున్నాయని, లోపల రెండూ ఒకటేనని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్ట సవరణ బిల్లు ఆమోదం విషయంలో ముందుగా సెలెక్ట్ కమిటీ పంపాలని ప్రతిపాదించిన టీఆర్ఎస్.. కేసీఆర్‌కు అమిత్‌షా ఫోన్ చేశాక మద్దతు ఇవ్వడంలో జరిగిన రాజకీయం ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని, దానిని తెలంగాణ ప్రజలు గమనించాలని పేర్కొన్నారు. తెలంగాణలో చేపట్టనున్న ఇంటింటికీ కాంగ్రెస్, వాడవాడలా కాంగ్రెస్ జెండా కార్యక్రమంలో ప్రతి ఒక్క కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సూచించారు.

# రాష్ట్రంలో పెద్ద పులులెన్ని?

### సోమవారం వివరాలు వెల్లడించనున్న ప్రధాని మోదీ



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో ఎన్ని పెద్ద పులులున్నాయి? ఏ టైగర్ రిజర్వ్‌లో ఎన్ని పులులు నివసిస్తున్నాయి? గతంతో పోల్చితే పులుల సంఖ్య పెరిగిందా లేక తగ్గిందా? దేశవ్యాప్తంగా మొత్తం ఎన్ని ఉన్నాయి? జాతీయస్థాయిలో చూస్తే గతంలో మాదిరిగానే వాటి సంఖ్యలో వృద్ధి జరిగిందా లేదా అన్న ప్రశ్నలకు ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పనున్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఈనెల 29న సోమవారం ఇందుకు సంబంధించిన అధికారిక లెక్కలు ఆయన విడుదల చేయనున్నారు. ప్రతి నాలుగేళ్లకూ ఓసారి పులుల గణన చేపడతారు. 2006లో తొలిసారిగా దేశవ్యాప్తంగా టైగర్ సెన్సెస్‌ను విడుదల చేయగా.. మళ్లీ 2010లో, ఆ తర్వాత 2014లో ఈ వివరాలను ప్రకటించారు. 2014లో ఏపీ, తెలంగాణలను కలిపి ఒకటిగానే సమాచారం వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డాక మొదటి సారిగా ఇక్కడ ఎన్ని పులులున్నాయనేది అధికారికంగా వెల్లడి కానుంది. 2014 లెక్కల ప్రకారం ఉమ్మడి ఏపీలో 68 పులులుండగా వాటిలో 20 పులులు తెలంగాణలో ఉన్నట్టుగా (ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో17, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో 3) ఇక్కడి అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం తెలంగాణలో వీటి సంఖ్య 28 నుంచి 30 వరకు పెరిగినట్టు అనధికార లెక్కలను బట్టి తెలుస్తోంది. దేశవ్యాప్తంగా చూస్తే 2006లో 1,411 పులులు ఉండగా.. 2010లో 1,706కు, 2014లో 2,226కు వాటి సంఖ్య పెరిగింది. 2019లో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2010 నాటికి 3,159 ఉన్న పులుల సంఖ్య 2016 నాటికి 3,890కి పెరిగినట్టుగా గణాంకాలను బట్టి తెలుస్తోంది.

# తెలంగాణలోనే అమిత్ షాకు సభ్యత్వం

- రంగారెడ్డి లేదా మహబూబ్‌నగర్‌లో తీసుకోనున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు
- ఆగస్టు 15–17 మధ్య రాష్ట్రంలో పర్యటన
- టార్గెట్ టీడీపీ.. ఆపరేషన్ తెలంగాణ వేగవంతం
- షా సమక్షంలో భారీగా చేరికలు



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసే చర్యలు వేగవంతమయ్యాయి. రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా.. తెలంగాణలోనే క్రియాశీల సభ్యత్వం తీసుకోబోతున్నారు. రంగారెడ్డి లేదా మహబూబ్‌నగర్‌లో ఆయన బీజేపీ సభ్యత్వం తీసుకోనున్నట్లు తెలిసింది. ఆగస్టు 15–17 తేదీల మధ్య ఆయన రాష్ట్ర పర్యటనకు రాబోతున్నారు. ఆ సమయంలోనే టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన దాదాపు 25 మంది ముఖ్య నేతలను బీజేపీలో చేర్పించడానికి పార్టీ వర్గాలు ప్రణాళిక రూపొందిస్తున్నాయి. ఇందులో భాగంగానే టార్గెట్ టీడీపీని ముమ్మరం చేశారు. ఇప్పటికే టీడీపీకి చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డిని పార్టీలో చేర్చుకున్న బీజేపీ.. ఆ పార్టీ కేడర్ మొత్తాన్ని తీసుకొచ్చే చర్యలు చేపట్టింది. ముందుగా వివిధ జిల్లాల్లోని నియోజకవర్గ స్థాయి నేతలు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ముఖ్య నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు పావులు కదుపుతోంది. ఇప్పటికే నల్లగొండ జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన నేతలు అమిత్‌షాను కలవగా.. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన నేతలు కూడా ఆయనతో టచ్‌లోకి వెళ్లారు. వారంతా అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరబోతున్నారు. ఇందుకోసం ఇప్పటికే బీజేపీ ముఖ్య నేతలు రాంమాధవ్, లక్ష్మణ్, మురళీధర్‌రావు టీడీపీ నేతలతో మంతనాలు జరిపారు. ఇటీవల బీజేపీలో చేరిన టీడీపీ నేత గరికపాటి రామ్మోహన్‌రావు నేతృత్వంలో టార్గెట్ టీడీపీని కొనసాగిస్తున్నట్లు సమాచారం.

**మూడు అంశాలపై అమిత్ షా దృష్టి...**

బీజేపీ చేపట్టిన ఆపరేషన్ తెలంగాణను పూర్తి స్థాయిలో ఆచరణలోకి తెస్తోంది. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న అమిత్ షా.. ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించారు. పార్టీలోకి భారీ ఎత్తున ముఖ్య నేతల చేరికలు ఉండేలా చూడాలని ఇప్పటికే రాష్ట్ర పార్టీ నేతలకు స్పష్టంచేశారు. అలాగే రాష్ట్రంలో 18 లక్షల సభ్యత్వ నమోదును టార్గెట్‌గా పెట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ అంశాలను రాష్ట్ర పార్టీ నేతలు సరిగ్గా చేయలేకపోతే తానే స్వయంగా రంగంలోకి దిగుతానని పేర్కొన్నారంటే తెలంగాణపై ఆయన ఎంతగా దృష్టి సారించారో అర్థం చేసుకోవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగానే ఆగస్టు ఒకటో తేదీ నుంచి 7 వరకు సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. ఆ వారం రోజుల్లో కనీసంగా 12 లక్షల కుటుంబాలను కలిసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

# ముహూర్తం.. శ్రావణం!

- కొత్త సచివాలయ పనులకు శ్రీకారం
- ఇప్పటికే బీఆర్‌కే భవనం దాదాపు ఖాళీ
- మరమ్మతులు కాగానే పలు శాఖల తరలింపు
- పాత సచివాలయం కూల్చివేత మొదలు
- 15 రోజుల్లో డిజైన్ ఖరారు.. టెండర్ల ఆహ్వానం

**సాక్షి, హైదరాబాద్:** శ్రావణ మాసం... శుభకార్యాలకు మంచి తరుణంగా భావిస్తారు. మరో వారం రోజుల్లో మొదలుకానున్న ఈ మాసంలో కొత్త సచివాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టబోతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన మేరకు శ్రావణ మాసంలోనే కొత్త సచివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. అయితే నెల రోజుల్లో పనులు ప్రారంభించడం అంత సులభం కానప్పటికీ, మంచి రోజులు కావటంతో ఏదో ఒక పనితో సచివాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. మరో నెల రోజుల్లో ప్రస్తుత సచివాలయం పూర్తిగా ఖాళీ కానుంది. ఎక్కువ కార్యాలయాలకు తాత్కాలిక నెలవు కానున్న బూర్గుల రామకృష్ణారావు భవనం దాదాపు ఖాళీ అయింది. ఇందులోకి సచివాలయం తరలాల్సి ఉన్నందున, అందుకు తగ్గట్లుగా రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు ప్రారంభించారు. మిగతా కార్యాలయాలు కూడా ఖాళీ అయ్యాక భవనానికి రంగులు వేసి ఈ పనులు పూర్తి కాగానే సచివాలయ కార్యాలయాలను తరలించనున్నారు. శ్రావణమాసం ప్రారంభంలోనే ఈ తరలింపు మొదలుపెట్టి వీలైనంత తొందరగా పూర్తి చేసి కొత్త సచివాలయ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టాలని నిర్ణయించారు.

### 15 రోజుల్లో నమూనా...

సచివాలయ భవనం ఎలా ఉండాలన్నది మరో 15 రోజుల్లో తేలుతుంది. మరో నాలుగైదు రోజుల్లో అన్ని సంస్థల నుంచి డిజైన్లు అందనున్నాయి. వాటి నుంచి మూడునాలుగు ఎంపిక చేసి మంత్రివర్గ ఉప సంఘానికి అందివ్వనున్నారు. వాటిలో మంత్రివర్గ ఉపసంఘం కొన్నింటిని ఖరారు చేయనుంది. మళ్లీ అందులోంచి తుది నమూనాను కేసీఆర్ ఎంపిక చేస్తారు. ఈ పనులన్నీ 15 రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ వెంటనే టెండర్లు పిలవనున్నారు. టెండర్ ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రస్తుత భవనాలను కూల్చివేసే పనులకు శ్రీకారం చుట్టనున్నారు. శ్రావణమాసంలోనే ఇవి మొదలయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



బీఆర్‌కే భవనంలో కొనసాగుతున్న పనులు

### అసెంబ్లీ సంగతి తర్వాత..

సచివాలయం కూల్చివేత, ఎర్రమంజిల్ కూల్చి అసెంబ్లీ నిర్మాణం చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టులో పలు కేసులు నమోదు కావటంతో ప్రస్తుతం వాటిపై వాదోపవాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఎర్రమంజిల్ కూల్చివేతపైనే ఎక్కువ చర్చ జరుగుతుండటంతో కోర్టు దాని విషయంలో ఇచ్చే తీర్పు ఆధారంగా ప్రభుత్వం స్పందించనుంది. సచివాలయం విషయంలో ఇబ్బంది ఉండకపోవచ్చన్న అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో సచివాలయ భవనాలు కూల్చి పనులు మొదలుపెట్టేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తోంది.

# కన్నడ పీఠంపై మళ్లీ 'కమలం'

- నాలుగోసారి కర్ణాటక సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన బీఎస్ యడియూరప్ప
- రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ వజూభాయ్‌వాలా
- సోమవారం ఉదయం 10 గంటలకు బలపరీక్ష చేపడతామన్న యెడ్డీ
- కొత్త సీఎంకు పాలన కత్తిమీద సామేనంటున్న రాజకీయ విశ్లేషకులు



రాజ్‌భవన్‌లో యడియూరప్పతో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ వజూభాయ్‌వాలా

**సాక్షి, బెంగళూరు/న్యూఢిల్లీ:** కర్ణాటకలో మరోసారి కమలనాథుల ప్రభుత్వం కొలువుదీరింది. కర్ణాటక 32వ ముఖ్యమంత్రిగా బూకనకెరె సిద్ధలింగప్ప యడియూరప్ప(76) ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ వజూభాయ్‌వాలా శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు ఆయన చేత ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి సదానంద గౌడతో పాటు మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ, కర్ణాటక బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధరరావు, బీజేపీ నేత శోభాకరంద్లాజే, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. వీరితో పాటు కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యే రోషన్‌బేగ్, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే రాజన్న ఈ వేడుకకు వచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచారు. కర్ణాటకలో హెచ్.డి.కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయిన మూడ్రోజులకే యడియూరప్ప ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణస్వీకారం చేయడం గమనార్హం. కాంగ్రెస్ నేతలెవరూ ఈ కార్యక్రమానికి రాలేదు.

**యెడ్డీకి అమిత్ షా ఫోన్..**

కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్ కుమార్ ముగ్గురు కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయడంతో బీజేపీ అధిష్టానం చకచకా పావులు కదిపింది. పలువురు న్యాయ నిపుణులతో చర్చలు జరిపిన బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా.. శుక్రవారం ఉదయాన్నే యడియూరప్పకు ఫోన్‌చేసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం కావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ వజూభాయ్‌వాలా అపాయింట్‌మెంట్ తీసుకున్న యడియూరప్ప నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లిపోయారు. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలనీ, సభలో మెజారిటీని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇందుకు అంగీకరించిన గవర్నర్ వజూభాయ్‌వాలా సాయంత్రం 6–6.15 గంటల మధ్యలో ప్రమాణస్వీకారం చేయాలని ఆదేశించారు. యడియూరప్ప ఇప్పటికే ప్రతిపక్ష నేత కాబట్టి ఆయన్ను బీజేపీ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా మరోసారి ఎన్నుకోలేదు.

**29న అసెంబ్లీలో బలపరీక్ష..**

కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక యడియూరప్ప స్పందిస్తూ.. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు బలపరీక్షను చేపడతామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరుస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన ఆర్థిక బిల్లును కూడా ఆమోదిస్తామని చెప్పారు. బీజేపీ చీఫ్ అమిత్ షాను సంప్రదించి త్వరలోనే మంత్రివర్గ విస్తరణను చేపడతామని పేర్కొన్నారు. మరోవైపు యడియూరప్ప విజ్ఞప్తి మేరకు సోమవారం సభను నిర్వహిస్తానని స్పీకర్ చెప్పారు.

**యడ్యూరప్ప కాదు.. యడియూరప్ప!**

కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప తన పేరును మరోసారి మార్చుకున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం తమను ఆహ్వానించాలని గవర్నర్‌కు రాసిన లేఖలో తన పేరును ఆయన 'బీఎస్ యడియూరప్ప'గా రాశారు. న్యూమరాలజీ ప్రభావంతో యడియూరప్ప ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సన్నిహితవర్గాలు తెలిపాయి. 2007లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సిరావడంతో న్యూమరాలజీ ప్రకారం యడియూరప్ప తన పేరును యడ్యూరప్పగా మార్చుకున్నారు. అయితే ఇది కలిసిరాకపోవడంతో ఈ బీజేపీ నేత తన పాత పేరునే వాడాలని నిర్ణయించుకున్నారు.

**ప్రభుత్వ ఏర్పాటు సాధ్యమా?**

ప్రస్తుత పరిస్థితుల్లో యడియూరప్ప చాలా జాగ్రత్తగా ముందుకెళ్లాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హతతో కర్ణాటక అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 221 (స్పీకర్‌ను మినహాయించి)కి చేరుకుంటుంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 112 అయింది. బీజేపీకి ప్రస్తుతం 106 మంది సభ్యుల (బీజేపీ 105, ఓ స్వతంత్ర ఎమ్మెల్యే) బలముంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఆరుగురిని బీజేపీ ఎలా సంపాదిస్తుందన్నది ఇప్పు డు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ స్పీకర్ రమేశ్ మిగిలిన 14 మంది రెబెల్స్ రాజీనామాలను ఆమోదిస్తే/అనర్హత వేటేస్తే అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 208కి చేరుకుంటుంది. అప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు 105 మంది ఎమ్మెల్యేలు ఉంటే సరిపోతుంది. ఇదే జరిగితే ఓ స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతుతో బీజేపీ గట్టెక్కుతుంది. అయితే 14 మంది రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామాలపై స్పీకర్ ఏం నిర్ణయం తీసుకుంటారన్నదానిపై ప్రస్తుతం అస్పష్టత నెలకొంది.

**ప్రజానుకూల పాలన అందిస్తాం: అమిత్ షా**

కర్ణాటకలో యడియూరప్ప నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం సుస్థిరమైన, రైతు, ప్రజానుకూల పాలన అందిస్తుందని బీజేపీ చీఫ్ అమిత్ షా తెలిపారు. కర్ణాటక సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన యడియూరప్పకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. కర్ణాటక ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్య నిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. కలహాలవల్లే కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం కూలిపోయిందనీ, తమ ప్రమేయం లేదన్నారు.

**మండిపడ్డ కాంగ్రెస్, జేడీఎస్..**

యడియూరప్ప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంపై కాంగ్రెస్, జేడీఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. 'బీజేపీకి అండగా నిలిచిన వజూభాయ్‌వాలా సాయంతో రాజ్యాంగ విరుద్ధంగా కర్ణాటకలో యడియూరప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. అవినీతి రారాజు, జైలు పక్షి యడియూరప్ప రాజకీయ ప్రలోభాల విషయంలో తన అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసి అధికారంలోకి వచ్చారు' అని కాంగ్రెస్ పార్టీ ఘాటుగా విమర్శించింది. కర్ణాటక బీజేపీకి ప్రయోగశాలగా మారిపోయిందని సీఎల్పీ నేత సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 15 ఏళ్లకే ఆరెస్సెస్ కార్యకర్త



కర్ణాటకలోని మాండ్యా జిల్లా బూకనకెరె గ్రామంలో లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన సిద్దలింగప్ప, పుట్టతాయమ్మ దంపతులకు 1943, ఫిబ్రవరి 27న జన్మించారు. 15 ఏళ్ల వయసులోనే ఆరెస్సెస్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపారు. తన స్వగ్రామం శికారిపురలో ఒక రైలు మిల్లులో పని చేశారు. ఆ మిల్లు యజమాని కుమార్తె మైత్రిదేవిని ప్రేమించి పెళ్లాడారు. ఆరెస్సెస్ శికారిపుర సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో బీజేపీలో చేరిన యడ్యూరప్ప 1983 నుంచి శికారిపుర ఎమ్మెల్యేగా ఏడు సార్లు ఎన్నికయ్యారు.

**తొలిసారి 2007లో..**

2007 నవంబర్‌లో తొలిసారి యడియూరప్ప సీఎం అయ్యారు. జేడీ(ఎస్) మద్దతు ఉపసంహరించడంతో ఆయన ఏడు రోజుల్లోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. 2008 మేలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడంతో రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. అక్రమ మైనింగ్ కేసులో లోకాయుక్త యడియూరప్పను దోషిగా తేల్చడంతో మూడేళ్లకే 2011 జులైలో సీఎం పదవిని వదులుకోవాల్సి వచ్చింది. వారం రోజులు జైల్లో ఉన్నారు.

**కొత్త పార్టీ.. మళ్లీ విలీనం**

ఆ తరువాత కర్ణాటక జనతా పక్ష (కేజేపీ) పేరుతో పార్టీ పెట్టారు. 2014లో కేజేపీని బీజేపీలో విలీనం చేశారు. 2018 ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీజేపీ గెలుచుకోవడంతో యడియూరప్ప మూడోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ బలనిరూపణకు 15 రోజుల సమయం ఇచ్చారు. కానీ, దీనిపై కాంగ్రెస్, జేడీ(ఎస్) కోర్టుకెక్కడంతో సుప్రీం కోర్టు వెంటనే బలాన్ని నిరూపించుకోవాలంటూ ఆదేశించింది. కేవలం 3 రోజులు మాత్రమే సీఎంగా ఉన్న యెడ్డీ మే 19న బలపరీక్షకు కాస్త ముందు రాజీనామా చేశారు.

## యడియూరప్ప వరాల జల్లు

కర్ణాటకలో రైతులు, చేనేత కార్మికులకు సీఎం యడియూరప్ప వరాలు ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద ఎంపికైన రైతులకు అదనంగా రూ.4000ను రెండు విడతల్లో అందజేస్తామని తెలిపారు. ఈ పథకం కింద కేంద్రం ఏటా రూ.6 వేలు అందిస్తుందన్నారు. అలాగే చేనేత కార్మికులకు రూ.100 కోట్ల మేర ఉన్న అప్పులను మాఫీ చేస్తామని వెల్లడించారు. రైతుల రుణమాఫీ విషయంలో అన్నిపక్షాలను సంప్రదించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ఆవులు ఆక్సిజన్ ఇస్తాయి: ఉత్తరాఖండ్ సీఎం

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి, బీజేపీ నేత త్రివేంద్ర సింగ్ రావత్ విచిత్రమైన వ్యాఖ్యలు చేశారు. శ్వాసక్రియలో భాగంగా ఆవులు ఆక్సిజన్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌నే వదులుతాయని ఆయన సెలవిచ్చారు. ఆవులను నిమరడం ద్వారా అనేక శ్వాసకోశ సమస్యలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే గోవులకు సమీపంలో నివసిస్తే ట్యూబర్ క్యూలోసిస్(టీబీ) కూడా తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఆవు పాలు, మూత్రం సుగుణాలను ఆయన సభికులకు వివరించారు. డెహ్రాడూన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో రావత్ ఈ వ్యాఖ్యలు చేయగా, అందుకు సంబంధించిన వీడియో శుక్రవారం వెలుగులోకిరావడంతో ఒక్కసారిగా దుమారం చెలరేగింది. దీంతో ఈ వివాదంపై సీఎం కార్యాలయం(సీఎంవో)లోని ఉన్నతాధికారి ఒకరు స్పందిస్తూ.. ఉత్తరాఖండ్‌లో సాధారణంగా ప్రజలు నమ్మేదాన్నే సీఎం చెప్పారని తెలిపారు. మరోవైపు అన్ని జీవుల్లాగే ఆవులు కూడా ఆక్సిజన్ తీసుకుని కార్బన్ డయాక్సైడ్ విడిచిపెడతాయనీ, రావత్ వ్యాఖ్యల్లో ఎంత మాత్రం నిజం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

## అమెరికా ఎన్నికల ప్రచారంలో యోగా

**వాషింగ్టన్:** డెమోక్రాట్ల తరఫున అమెరికా అధ్యక్ష పదవికి అభ్యర్థిత్వం కోరుతున్న టిమ్ రియాన్ (46) తన ఎన్నికల నిధుల కోసం సరికొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఎన్నికల నిధులను సమకూర్చుకునేందుకు, అమెరికాలోని ముందస్తు ఆరోగ్య పరిరక్షణ విధానానికి ప్రజల మద్దతును కూడగట్టేందుకు యోగాను ఉపయోగించుకోనున్నారు. డెమోక్రాట్ల తరఫున అధ్యక్ష పదవికి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న వారు సుమారు 24 మంది ఉన్నారు. యోగా శిక్షణ శిబిరంలో పాల్గొని తనతో యోగా చేసేందుకు ఒక్కొక్కరూ మూడు డాలర్లను విరాళంగా ఇవ్వాల్సిందిగా టిమ్ రియాన్ ప్రజల్ని కోరుతున్నారు. యోగా శిక్షణ శిబిరానికి విరాళాలు ఇచ్చిన వారిలో కొంతమందిని డ్రా ద్వారా ఎంపిక చేసి వారికి న్యూయార్క్ ట్రిప్పును కల్పిస్తామని..టిమ్ రియాన్ ఓ ప్రకటనను కూడా విడుదల చేశారు.

## భారత్ నుంచి పాక్‌కు టీకాలు

**ఇస్లామాబాద్:** దాయాది దేశమైన పాక్, భారత్ నుంచి భారీ స్థాయిలో టీకాలను దిగుమతి చేసుకుంది. గత 16 నెలల్లో రూ. 250 కోట్ల విలువ చేసే యాంటీ–రేబిస్, యాంటీ–వీనమ్ వ్యాక్సీన్లను కొనుగోలు చేసినట్లు ది నేషన్ వార్తాపత్రిక గురువారం కథనాన్ని ప్రచురించింది. భారత్ నుంచి కొనుగోలు చేస్తున్న టీకాల వివరాలు, స్వదేశంలో తయారు చేస్తున్న టీకాల వివరాలను తెలపాల్సిందిగా, పాక్ సెనెటర్ రెహ్మాన్ మాలిక్ ఆ దేశ జాతీయ ఆరోగ్య సేవలు విభాగాన్ని కోరారు. దీనికి సమాధానంగా ఎన్‌హెచ్‌ఎస్ ఓ నివేదికను ఆయనకు అందించింది. తయారీకి తగిన వనరులు లేనందునే వ్యాక్సీన్లను భారత్ నుంచి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. భారత్–పాక్‌ల మధ్య ద్వైపాక్షిక సమస్యలు ఉన్నప్పటికీ వీటి దిగుమతి మాత్రం కొనసాగుతోంది.

## 50 శాతం కుటుంబాలకు ఆకలికేకలే!

**కరాచీ:** పాకిస్తాన్ పోషకాహార లోపంతో కొట్టుమిట్టాడుతోంది. దేశంలో కనీసం రెండు పూటలా పోషకాహారం తీసుకోలేని కుటుంబాలు 50 శాతానికి పైగా ఉన్నాయని శుక్రవారం ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ ఓ కథనం ప్రచురించింది. పేదరికం వల్ల పిల్లలు పోషకాహార లేమికి గురయ్యారని జాతీయ ఆరోగ్య సేవల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'జాతీయ పోషకాహార సర్వే 2018' తెలిపినట్లు ఆ కథనం వెల్లడించింది. పిల్లల ఆరోగ్య స్థితిని అధికారులకు తెలియజేయడమే లక్ష్యంగా 4 ప్రావిన్సుల్లో ఈ సర్వే జరిగింది.

## కలాం అప్పుడే చెప్పారు: డీఆర్‌డీవో చైర్మన్



**న్యూఢిల్లీ:** భారత రత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం మృతిచెందడానికి నెల రోజుల ముందు, పునర్వినియోగ క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిందిగా తనకు సూచించారని డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్ రెడ్డి తాజాగా చెప్పారు. కలాం చనిపోయే నాటికి సతీశ్ రెడ్డి రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారుగా ఉన్నారు. తాను ఆ బాధ్యతలు చేపట్టిన తర్వాత కలాంను కలవడానికి ఆయన నివాసానికి వెళ్లినప్పుడు కలాం ఈ సలహా ఇచ్చారని సతీశ్ రెడ్డి తెలిపారు. 'క్షిపణులు వాటి పే లోడ్‌ను ప్రయోగించిన అనంతరం మళ్లీ వెనక్కు వచ్చి, ఇంకో పే లోడ్‌ను తీసుకెళ్లేలా ఉండాలి. అలాంటి సాంకేతికత అభివృద్ధి చేయండి' అని కలాం తనకు సూచించారని సతీశ్ రెడ్డి గుర్తుచేసుకున్నారు.



పార్లమెంట్ ఆవరణలో మొక్క నాటుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# భారత ఖ్యాతిపై బురదజల్లేందుకే..

- మూకదాడులకు నిరసనగా ప్రధానికి లేఖ రాసిన వారికి కౌంటర్
- కంగనా రనౌత్, ప్రసూన్ జోషి సహా 61 మంది లేఖ



కంగనా రనౌత్



ప్రసూన్ జోషి

**ముంబై:** అంతర్జాతీయంగా భారత్ ఖ్యాతికి నష్టం వాటిల్లేలా, ప్రధాని నరేంద్ర మోదీపై బురద చల్లేందుకే కొందరు పనికట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని హీరోయిన్ కంగనా రనౌత్ సహా 61 మంది బాలీవుడ్ ప్రముఖులు బహిరంగ లేఖ రాశారు. మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని, ద్వేషపూరిత నేరాలు పెరుగుతున్నాయని 49 మంది ప్రముఖులు ప్రధానికి ఇటీవల లేఖ రాసిన లేఖకు వీరు కౌంటర్ ఇచ్చారు. మంచి పాలన అందించేందుకు, మనవత్వాన్ని చాటేందుకు, నిజమైన జాతీయవాదాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తున్న నరేంద్రమోదీ ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఇలా చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో గీత రచయిత ప్రసూన్ జోషి, డ్యాన్సర్ సోనల్ మాన్‌సింగ్, డైరెక్టర్లు మధుర్ భండార్కర్, వివేక్ అగ్నిహోత్రి తదితరులు ఉన్నారు. మూకదాడులకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ చాలాసార్లు మాట్లాడారని గుర్తు చేశారు. మూక దాడులపై చట్టాలు చేసుకునేందుకు రాష్ట్రాలకు మోదీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారన్నారు. పేదలు నక్సలిజం, ఉగ్ర బాధితులుగా మారినప్పుడు ఈ మేధావులంతా ఏం చేశారని ప్రశ్నించారు. భారత్‌ను విడగొట్టాలని కశ్మీర్‌లో వేర్పాటువాదులు డిమాండ్ చేసినప్పుడు, పాఠశాలలను దహనం చేస్తామని హెచ్చరించినప్పుడు వీరంతా ఎక్కడికి పోయారన్నారు. జై శ్రీరాం అని నినదిస్తే హత్యలు చేసినప్పుడు, కశ్మీర్ లోయ నుంచి కశ్మీరీ పండిట్లను, ఉత్తరప్రదేశ్‌లోని ఖైరానా నుంచి హిందువులను వెళ్లగొట్టినప్పుడు వీరెందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

# ఆజం ఖాన్‌పై మండిపడ్డ మహిళా లోకం

- సభలో బేషరతు క్షమాపణ చెప్పాల్సిందిగా స్పీకర్ ఆదేశం!
- లేని పక్షంలో ఖాన్‌పై చర్యలు తీసుకునేందుకు స్పీకర్‌కు అధికారం



**న్యూఢిల్లీ:** లోక్‌సభ డెప్యూటీ స్పీకర్, బీజేపీ ఎంపీ రమాదేవిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకుగాను సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎదుట హాజరై, అనంతరం సభలో బేషరతుగా క్షమాపణ చెప్పాలని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ ఆజం ఖాన్‌కు స్పీకర్ కార్యాలయం తెలిపినట్లు సమాచారం. క్షమాపణ చెప్పకపోతే ఆజం ఖాన్‌పై చర్యలు తీసుకునేలా స్పీకర్‌కు అధికారమిస్తూ సభలో ఓ తీర్మానం చేసేందుకు అన్ని పార్టీలూ ఒప్పుకున్నాయి. అన్ని పార్టీల నాయకులతో స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన ఓ సమావేశం నిర్వహించి ఆజం ఖాన్ అంశంపై చర్చించారు. అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ ఆజం ఖాన్ క్షమాపణ చెప్పకపోతే ఆయనపై చర్యలు తీసుకునే అధికారాన్ని స్పీకర్‌కు లోక్‌సభ ఇస్తుందని తెలిపారు. డీఎంకే ఎంపీ కనిమొళి, బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఎన్సీపీకి చెందిన సుప్రియా సూలే, తృణమూల్ ఎంపీ మిమి చక్రవర్తి, అప్నాదళ్ ఎంపీ అనుప్రియా పటేల్ తదితర మహిళా ఎంపీలతోపాటు బీజేపీ నాయకురాలు జయప్రద కూడా ఆజంఖాన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆజం ఖాన్‌ను ఈ లోక్‌సభ నుంచి పూర్తిగా బహిష్కరించేలా ఆయనను ఐదేళ్లపాటు సస్పెండ్ చేయాలని రమాదేవి డిమాండ్ చేశారు.

# హడావుడి ఆమోదం వద్దు

**రాజ్యసభ చైర్మన్‌కు విపక్షం లేఖ**

**న్యూఢిల్లీ:** ఎలాంటి అధ్యయనం జరిపే అవకాశం ఇవ్వకుండా పార్లమెంట్లో హడావుడిగా బిల్లులను ఆమోదింపజేయడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది భారత పార్లమెంటు సంప్రదాయం కాదన్నాయి. కీలక బిల్లులపై విపక్షాల గళాన్ని వినిపించే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించాయి. ఈ మేరకు 17 విపక్ష పార్టీలు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడుకు లేఖ రాశాయి. 'బిల్లులను ఆమోదించే విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును మేం గర్హిస్తున్నాం. బిల్లుల్లోని అంశాలను అధ్యయనం చేసేందుకు స్థాయి సంఘానికి కానీ, ఎంపిక సంఘానికి కానీ పంపించకుండా హడావుడిగా ఆమోదానికి ప్రయత్నించడం సరికాదు. ఇది మనం అనుసరిస్తున్న సంప్రదాయం కాదు. దీనిపై మా వేదనను, ఆందోళనను మీ దృష్టికి తీసుకువస్తున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, బహుజన్ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం తదితర 17 పార్టీల నేతలు ఆ లేఖపై సంతకం చేశారు. 14వ లోక్‌సభలో 60% బిల్లులను, 15వ లోక్‌సభలో 71% బిల్లులను పార్లమెంటరీ కమిటీల అధ్యయనం కోసం పంపించారన్నారు. కాగా, గత 16వ లోక్‌సభలో 26% బిల్లులను మాత్రమే పార్లమెంటరీ కమిటీల పరిశీలనకు పంపించారని, ప్రస్తుత 17వ లోక్‌సభలో తొలి సమావేశాల్లోనే 14 బిల్లులను కమిటీల పరిశీలనకు పంపించకుండానే ఆమోదించారని వారు ఆ లేఖలో గుర్తు చేశారు. మరో 11 బిల్లులు ఆమోదం కోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విషయంలో రాజ్యసభ చైర్మన్‌గా జోక్యం చేసుకొని, న్యాయం చేయాలని వెంకయ్యనాయుడుని కోరారు.

**మరణశిక్షకు మెజారిటీ రాష్ట్రాలు సై**

దారుణమైన నేరాలకు మరణశిక్షే సరైనదిగా మెజారిటీ రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయని కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. మరణశిక్షను ఎత్తివేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రదీప్ తమ్టా ప్రవేశపెట్టిన ప్రైవేటు బిల్లుపై చర్చలో భాగంగా కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఉగ్రవాదం, యుద్ధ కారణాలు తప్ప ఇతర కేసుల్లో ఉరిశిక్షను ఎత్తివేయాలంటూ 2015 ఆగస్టులో న్యాయ కమిషన్ సూచించింది.

# బీజేపీ మౌనం ప్రమాదం: ప్రియాంక



**న్యూఢిల్లీ:** వాహన తయారీ రంగం మందగమనంతో కొనసాగితే పది లక్షల ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందంటూ వచ్చిన మీడియా రిపోర్టుపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ స్పందించారు. ఈ విషయంపై బీజేపీ మౌనం వహించడం ప్రమాదకరమని శుక్రవారం ట్వీట్ చేశారు. ఉపాధి కోల్పోవడం, అమ్మకాలు తగ్గడం, ఆర్థిక స్థితిని దెబ్బ తీస్తున్న పాలసీల మీద బీజేపీ మౌనం ప్రమాదకరమన్నారు. ఆర్థిక మందగమనం కారణంగా వాహన తయారీ విభాగంలో దాదాపు 10 లక్షల ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని వాహన తయారీ సంఘం (ఏసీఎమ్ఏ)నాయకులు గురువారం మీడియాకు తెలిపారు. ఏసీఎమ్ఏ అధ్యక్షుడు రామ్ వెంకటరమణ్ మాట్లాడుతూ వాహన రంగం మీద ఆధారపడే వాహన విభాగ రంగం మనుగడ సాగిస్తోందని, వాహన తయారీ ఖర్చులో 15–20 శాతం ధరను తగ్గించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

# ఆదర్శనీయంగా మా పాలన

**'50 రోజుల నివేదిక' విడుదల చేసిన జేపీ నడ్డా**



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రెండోసారి ఏర్పాటైన ప్రభుత్వం తొలి 50 రోజుల్లో సాధించిన విజయాలు, పనితీరుపై ఓ నివేదికను అధికార బీజేపీ శుక్రవారం విడుదల చేసింది. ఈ 50 రోజుల్లో తమ ప్రభుత్వ పనితీరు ఆదర్శనీయంగా ఉందనీ, సానుకూలా మార్పువైపునకు వెళ్తోందని బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాలు, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థను బలోపేతంపై తమ ప్రభుత్వం ప్రముఖంగా దృష్టి పెట్టిందని ఆయన వెల్లడించారు. బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక తొలిసారిగా శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. చిన్నారుల రక్షణ, దేశ భద్రత తదితర అంశాలపై తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసించిన నడ్డా, ఇటీవల లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందిన బిల్లులను కూడా ప్రస్తావించారు. కేంద్ర మంత్రులు ప్రకాశ్ జవదేకర్, పియూష్ గోయల్‌లు కూడా ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆర్థికవ్యవస్థ వృద్ధిలో వేగం పెంచడం కోసం 44 కార్మిక చట్టాలను తమ ప్రభుత్వం నాలుగు ప్రధాన చట్టాలుగా మార్చి సంస్కరణలు తీసుకు వచ్చిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం తొలి 50 రోజుల్లో తీసుకున్న నిర్ణయాలు, ఇంతకుముందు 50 ఏళ్లలో మనం చూసినవాటికంటే ఉత్తమమని నడ్డా పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి ఎదిగేందుకు తమ ప్రభుత్వం మౌలిక వసతుల రంగంపై ఖర్చు చేయబోయే కోటి కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని నడ్డా తెలిపారు.

# కార్గిల్ విజయానికి 20 ఏళ్లు

- ఘనంగా నివాళులర్పించిన రాష్ట్రపతి, ప్రధాని
- అమర సైనికులను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది: కోవింద్
- సైనికుల ధైర్యసాహసాలను ఈ రోజు గుర్తుచేస్తుంది: మోదీ



భోపాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుపాకీతో గురి చూస్తున్న బాలిక

**న్యూఢిల్లీ:** కార్గిల్ యుద్ధంలో భారత్ గెలిచి శుక్రవారానికి 20 ఏళ్లయిన సందర్భంగా రణభూమిలో అమరులైన భారత సైనికులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ సహా పలువురు ఘనంగా నివాళులర్పించారు. 1999 మే 3 నుంచి జూలై 26 వరకు పాక్‌తో జరిగిన యుద్ధంలో చివరకు భారత్ విజయం సాధించింది. దాదాపు 500 మంది భారత సైనికులు ఈ యుద్ధంలో అమరులయ్యారు. ఆర్మీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ 'జూలై 26 కార్గిల్ విజయదినోత్సవంగా ఎప్పటికీ నిలిచిపోతుంది. ద్రాస్, కక్సర్, బతాలిక్, టుర్టోక్ సెక్టార్లలో మన సైనికులు గొప్పగా పోరాడారు' అని తెలిపింది. త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల చీఫ్‌లు వరుసగా జనరల్ బిపిన్ రావత్, అడ్మిరల్ కరమ్‌వీర్ సింగ్, బీఎస్ ధనోవా ద్రాస్‌లో ఉన్న కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. నాడు యుద్ధంలో 17 స్క్వాడ్రన్‌కు కమాండింగ్ అధికారిగా పనిచేసిన ధనోవానే నేడు వాయుసేన చీఫ్‌గా ఉన్నారు.

**ద్రాస్‌కు వెళ్లలేక పోయిన కోవింద్**

ద్రాస్‌లోని యుద్ధ స్మారకం వద్ద జరిగే కార్యక్రమానికి త్రివిధ దళాధిపతులతోపాటు వారికి అధిపతి అయిన రాష్ట్రపతి కోవింద్ కూడా హాజరై నివాళి అర్పించాలన్నది ప్రణాళిక. అయితే వాతావరణం బాగాలేకపోవడంతో కోవింద్ వెళ్లలేకపోయారు. దీంతో ఆయన కశ్మీర్‌లోని బదామీ బాగ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 15 కార్ప్స్ ప్రధాన కార్యాలయంలో యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించారు.



అమరులకు రాష్ట్రపతి కోవింద్ నివాళి

**యుద్ధక్షేత్రంలో తన ఫొటోలను పోస్ట్ చేసిన మోదీ**

అమరవీరులకు ప్రధాని మోదీ ట్విట్టర్ వేదికగా నివాళులర్పించారు. 'భారత సైనికుల కోసం నేను విజయదినోత్సవం రోజున ప్రార్థిస్తున్నాను. మన సైనికులు ధైర్యం, సాహసం, అంకిత భావాన్ని ఈ రోజు గుర్తు చేస్తుంది. మాతృభూమిని కాపాడేందుకు సర్వస్వాన్ని అర్పించిన శక్తిమంతమైన యుద్ధ వీరులకు నివాళి' అని పేర్కొన్నారు. యుద్ధం సమయంలోఅక్కడికి వెళ్లినప్పుడు తీసుకున్న ఫొటోలను కూడా మోదీ పోస్ట్ చేశారు.

## పోరుకు దిగే సామర్థ్యం పాక్‌కు లేదు: రాజ్‌నాథ్

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో మాట్లాడుతూ సైనికుల చెక్కుచెదరని ధైర్యం, గొప్ప త్యాగం కారణంగానే నేడు మన దేశం సరిహద్దులు భద్రంగా, పవిత్రంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం భారత్‌తో పూర్తిస్థాయి లేదా పరిమిత కాలపు యుద్ధం చేసే సామర్థ్యం పాకిస్తాన్‌కు లేదని ఆయన పేర్కొన్నారు. 'మన పొరుగుదేశం (పాకిస్తాన్) ఇప్పుడు మనతో నేరుగా యుద్ధం చేయలేక పరోక్ష యుద్ధానికి దిగుతోంది' అని రాజ్‌నాథ్ చెప్పారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పించారు. కార్గిల్ యుద్ధంపై చర్చ జరగాలని సభలో కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌధురి డిమాండ్ చేశారు. అటు రాజ్యసభలో చైర్మన్ వెంకయ్య నాయుడు సైనికులు ధైర్య సాహసాలను పొగిడారు. వారి త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరువదన్నారు. సభ్యులు లేచి నిల్చొని మౌనం పాటించి అమర సైనికులకు నివాళి అర్పించారు.

సాక్షి
శనివారం, జూలై, 27

# 'తక్షణ తలాక్'పై ఇంత తొందరేల?

తక్షణ తలాక్ విధానం ద్వారా విడాకులిచ్చే దురాచారాన్ని అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును గురువారం లోక్‌సభ ఆమోదించింది. తలాక్ బిల్లు లోక్‌సభ ముందుకు రావడం ఇది మూడోసారి. ప్రభుత్వానికి ఆధిక్యత ఉన్న ఆ సభలో తొలి రెండుసార్లూ బిల్లుకు సులభంగానే ఆమోదముద్ర పడినా, రాజ్యసభలో విపక్షానికి మెజారిటీ ఉండటంతో అక్కడ సాధ్యం కాలేదు. ఇప్పుడైతే రాజ్యసభ ఆమోదం అసాధ్యం కాదన్న విశ్వాసంతో ప్రభుత్వం ఉంది. మధ్యలో నిరుడు సెప్టెంబర్‌లో ఒకసారి ఆర్డినెన్స్ కూడా జారీ అయింది. కానీ తాజా బిల్లును గమనిస్తే ఇన్నాళ్లుగా వ్యక్తమవుతున్న ప్రధాన అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణించదల్చుకోలేదని అర్థమవుతుంది. ముస్లిం మహిళలకు సమస్యగా మారిన తక్షణ తలాక్ విధానం ఉండరాదన్న నిర్ణయంతో ఎవరూ విభేదించడం లేదు. ముస్లిం పర్సనల్ లా గుర్తిస్తున్న తక్షణ తలాక్ విధానం చెల్లదని, అది రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం రెండేళ్లక్రితం తీర్పునిచ్చినప్పుడే చాలామంది దాన్ని హర్షించారు. మన రాజ్యాంగం భిన్న మతాలకుండే వైయక్తిక చట్టాలను (పర్సనల్ లా) గుర్తించింది. కానీ ఏ చట్టమైనా రాజ్యాంగం నిర్దేశించిన స్త్రీ, పురుష సమానత్వానికి లోబడి ఉండాల్సిందే. వివక్షనూ, ఆధిపత్య ధోరణిని ప్రోత్సహించే ఏదైనా చెల్లుబాటు కాదు. ఒకసారి సర్వోన్నత న్యాయస్థానం చెప్పాక ఆ విధానంలో ఎవరైనా విడాకులివ్వడానికి ప్రయత్నిస్తే అది చెల్లుబాటు కాదు. నిజానికి అందుకు చట్టం అవసరం కూడా లేదు. అయినా చట్టం అవసరమని ప్రభుత్వం భావిస్తే కాదనేవారుండరు. కానీ తక్షణ తలాక్ చెప్పడాన్ని దానికదే నేరంగా పరిగణించడం సరికాదని బిల్లును వ్యతిరేకిస్తున్నవారంటున్నారు. మొదట్లో బిల్లు తీసుకొచ్చినప్పుడు ఉన్న నిబంధనను ప్రభుత్వం స్వల్పంగా మార్చింది. భార్య లేదా ఆమె తరపు రక్త సంబంధీకులు, బంధువులు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మార్చారు. అలాగే దాన్ని రాజీకి వీలైన నేరంగా కూడా పరిగణిస్తూ ప్రతిపాదించారు. మొదట్లో ఉన్నట్టు ఇది నాన్ బెయిలబుల్ కేసుగానే ఉన్నా విచారణ సమయంలో బెయిల్ పొందేందుకు వీలు కల్పించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా తక్షణ తలాక్‌ను నేరంగా పరిగణించరాదన్న ప్రధాన సూచనను మాత్రం ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఏ వైయక్తిక చట్టమైనా వివాహాన్ని సివిల్ ఒప్పందంగానే పరిగణిస్తుంది. భార్యాభర్తలిద్దరిలో ఎవరైనా ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించిన పక్షంలో రెండోవారు దాంపత్య హక్కుల పునరుద్ధరణ కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. అది లభించని పక్షంలో పరిహారాన్ని కోరవచ్చు. గృహ హింస చట్టం కింద కేసు పెట్టవచ్చు. అంతేతప్ప ఉల్లంఘించినవారిని నేరస్తులుగా పరిగణించే విధానం లేదు. సివిల్ ఒప్పందాన్ని ఉల్లంఘించే ఇతర మతాలవారి విషయంలో లేని నిబంధన ముస్లిం పురుషులకు ఎందుకుండాలన్నది బిల్లును వ్యతిరేకిస్తున్నవారి అభ్యంతరం. ఇది రాజ్యాంగం ప్రవచిస్తున్న సమానత్వ సిద్ధాంతానికి విరుద్ధం కాదా? ఇందువల్ల ముస్లిం మహిళలకు కలిగే మేలేమిటో కూడా అర్థం కాదు. భర్త నిరాదరించిన పక్షంలో ఒంటరైన మహిళ వెంటనే కోరుకునేది జీవనం సాగించడానికి అవసరమైన మొత్తం. న్యాయస్థానం ఆ మొత్తాన్ని భర్త నుంచే ఇప్పించాలి. కానీ ఈ బిల్లు చట్టమయ్యాక భర్త జైలు పాలైతే ఆ పరిహారాన్ని అతను చెల్లించడం ఎలా సాధ్యం? అతడు చెల్లించలేని పక్షంలో ఆమెకు పరిహారం దక్కేదెలా? పైగా వివాహంలో పొరపొచ్చాలు వచ్చినప్పుడు సహజంగానే ఇద్దరినీ మళ్లీ ఒకటి చేయడానికి అందరూ ప్రయత్నిస్తారు. తక్షణ తలాక్ చెప్పిన భర్తపై మహిళ ఆవేశంతో కేసు పెట్టి అరెస్టు చేయిస్తే అలాంటి రాజీ యత్నాలకు అసలు వీలుంటుందా? ఈ బిల్లు చట్టమైతే ఇలాంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి. సుప్రీంకోర్టు కూడా తక్షణ తలాక్ చెల్లదని చెప్పిందే తప్ప, దాన్ని నేరపూరిత చర్యగా పరిగణించాలని అనలేదు.

చర్చ సందర్భంగా బిల్లును వ్యతిరేకించినవారు దాన్ని స్థాయీ సంఘానికి పంపాలని కోరారు. ఆ సూచన ఆహ్వానించదగ్గది. అక్కడైతే బిల్లును సంపూర్ణంగా అధ్యయనం చేయడానికి, మార్పులు సూచించడానికి ఆస్కారం ఉంటుంది. అయితే దీన్ని వెనువెంటనే తీసుకురావాల్సిన అవసరం ఉన్నదన్న మంత్రి అందుకు కారణం చెప్పారు. 2017 జనవరి నుంచి ఇంతవరకూ దేశవ్యాప్తంగా తక్షణ తలాక్‌తో విడాకులిచ్చిన ఉదంతాలు 547 జరిగాయని వివరించారు. అలాగే సుప్రీంకోర్టు ఇది చెల్లుబాటు కాదని చెప్పాక కూడా 345 ఉదంతాలు చోటుచేసుకున్నాయన్నారు. నిరుడు సెప్టెంబర్‌లో ఆర్డినెన్స్ తీసుకొచ్చినప్పుడు ఆయన చెప్పిన గణాంకాలను ఒకసారి ప్రస్తావించుకోవాలి. వాటి ప్రకారం అప్పటికి తక్షణ తలాక్ ఉదంతాలు 430 జరిగాయి. అంటే ఆ తర్వాత ఇంత వరకూ... అంటే ఈ పది నెలలకాలంలో కొత్తగా 117 ఉదంతాలు జరిగాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో ముస్లింల జనాభా దాదాపు 17.5 కోట్లు. ఇన్ని కోట్లమందిలో తక్షణ తలాక్ విధానం ఆచరిస్తున్నవారు ఎంత తక్కువమందో మంత్రి చెప్పిన గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అయితే తక్కువ సంఖ్యలో చోటుచేసుకుంటున్నాయి గనుక తక్షణ తలాక్ రద్దు వద్దని ఎవరూ అనరు. కానీ ఆదరాబాదరాగా తీసుకురావలసిన అగత్యం లేదు. ఒక చట్టం చేయదల్చుకున్నప్పుడు దానిపై అన్ని కోణాల్లోనూ చర్చించడం, ఎలాంటి పర్యవసానాలుండగలవో ఆలోచించడం, అందరి అభిప్రాయాలూ పరిగణనలోకి తీసుకోవడం అవసరం. అప్పుడు మాత్రమే ఏ చట్టమైనా సమగ్రంగా ఉంటుంది. అసహాయులకు ఆసరాగా నిలుస్తుంది. ఆదరాబాదరాగా తీసుకురావడం వల్ల, సూచనలను పెడచెవిన పెట్టడం వల్ల ఆశిస్తున్న ఫలితం రాదు. తాము ముస్లిం మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడదల్చుకున్నామని, వారికి అన్యాయం జరగకుండా చూడదల్చుకున్నామని మంత్రి అంటున్నారు. కానీ ఈ బిల్లు ఆ ఉద్దేశాన్ని నెరవేర్చే దాఖలా కనబడటం లేదు. కేంద్రం మరోసారి ఆలోచించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి బ.దశమి ప.3.26 వరకు తదుపరి ఏకాదశి, నక్షత్రం కృత్తిక సా.4.24 వరకు తదుపరి రోహిణి, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ఉ.5.39 నుంచి 7.21 వరకు, అమృతఘడియలు... ప.1.54 నుంచి 2.34 వరకు.

**సూర్యోదయం :** 5.40
**సూర్యాస్తమయం:** 6.32
**రాహుకాలం :** ఉ. 9.00 నుంచి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుంచి 3.00 వరకు

# కన్నడ కురువృద్ధుడి మాట నెగ్గేనా?


శేఖర్ గుప్తా

**పరిమాణం రీత్యా దేశంలోని మధ్య స్థాయి రాష్ట్రాల్లో ఒకటైన కర్ణాటక ఇంతవరకు తిరుగులేని అధికారం చలాయిస్తున్న అమిత్ షా, నరేంద్రమోదీలకు తొలి సవాలు విసిరింది. బీజేపీ చరిత్రలో ఏ ఒక్కరికీ సాధ్యపడని రీతిలో ఆ పార్టీ అధిష్టానాన్నే రాజీపడేలా చేశారు యడియూరప్ప. ముఖ్యంగా బీజేపీలో 75 సంవత్సరాలు నిండిన వారు ఏ ముఖ్యపదవులూ చేపట్టరాదనే వయోపరిమితి నిబంధనను యడియూరప్ప ధిక్కరించారు. అవినీతి విషయంలో ఎవరినీ మినహాయించేది లేదంటూ బీజేపీ నిర్దేశించుకున్న మరో ముఖ్య సూత్రాన్ని కూడా వదులుకునేలా చేశారు. అవినీతి ఆరోపణలతో గతంలో సీఎం పదవికి రాజీనామా చేసి పోటీ పార్టీ పెట్టిన తాను మినహా పార్టీకి మరో దిక్కులేదని ఆయన నిరూపించుకున్నారు. ఇది మిగతా రాష్ట్రాల్లోని బీజేపీ సీనియర్ నేతలకు కూడా ప్రేరణ నిస్తుందా అనేది ప్రశ్న.**

కర్ణాటక రాజకీయపరంగా చూస్తే భారతదేశంలో అత్యంత ముఖ్యమైన రాష్ట్రమయితే కాదు. లోక్‌సభకు అది అందిస్తున్న ఎంపీల సంఖ్య ప్రాతిపదికన చూస్తే కేరళ (2), మధ్యప్రదేశ్ (29)కి మధ్య స్థాయిలో ఉండే రాష్ట్రమది. కానీ గత కొన్ని నెలలుగా పతాక శీర్షికల్లో లభించే ప్రాధాన్యతను బట్టి చూస్తే కర్ణాటక ఈ రెండు రాష్ట్రాలను చాలాసార్లు అధిగమించినట్లే చెప్పాలి. ఇప్పుడు బీజేపీ కర్ణాటకలో మళ్లీ అధికారంలోకి వచ్చిన తరుణంలో రాష్ట్రం ప్రశాంతంగా విజయ సంబరాలను గడుపుకుంటుదని మనం ఊహించవచ్చు కానీ వాస్తవ పరిస్థితులను చూస్తే చాలా కలవరం, వ్యాకులత కలుగుతోంది.

మరింత వివరంగా చెప్పాలంటే.. పరిమాణం రీత్యా దేశంలోని మధ్య స్థాయి రాష్ట్రాల్లో ఒకటైన కర్ణాటక ఇంతవరకు తిరుగులేని అధికారం చలాయిస్తున్న అమిత్ షా, నరేంద్రమోదీలకు తొలి సవాలు విసిరింది. మనం మరింత స్పష్టత కోసం చూద్దాం. ఈ ఘనతకు కారణం ఆ రాష్ట్రం కాదు.. తన సొంత పార్టీలో ఊహించలేనంత అధికార కుట్రను ముందుకు తీసుకువచ్చిన బీఎస్ యడియూరప్పకే మొత్తం ఘనత దక్కుతుంది. బీజేపీ చరిత్రలో ఏ ఒక్కరికీ సాధ్యపడని రీతిలో ఈ వ్యక్తిమాత్రుడు ఆ పార్టీ అధిష్టానాన్నే రాజీపడేలా చేశాడు.

### వయోపరిమితి నిబంధనకు చెక్

బీజేపీలో 75 సంవత్సరాలు నిండిన వారు ఏ ముఖ్యపదవులూ చేపట్టరాదనే వయోపరిమితి నిబంధనను యడియూరప్ప ధిక్కరించారు. ఇప్పుడాయనకు 76 ఏళ్లు. ఆ వయసులో ఉన్న పార్టీ నేతలు ఎవరైనా సరే గవర్నరుగా రాజ్‌భవన్‌కో లేక పార్టీ మార్గదర్శక మండలికో వెళ్లాల్సి ఉంటుందని మోదీ, షాల నేతృత్వంలోని పార్టీ తేల్చి చెప్పింది. 2014 నుంచి బీజేపీ మొత్తం నాయకత్వ శ్రేణిని గమనించినట్లయితే, బహుశా ఇద్దరు మాత్రమే 75 ఏళ్లు దాటిన తర్వాత కూడా కేబినెట్ ర్యాంకును నిలుపుకోగలిగారు. అది కూడా చాలా కొద్ది కాలం మాత్రమే వారు మనగలిగారు. వారిలో తొలివ్యక్తి నజ్మా హెప్తుల్లా. ఈమె ఇంఫాల్ రాజభవన్‌కు చెక్కేశారు. ఇక రెండవవ్యక్తి కల్‌రాజ్ మిశ్రా. మంత్రివర్గం నుంచి ఉద్వాసన పిలుపు వచ్చేవరకు ఈయన నరేంద్రమోదీని ఆకాశానికి ఎత్తడంలోనే మునిగిపోయారు. అయినప్పటికీ ఈయన కూడా సిమ్లాలోని రాజ్‌భవన్‌కు బయలుదేరక తప్పింది కాదు.

మోదీ, షాల నాయకత్వం విధించిన ఈ వయోపరిమితి నిబంధనను బీజేపీలో ఎవ్వరు కూడా తోసిపుచ్చిన ఘటన జరగలేదు. మోదీని శాశ్వత ప్రధానిగా ఉండాలని డిమాండు చేస్తున్న బీజేపీ నేతలు కూడా మోదీకి 75 ఏళ్లు నిండాక ఎన్డీఏ మూడవ దఫా పాలనలో ప్రధాని ఎవరు కాగలరు అనే అంశంపై అంచనాలు వేసుకోవడం ఉత్తమమన్న అభిప్రాయానికి వచ్చేశారు. ఇక్కడే యడియూరప్ప ప్రత్యేక ప్రాభవం, అధికారం స్పష్టమవుతుంది. 75 ఏళ్లనాటికి మోదీ పదవీవిరమణ చేస్తారు అనే అభిప్రాయం కూడా ఇప్పుడు చెల్లని కాసులా మారవచ్చేమో మరి. ఒక చిన్న స్థాయి రాష్ట్రానికి ఈ విషయంలో మినహాయింపు నిచ్చినప్పుడు అతిశక్తిమంతుడైన మోదీ విషయంలో అది ఎందుకు సాధ్యపడదు?

ఎన్నిరకాలుగా చూసినా, యడియూరప్ప.. మోదీ, షాల ముఖ్యమంత్రులు జాబితాలో ఆదర్శప్రాయ స్థానంలోనే ఉన్నారు. 2014 నుంచి మోదీ, షాలు ముఖ్యమైన రాష్ట్రాల్లో నియమించిన ముఖ్యమంత్రుల జాబితాను చూడండి. వీరిలో ఏ ఒక్కరూ తమ తమ రాష్ట్రాల్లోని అధిపత్య కులానికి చెందినవారు కారు. జాట్లు రాజ్యమేలుతున్న హరియాణాలో మనోహర్ లాల్ ఖట్టర్ సాంప్రదాయ విరుద్ధమైన పంజాబీగా మిగిలిపోయారు. ఇక జార్కండ్‌లో ఆదివాసీలకు అధికారాన్ని తోసిపుచ్చారు. మహారాష్ట్రలో సీఎం పదవిని చేపట్టిన యువ బ్రాహ్మణుడు దేవేంద్ర పడ్నవిస్ అక్కడి మరాఠాల దృష్టిలో అంగుష్టమాత్రుడు మాత్రమే. అస్సాంలో సైతం అతి శక్తిమంతుడైన హిమంత బిస్వా శర్మ తనకంటే తక్కువ పలుకుబడి కలిగిన శరబానంద సోనోవాల్ నేతృత్వంలో పనిచేయాల్సి వస్తోంది.

### జాతిహితం



### స్వయంసిద్ధంగా ఎదిగిన ప్రాంతీయ నేత

బీజేపీ అధికారిక నమూనా ప్రకారం ఆ పార్టీకి ఇద్దరు అగ్రనేతలు మాత్రమే అవసరం. వారు కూడా ఢిల్లీలోనే నివసిస్తుంటారు. మిగిలిన వారు ఆ ఇద్దరి ఆమోదంతో విశ్వాసంగా సేవ చేస్తుంటారు. కానీ యడియూరప్ప ఆ నిబంధననే తోసిపుచ్చేశారు. స్వయంసిద్ధంగా ఎదిగిన లీడర్‌గా ఆయన ప్రకటించుకున్నారు.

యడియూరప్ప ఆధిపత్య కులానికి చెందిన నేత మాత్రమే కాదు. పదే పదే అధిష్టానాన్ని ధిక్కరించే అసమ్మతివాదిగా ఉంటూవస్తున్నారు. పార్టీ తనను అధికారం నుంచి తొలగించినప్పుడు తన అనుయాయి అయిన సదానంద గౌడను తన స్థానంలో పార్టీ నియమించేలా ఒత్తిడి తీసుకొచ్చారు. అతడిని సైతం అస్థిరత్వానికి గురి చేసినప్పుడు యడియూరప్ప వేరే మార్గం లేక తిరుగుబాటు చేసి తనదైన రాజకీయ పార్టీని ఏర్పర్చి 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 6 ఎంపీ స్థానాలు మాత్రమే గెల్చుకున్నారు కానీ, లింగాయతుల ఓట్లను తాను కైవసం చేసుకోవడం ద్వారా 224 స్థానాలున్న కర్ణాటక అసెంబ్లీలో బీజేపీకి 40 సీట్లకు దించివేశారు.

### కన్నడ రాజకీయాల్లో అపర చాణక్యుడు

అవినీతి విషయంలో ఎవరినీ లెక్కచేసేది లేదంటూ బీజేపీ నిర్దేశించుకున్న మరొక ముఖ్య సూత్రాన్ని కూడా అది వదులుకునేలా చేశారు యడియూరప్ప. తన తొలి హయాంలో ఆయన లోకాయుక్త తీవ్ర విమర్శ కారణంగా అధికారం కోల్పోయారు, కొంత కాలం జైల్లో గడిపారు. తర్వాత ఆ కేసునుంచి బయటపడ్డారు. కానీ ఆయను అధికారం నుంచి తప్పించిన కారణంగా, ఎవరికీ ప్రశాంతత దక్కలేదు. దీంతో బీజేపీకి ఒకే అసెంబ్లీలో ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చాల్సి వచ్చింది.

దీని పర్యవసానం ఎంతవరకు వెళ్లిందంటే 2013లో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో యడియూరప్పను తిరిగి పార్టీలోకి తీసుకురావడమే కాదు.. తిరుగులేని ప్రాంతీయ నేతగా ఆయనకు పూర్వ స్థానం కూడా బీజేపీ కట్టబెట్టాల్సి వచ్చింది. ఇది మోదీ–షాల బీజేపీకి శాపంలాంటిది. పోల్చి చూడాలంటే గుజరాత్‌లో శంకర్ సింగ్ వాఘేలా ఉదంతాన్ని చూద్దాం. అత్యంత సమర్థుడు, కరుడు గట్టిన ఆరెస్సెస్ భావజాలం కలిగిన వాఘేలా బీజేపీనుంచి ఫిరాయించి కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రి అయ్యారు. కానీ బీజేపీ ఆయనకు మళ్లీ ఎన్నడైనా గుజరాత్‌ని అప్పగించిందా?

వయస్సు, కులం, అవినీతి, విశ్వసనీయతా పరీక్ష వంటి అన్నింటినీ తోసిపుచ్చుతూ, యడియూరప్ప తన పార్టీనే ఒత్తిడికి గురిచేసి కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వాన్ని కూల్చి, ఆ మరుక్షణమే తమ ప్రభుత్వాన్ని ఏర్పర్చడంలో ఘనవిజయం సాధించారు. దీనికి భిన్నంగా మోదీ షా ద్వయం ముందుగా కర్ణాటకలో రాష్ట్రపతి పాలన విధించి కొంతకాలం తర్వాత తమసొంత ప్రభుత్వాన్ని ఏర్పర్చే పంథాకే ప్రాధాన్యం ఇచ్చి ఉంటారు. తద్భిన్నంగా అసాధారణంగా, ప్రయోజన రహితంగా యడియూరప్పకు అధికారం కట్టబెట్టక తప్పని పరిస్థితికి వారిద్దరూ లోనయ్యారు.

### ముగియని రాజకీయ క్రీడ

అయితే కర్ణాటకలో రాజకీయ తమాషా ఇంకా ముగియలేదు. స్పీకర్ ఒక తార్కిక ముగింపు పలుకుతూ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించి, ప్రస్తుత అసెంబ్లీ కాలం ముగిసేంతవరకు వారిని పోటీచేయకుండా నిషేధించి కోర్టులు ఈ సమస్యను పరిష్కరించేంతవరకు ప్రస్తుత సంక్షోభాన్ని పొడిగించవచ్చు. రాజకీయ క్రీడ ఇంకా ముగియలేదు. కనీసం బీజేపీ కోరుకుంటున్న తరహాలో అయితే ఇది ముగింపుకు చేరలేదు.

బీజేపీ నేటి ప్రమాణాల బట్టి చూస్తే ఈ కన్నడ కురువృద్ధుడి పలుకుబడి తిరుగులేని విధంగా ఈ సంక్షోభ సమయంలో వెల్లడయింది. యడియూరప్ప విజయం బీజేపీకి, దాని అధిష్టానానికి పంపే సందేశం ఏమిటంటే కర్ణాటకలో యువ నాయకత్వాన్ని నిర్మించుకోవడంలో అది విఫలమైందనే. రాష్ట్రంలో తన ప్రత్యర్థి అనంత్ కుమార్ ఆకస్మిక మరణం యడియూరప్పకు ఎంతగానో కలిసొచ్చింది. అంతకంటే ముఖ్యంగా నరేంద్రమోదీ పలుకుబడిపై ఆధారపడి కర్ణాటక అసెంబ్లీని గెలుచుకోలేమని బీజేపీ గుర్తించింది. తన హిందూ ఓటు బ్యాంకు లోపలే ఎదిగివచ్చిన తన సొంత నాయకుడి కుల ఓటు బ్యాంకు విసిరే సవాలును ఎదుర్కోవడం బీజేపీకి ఇదే తొలిసారి.

### మోదీ–షాలకు తొలి సవాల్

ఇతర రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు కూడా ఈ పరిణామాన్ని గమనించవచ్చు. ఇతర రాష్ట్రాల్లోని బీజేపీ ప్రాంతీయ నాయకులు యడియూరప్ప తరహాలో విజయం సాధించిన స్థితిలో లేరు. రాజస్థాన్‌లో వసుంధరా రాజే ప్రస్తుతం అధిష్టానం తన అనుయాయులను తొక్కివేస్తూ తన ప్రత్యర్థులను అందలమెక్కిస్తున్న తీరును చూస్తూ ఊరకుంటున్నారు. ఇక మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్‌ను గద్దె దింపడానికి తగినంత బలాన్ని, వనరులను శివరాజ్ సింగ్ చౌహాన్‌కు బీజేపీ అగ్రనాయకత్వం కల్పించడం లేదు. కానీ కర్ణాటక మినహాయింపు నుంచి స్ఫూర్తి పొందగల బీజేపీ నాయకులు మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో ఉన్నారు. చివరకు యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ కోవలోకే రావచ్చు.

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

---

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



## సోషల్ మీడియా

### లేఖ



"ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కొంతమంది తాము ఆందోళన చెందుతున్న ప్రత్యేక అంశంపై దృష్టి సారించవలసిందిగా కోరుతూ బహిరంగ లేఖ రాస్తారు. మొదట లేఖ రాసిన వారిపట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ మరికొందరు కూడా ప్రధాని మోదీకి లేఖ రాస్తారు. మొదట వారు జై శ్రీరామ్‌ను ఆయుధంగా మార్చారు. ఇప్పుడు వారు బహిరంగ లేఖలను కూడా ఆయుధాలుగా మారుస్తున్నారు"

– సిద్ధార్థ, నటుడు

### ఇన్నేళ్లకి



"ఇందుకు కేవలం 40 ఏళ్లు పట్టిందంతే. చిట్టచివరికి నన్ను మెచ్చుకోవడానికి మా అమ్మకు అవకాశం చిక్కింది. మా కుటుంబం అంతటిలో మా అమ్మాయి వీణ ఒక్కతే పండ్లు సరిగ్గా తింటుందని అభినందించింది. తానేమీ జోక్ చేయడం లేదనీ, నన్ను చూసి పండ్లు ఎలా తినాలో నేర్చుకోవచ్చని చెప్పింది"

– వీణా వేణుగోపాల్, రచయిత్రి

### శాంతి



"ఆఫ్ఘనిస్తాన్ కోల్పోయిన శాంతిని తిరిగి నెలకొల్పాలని పాకిస్తాన్, అమెరికా నిర్ణయించుకున్నాయి. అయితే, అది మిలటరీ బలగాలతో సాధ్యం కాదు. పాక్ ఎప్పుడూ రాజకీయ పరిష్కారం కోసమే ప్రయత్నించింది. ఇంతకుముందు కంటే ఇప్పుడు ఆ పరిష్కారానికి మేము చేరువలో ఉన్నాం"

– షా మహ్మద్ ఖురేషీ, పాక్ మంత్రి

### దుర్దినం



"భారత్‌లో ప్రజాస్వామ్యానికి ఎంతటి దుర్దినమో. మనం మళ్లీ రేపటి నుంచి పోరాటం మొదలు పెట్టాలి. సమాచార హక్కు రాజ్యాంగ హక్కు అనే కొత్త నినాదంతో ఉద్యమం ప్రారంభించాలి. మీరంతా కూడా ఈ ఉద్యమంలో పాల్గొంటారుగా?"

– నిఖిల్ డే, సామాజిక కార్యకర్త

### కర్ణాటకం



"పన్నెండు మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించినా, వారి రాజీనామాలను ఆమోదించినా కర్ణాటక శాసనసభలో భారతీయ జనతా పార్టీ బలాన్ని చాటుకోవడానికి తగిన మెజారిటీ ఉందనుకోవడం పొరపాటు. రాజీనామాలపై స్పీకర్ రమేష్ కుమార్ ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 220. బీజేపీకి ఉన్న సభ్యుల సంఖ్య కేవలం 105 మంది మాత్రమే. బలనిరూపణకు బీజేపీకి ఇంకో అరడజనుమంది సభ్యులు అవసరం"

– శ్రీనివాసన్ జైన్, జర్నలిస్ట్

---

# తూర్పున వాలిన సూర్యుడు


శ్రీరమణ

తెలుగు సాహిత్య వీధుల్లో అర్ధ శతాబ్ది పాటు రంగు రంగుల వెలుగుపూలు పూయించిన సిద్ధుడు, అసాధ్యుడు శ్రీకాంత శర్మ. 1944లో గోదావరి జిల్లా రామచంద్రాపురంలో పుట్టారు. సంస్కృతాంధ్రాలలోనే కాక ఆంగ్లంలో సైతం మంచి పట్టు సాధించారు. కొద్దికాలం బడిలో పాఠాలు చెప్పారు. ఆనక పత్రికా రంగానికి వచ్చి ఒక ప్రముఖ వార పత్రిక సంపాదక వర్గంలో కుదురుకున్నారు. 1976లో విజయవాడ ఆకాశవాణిలో స్క్రిప్ట్ రైటర్‌గా శర్మని తీసుకున్నారు. ఎలాగంటే– ఆ ఉద్యోగానికి అర్హత ఉన్నత విద్యతోబాటు గరిష్టంగా 30 ఏళ్ల వయస్సు. అప్పుడు స్టేషన్ డైరెక్టర్‌గా బాలాంత్రపు రజనీకాంతరావు ఏలుతున్నారు. ఎలాగైనా ఇంద్రగంటివారి అబ్బాయిని రేడియోలోకి లాగితే స్టేషన్ బాగుపడుతుందనుకున్నారు. అన్నిట్లో నెగ్గిన శ్రీకాంత శర్మ ఆకాశవాణిలో ఉద్యోగం సంపాయించారు. తీరా చేరాక, అన్నిరకాల రాత కోతల్లో శర్మ తల, చేతులు పెట్టాక, ఢిల్లీ నుంచి రజనీకి శ్రీముఖం వచ్చింది. మన విధి విధానాల్లో వయసు పరిమితి 30 కదా. శ్రీకాంత శర్మకి 32 కదా అంటూ తాఖీదిచ్చారు. రజనీ అంటే అప్పటికే అతడనేక యుద్ధముల నారితేరిన గడుసు పిండం. మంచిదనిపిస్తే ముందు చేయదలచిన పనులు పూర్తి చేసి తర్వాత సమర్థించుకోవడమే ఆయనకు తెలుసు. 'అయ్యా, మన నిబంధనావళిలో ప్రిఫరబ్లీ 30 ఇయర్స్ అని ఉండటం చేతనూ, కుర్రవాడు చాకు అవడం చేతనూ రెండేళ్లని పక్కన పెట్టడం జరిగింది. అయినా, ఇకపై ఇలా హద్దు మీరడం ఉండదని మనవి' అని జవాబిచ్చారు. చవగండాలు తప్పుకుని

### అక్షర తూణీరం

శ్రీకాంత శర్మ, ఏకు మేకై 1996 దాకా ఆకాశవాణిని సేవించారు. శర్మ పాడింది పాటగా విజయవాడ రేడియో నడిచింది. ఎన్ని పల్లవులు? ఎన్ని పాటలు? ఎమ్మెస్ శ్రీరాం అంటే ప్రఖ్యాత వైణికులు ఈమని శంకరశాస్త్రి మేనల్లుడు. ఆయన రేడియోలో సంగీత శాఖాధిపతిగా ఉన్నప్పుడు, శర్మకి ట్యూన్‌లు చెప్పి పాటలు ఇమ్మన్నాడు. ఆ ఒరవడిలో ఉరవడిలో వచ్చిన తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా.. పాట. అప్పటికీ ఇప్పటికీ ఎంతో ప్రాచుర్యం పొందిన శర్మ పాట. శర్మ మనసులో పాట అలవోకగా పల్లవిస్తుంది. పరిమళిస్తుంది. 'శ్రావణాన మధురమైన వలపు తలపు తేనె సోన..., కనరే నీలి వెన్నెల..., తెరపు మరపు మనసులో విరజాజి వెన్నెల నీడలో...' ఇలా తెంపు లేకుండా రసికుల జ్ఞాపకాల్లోంచి వస్తూనే ఉంటాయ్. దేవులపల్లి కృష్ణ శాస్త్రీయం బలంగా ఆవహించి ఉన్నా, చెట్టు ఇస్మాయిల్ ధోరణి ఆవరించి ఉన్నా, శేషేంద్ర మధ్య మధ్య పలకరిస్తున్నా సకాలంలో వైదొలగి తన సొంత కక్ష్యలో ఏ ఉల్కల బారినా పడకుండా హాయిగా పరిభ్రమిస్తూనే గడిపారు. ప్రోజు, పొయిట్రీ, పద్యం, నాటకం, పత్రికారచన– ఇలా అన్ని ప్రక్రియల్ని వెలిగించి పూయించారు శ్రీకాంత శర్మ. మితంగానే అయినా మంచి పాటలు సినిమాలకి రాశారు. కృష్ణ శాస్త్రి, భుజంగ రాయశర్మల తర్వాత వెంపటి చినసత్యం మేష్టారికి కూచిపూడి నృత్యరూపక కర్తగా ఆ స్థాయిని నిలబెట్టారు. నలభై పైబడిన మా స్నేహంలో ఎన్నో జ్ఞాపకాలు, మరెన్నో అనుభవాలు. చివరిదాకా హాస్యోక్తులతోనే మా మాటలు సాగాయి. శర్మ కాగితం మీదికి వస్తేనే సీరియస్‌గానీ లేదంటే హ్యామరే!

శర్మ చాలా తరచుగా మద్రాసు వచ్చేవారు. నాతోనే ఉండేవారు. ఒకసారి వచ్చినప్పుడు మా అబ్బాయ్ అక్షరాభ్యాసం నిర్ణయమైంది. సామగ్రిని పిల్లాణ్ణి తీసుకుని రమణ గారింటికి వెళ్లాం. వాళ్లిద్దరి చేతా చెరో అక్షరం దిద్దించాలని సంకల్పం. తీరా అక్కడికి వెళ్లాక 'మేం కాదు. ఇక్కడీ సాహితీ శిఖరం ఉండగా మేమా, తప్పు' అంటూ బాపురమణ మా అబ్బాయిని శర్మగారి ఒళ్లో కూర్చోబెట్టి అక్షరాభ్యాసం చేయించారు. ఆ సన్నివేశం అలా సుఖాంతమైంది. కొన్నాళ్లు గడిచాయ్. బళ్లో మావాడి ప్రోగ్రెస్ కార్డు ఎప్పుడొచ్చినా, కాపీ తీయించి శర్మకి పోస్ట్ చేసేవాణ్ణి. 'ఇదేంటండీ, నన్నీ విధంగా హింస పెడుతున్నారు. నేను వద్దు మొర్రో అంటున్నా వినకుండా నాతో దిద్దబెట్టించారు. నేనెప్పుడూ లెక్కల్లో పూరే. వాడికి లెక్కల్లో తోకలేని తొమ్మిదులు, తలలేని ఆర్లు వస్తుంటే నాదా పూచీ' అంటూ జవాబులు వస్తుండేవి. అయ్యా, లెక్కలు సరే. తెలుగూ అట్లాగే ఉంది. 'స్నానం పోసుకోవడం' లాంటి మాటలొస్తున్నాయ్ అనే వాడిని.

ఆప్తమిత్రుని అనారోగ్యం మాటలు వింటూనే ఉన్నా, ఇప్పుడే ఇంతటి విషాద వార్త వింటానని అనుకోలేదు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రికి నేనంటే ఎంతో వాత్సల్యం. నాకో మంచి ముందుమాట రాశారు. శ్రీకాంత శర్మ సరేసరి. శ్రీమతి జానకి బాల, పిల్లలు మా స్నేహం నించి హితంగా సన్నిహితంగానే ఉన్నాం. ఇంద్రగంటి వారితో మూడు తరాల అనుబంధం. ఇంటిల్లి పాదీ మాటలకోర్లు. ఎప్పుడు కలిసినా ఎన్నాళ్లున్నా టైము మిగిలేది కాదు. శర్మ పార్థివ దేహాన్ని కడసారి దర్శించడానికి వెళ్లినపుడు దుఃఖం పెల్లుబికి వచ్చింది. మోహనకృష్ణ తన సినిమాకి తండ్రి రాసిన పాట గురించి ప్రస్తావించారు. కిరణ్మయి కూడా తనకు రాసిన పాట చెప్పింది. ప్రయోజకులై, బుద్ధిమంతులై, తల్లిదండ్రులను నడిపిస్తూ ఉండే పిల్లలున్న తండ్రి మా శ్రీకాంత శర్మ అన్పించింది. నా కళ్లలోంచి ఆనంద బాష్పాలు రాలాయి. స్నేహశీలికి అశ్రు తర్పణం.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# స్వర మోహితుడు సినారె



తెలంగాణ వైతాళికుడు, తెలంగాణ ముద్దుబిడ్డ సినారెగా పిలువ బడుతున్న సింగిరెడ్డి నారాయణ రెడ్డి మాటలో చమత్కారం, చూపులో గాంభీర్యం, పంచెకట్టు రూపం మదిలో చెరగని ముద్ర వేసింది. బుచ్చమ్మ, మల్లారెడ్డి పుణ్య దంపతులకు 29 జూలై 1931న పూర్వ కరీంనగర్ జిల్లా హనుమాజీపేటలో జన్మించారు. పక్కింట్లో సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతున్న సందర్భంలో కొడుకు పుట్టాలని తల్లి మొక్కుకున్నందుకు పుట్టినందున సింగిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అని పేరు పెట్టారు తల్లిదండ్రులు. బడిలో చేరినప్పుడు సి.నారాయణరెడ్డి అని రాయడం వలన ఆ పేరే స్థిరపడింది. ప్రాథమిక విద్యను జన్మస్థలమైన హనుమాజీపేటలో, నాల్గవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు సిరిసిల్లలో, ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు కరీంనగర్‌లో, ఇంటర్మీడియట్ చాదర్‌ఘాట్‌లో విద్యాభ్యాసం కొనసాగింది. బి.ఏ, ఎం.ఏ. తెలుగు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు. 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు–ప్రయోగములు' అనే అంశంపై ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి 1962లో పిహెచ్.డి. పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే తెలుగు ఉపన్యాసకులుగా మొదలైన ఉద్యోగ జీవితం అంచెలంచెలుగా ఎదిగి రీడర్, ఆచార్యులుగా రాణించారు. ఎంతో మంది శిష్య ప్రశిష్యుల అభిమానాన్ని పొందారు.

అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా, రాజ్యసభ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి సలహాదారుగా, అధ్యక్షులుగా ఎన్నో పదవులు నిర్వహించి తనదైన ముద్రవేశారు. పాలనాదక్షునిగా కూడా అందరి మన్ననలు పొందారు. ఇటీవలే 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తెలంగాణ (ఆంధ్ర) సారస్వత పరిషత్ అధ్యక్షులుగా చివరి ఘడియల వరకు కొనసాగి తనవంతు బాధ్యతగా పరిషత్ అభివృద్ధికై ఎంతో కృషి చేశారు. 'సామాజిక చైతన్య ప్రబోధమే నా కవిత్వ ప్రధాన లక్ష్యం' అని చెప్పుకున్న సినారె వివిధ సాహిత్య ప్రక్రియలలో అనేక గ్రంథాలు రాసి, నూతన కవన ప్రయోగాలు చేసి తరువాతి కవులకు మార్గదర్శకులయ్యారు.

హైస్కూల్ దశలోనే సీతాపహరణం, ప్రహ్లాద చరిత్ర, భలేశిష్యులు పద్య నాటకాలు రాసి, ప్రదర్శిస్తూ దర్శకత్వం, పాత్రధారణ కూడా చేసి అందరి మెప్పులు పొందిన సినారె ఇంటర్‌లో హైదరాబాద్‌లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో సభ్యునిగా చేరి ఆధునికాంధ్ర గ్రంథాలు గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, జాషువా, కరుణశ్రీ, శ్రీశ్రీ రచనలు చదివానని చెప్పుకున్నారు. 'ప్రత్యేకంగా శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి ప్రభావంతో రచనలు చేశా. తర్వాత కాలంలో ఎంఏలో వున్నప్పుడు నవ్వని పువ్వు, అజంతా సుందరి గేయ నాటికల రచనలతో సొంత గొంతు రేకులు విచ్చుకుంద'ని సినారె చెప్పారు.

'నాది ప్రగతిశీల మానవీయ దృక్పథం. దీనికి ఎన్నో అంచులున్నాయి. ఒక్కొక్క అంచులో ఒక్కొక్క సామాజికాంశం, మానవీయ పార్శ్వం ప్రతిఫలిస్తుందని, అయితే ఆయా సన్నివేశాలు నన్ను పురిగొల్పినపుడు కొన్ని దళిత సంబంధిత కవితలతో పాటు స్త్రీల సమస్యలకు సంబంధించిన కవిత్వం రాశా. నా కవిత్వం పుట్టుకతోనే అంటే పాదులోనే రెండు మొక్కలున్నాయి. ఒకటి పద్యం, రెండవది గీతం, ఎన్నో లలిత గీతాలు రాశా, అటు కావ్య కవిగా, ఇటు సినీ గేయ కవిగా సమాంతరంగా సాగిపోవడం ఒక విశేషమని' తెలిపారు. 1962లో గులేబకావళి కథ సినిమాలో రాసిన 'నన్ను దోచుకుందు వటే వన్నెల దొరసాని' అనే పాటతో ప్రారంభమైన సినీ గేయ ప్రస్థానం దాదాపు 3,500 పాటలు రాసే దాకా సాగింది.

ఆయన కవిత్వంలో పల్లె, పట్నం, కరీంనగర్ జీవయాస, ప్రౌఢ భాషా భూషణాలను సైతం దర్శించవచ్చు. అంత్యప్రాసలు, చక్కని పదబంధాలు, కవితాధార, ఘల్లుఘల్లు శబ్దాల స్వరమోహితుడై ఈ మహా కవన సముద్రాన్ని ఇష్టపడనివాళ్ళు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. మాట, పాట, కవితలోని భావన పాఠకుల చెవులకు ఎంతో ఇంపుగా ఉండి మనలను కట్టిపడేస్తాయి. సినారె ఖాతాలో ఎన్నో సన్మానాలు, అవార్డులు, బిరుదులు చేరాయి. పద్మశ్రీ, పద్మభూషణ్, కళా ప్రపూర్ణ బిరుదుతో పాటు రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీల అవార్డులు, మొదలుకొని జ్ఞానపీఠ్ వరకు ఎన్నో ఉన్నాయి. విద్యావేత్తగా, కవిగా, రచయితగా, పరిశోధకునిగా, వక్తగా, భాషావేత్తగా, పరిపాలనాదక్షునిగా, పార్లమెంటు సభ్యునిగా బహుముఖ ప్రజ్ఞను కనబరిచారు సినారె.

(సినారె 88వ జయంతి సందర్భంగా ఈ నెల 29న 'విశ్వంభర' జాతీయ అవార్డును ప్రముఖ కన్నడ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు ఆచార్య చంద్రశేఖర కంబార స్వీకరిస్తున్న సందర్భంగా..)

డాక్టర్ చీదెళ్ళ సీతాలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ (విశ్రాంత) । మొబైల్ : 94903 67383

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

ప్రపంచ సమస్య

# పనే చెయ్యని మగాళ్లతో కలిసి పని చేసేదెలా?!

**మగవాళ్లు ఆడవాళ్ల మీద వేసుకునే జోకులు 'బాయిష్'గా ఉంటాయి. కానీ, ఆడవాళ్లు మగవాళ్ల మీద వేసుకునే జోకులు 'గర్లిష్'గా ఉండవు. మెచ్యూరిటీతో ఉంటాయి. మగవాళ్లకు ప్రకృతి ప్రసాదించిన ఈ ఎదుగుదల లేమి ఆడవాళ్ల పనితీరుపై నెగటివ్‌గా ప్రభావం చూపితే, ఆడవాళ్లకున్న ఈ మెచ్యూరిటీ మగవాళ్ల పనితీరును మెరుగుపరిచేలా ఉంటుంది!**

● మాధవ్ శింగరాజు

బ్రిటన్‌లో బుధవారం ప్రభుత్వం మారింది. పార్టీ అదే. కన్సర్వేటివ్ పార్టీ. థెరెసా మే తప్పుకుని, ఆమె ప్లేస్‌లోకి బోరిస్ జాన్సన్ అనే ఆయన ప్రధానిగా వచ్చారు. ఆయన జుట్టు పాలిపోయిన పసుపు రంగులో (బ్లాండ్) ఉంటుంది. మనిషి పరుగులు తీసే (బాయెంట్) పాదరసంలా ఉంటారు. ఇక ఆయన మూడో ఆనవాలు విదూషకత్వం (బఫూనిష్). ఈ మూడు గుర్తింపులను కలిపి అక్కడవాళ్లకు జాన్సన్ తరచూ బ్లాండ్, బాయంట్, బఫూనిష్‌గా ప్రస్తావనలోకి వస్తుంటారు. థెరెసా మే ప్రధానిగా ఉన్న ఈ మూడేళ్లూ వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్‌లో ఆమెను వేపుకు తినేందుకు విఫలయత్నం చేసిన ఐడెంటిటీ కూడా జాన్సన్‌కి ఉంది. వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్ ఆ దేశ పార్లమెంటు భవనం. ప్రధాని పదవీకాలం ఐదేళ్లు అయినప్పటికీ థెరిసా మే మూడేళ్లకే మెట్లు దిగేయడానికి పార్టీలో ప్రధాన కారకుడు జాన్సనే! థెరెసా మంత్రివర్గంలో జాన్సన్ విదేశాంగ కార్యదర్శిగా ఉండేవారు. గత ఏడాది జూలైలో 'నాకు ఈ మంత్రి పదవి వద్దు. థెరెసా 'బ్రెగ్జిట్' విధానాలు నచ్చడం లేదు' అని జాన్సన్ బయటికి వచ్చేశారు. తర్వాత తన వాదనకు మద్దతు కూడగట్టుకున్నారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని అయ్యారు. ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్‌ను నష్టం, కష్టం లేకుండా థెరెసా బయటికి తీసుకురాలేక పోతున్నారని జాన్సన్ ఆరోపించారు కనుక ఇకపై ఆయనే బ్రిటన్‌ను సమాఖ్య నుంచి లాభంగా, లాఘవంగా బయటికి తెప్పించాలి. థెరెసా వల్ల కానిది జాన్సన్ వల్ల అవుతుందా! విదేశాంగ కార్యదర్శిగా ఉన్న రెండేళ్లూ జాన్సన్ బఫూనిష్‌గానే ఉన్నారు. లిబియాలో మారణ హోమం జరుగుతుంటే.. 'కుప్పలు తెప్పలుగా పడి ఉన్న శవాలనన్నింటినీ ఎత్తి పారేస్తే లిబియన్ నగరాలు మంచి టూరిస్ట్ స్పాట్‌లు అవుతాయి' అని ఆయన అనడం గురించి ఇప్పటికీ చెప్పుకుంటారు! క్రిటిక్స్ ఆయన్ని 'బ్రిటన్ ట్రంప్' అంటారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు బ్రిటన్ ప్రధాని అయ్యారు.

థెరెసా తప్పుకుని, జాన్సన్ ఎన్నికను ఎలిజబెత్ మహారాణి ఆమోదించాక గురువారం నాడు జాన్సన్ బ్రిటన్ కొత్త ప్రధానిగా తొలి ప్రసంగం చేస్తున్నప్పుడు థెరెసా పార్లమెంటు భవనంలోనే లేరు! ఆ సమయానికి ఆమె లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో ఐర్లండ్‌పై ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో ప్రతీకారం తీర్చుకుంటూ ఉన్న దృశ్యాలను ఎంతో ఇష్టంగా వీక్షిస్తూ కూర్చున్నారు. బ్రిటన్‌లో ఎన్నడూ లేనంతగా కాస్తున్న ఆ ఎండ పూట, నీడ పడుతున్న చోట ప్రత్యేక ఆతిథ్యంతో ఆసీనురాలై, అంచుకు చిన్న నిమ్మ చెక్క గుచ్చి తెచ్చిన గ్లాసులోని నిమ్మరసాన్ని స్ట్రాతో పీలుస్తూ, చిరునవ్వులు చిందిస్తూ ఆటను మొత్తం ఆస్వాదించారు. జాన్సన్ బాయిష్ టాక్‌లో వినేందుకు ఏముంటుందని ఆమె అనుకున్నట్లున్నారు. అంతకన్నా విశేషం ఆ ముందు రోజు జరిగింది.

> ఇక ఇప్పుడు ఎంపీగా మాత్రమే థెరెసా వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్‌కు వెళ్లి వస్తుంటారు. బ్రిటన్‌ను ఐరోపా సమాఖ్య నుంచి విడిపించడం కన్నా తక్కువ పనేం కాదు.. పని చేసే చోట బాయిష్ టాక్‌ను కట్టడి చెయ్యడం.


ప్రధాని పదవిని వదులుకున్నాక లార్డ్స్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా క్రికెట్ చూస్తున్న థెరెసా మే

బయటికి వెళుతున్న బ్రిటన్ ప్రధాని ఎవరైనా చివరి ప్రసంగం ఇవ్వవలసి ఉంటుంది. ప్రసంగం తర్వాత 'ప్రశ్నలు–జవాబుల' కార్యక్రమం ఉంటుంది. సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. ప్రధాని సమాధానాలు ఇవ్వాలి. ఆ సెషన్‌లో జో స్విన్‌సన్ అనే ఒక మహిళా ఎంపీ థెరెసాను అడిగారు.. ''దేశంలోని మహిళలకు మీరేం సలహా ఇస్తారు? పనిలో తమను మించినవారు లేరని ఊరికే చెప్పుకుంటూ తిరిగే మగాళ్లతో కలిసి పని చేయవలసి వచ్చినప్పుడు మహిళలు ఎలా డీల్ చెయ్యాలి?'' అని! ఒక్కసారిగా అంతా నవ్వేశారు. జాన్సన్‌ని దృష్టిలో పెట్టుకునే ఆమె ఆ ప్రశ్న అడిగారని అర్థమై థెరెసా నవ్వు ఆపుకున్నారు. సమాధానం చెప్పబోతుంటే నవ్వు అడ్డు పడి కాస్త ఆగారు. తర్వాత చెప్పారు. ''మై అడ్వైజ్.. (మళ్లీ నవ్వు).. మహిళలందరికీ నేను చెప్పేది ఒకటే. నిజాయతీగా పని చేయండి. పని చేస్తూనే ఉండండి. మీరు ఏ లక్ష్యం కోసం పని చేస్తున్నారో ఆ పనిని చేయడమే మీ లక్ష్యంగా చేసుకోండి'' అన్నారు. ప్రశ్న అడిగిన జో స్విన్‌సన్ 'లిబరల్ డెమోక్రాట్' పార్టీ తొలి మహిళా నాయకురాలు. ఈ వారంలోనే ఆమె తన పార్టీ లీడర్‌గా ఎన్నికయ్యారు. అధికారంలో ఉన్న 'కన్జర్వేటివ్', అపోజిషన్‌లో ఉన్న 'లేబర్' పార్టీలు కాకుండా బ్రిటన్ పార్లమెంటులో ఉన్న అనేక ఇతర పార్టీలలో లిబరల్ డెమోక్రాట్ కూడా ఒకటి. ఆ పార్టీ లీడర్‌గా ఎన్నికైనందుకు జో స్విన్‌సన్‌కు 'ప్రశ్నలు–సమాధానాలు' సెషన్‌లో థెరెసా అభినందనలు తెలిపారు. మిగతా పార్టీలలో కూడా చాలా వాటికి మహిళలు ఫ్లోర్ లీడర్‌లుగా ఉన్నారు. ఆ సంగతిని కూడా థెరెసా గుర్తు చేశారు. ''పని పట్ల మహిళల్లో ఉండే నిబద్ధతే వాళ్లకు పార్టీ నాయకత్వాన్ని దక్కిస్తుంది'' అన్నారు. అవన్నీ సున్నితంగా జాన్సన్‌ను ఉద్దేశించి అన్నవే. మరి నిబద్ధత ఉన్న థెరెసా ఎందుకని పార్టీ నాయకత్వం నుంచి, ప్రధాని పదవి నుంచి తప్పుకోవలసి వచ్చింది! గత ఏడాది డిసెంబరులో, ఈ ఏడాది జనవరిలో ఆమె రెండుసార్లు అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గినప్పటికీ.. బ్రెగ్జిట్ నిబంధనలు, షరతులపై ఏకాభిప్రాయం సాధించకపోతే కనుక ప్రధానిగా తప్పుకుంటానని గత మార్చిలో ప్రకటించారు కనుక ఆ మాటకు నిబద్ధురాలై ఆమె తన పదవిని వదులుకున్నారు. ఇక ఇప్పుడు ఎంపీగా మాత్రమే థెరెసా వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్‌కు వెళ్లి వస్తుంటారు. బ్రిటన్ ఐరోపా సమాఖ్య నుంచి విడిపించడం కన్నా తక్కువ పనేం కాదు బాయిష్ టాక్‌ను కట్టడి చెయ్యడం. ●


కొత్త ప్రధాని బోరిస్ జాన్సన్

థెరెసా మే


సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం
27-7-2019

**అయిదు ఎపిసోడ్లు..**
**తక్కువలో తక్కువంటే అయిదు హత్యలు!**
**మరి ఆత్మలేమైనా తక్కువ తిన్నాయా?**
**ఎవరి బాడీలో ఎప్పుడుంటాయో తెలీదు!**
**కథలో ట్విస్ట్‌లన్నిటినీ ఆ ఆత్మలే తిప్పుతాయి..**
**టైప్‌రైటర్.. అదో టైపు దయ్యం!**

● 'టైప్‌రైటర్'లో బార్డేజ్ విల్లా వారసురాలు జెన్నిగా పాలోమి ఘోష్

వెబ్ ఫ్లిక్స్

# దయ్యం టైప్ రైటర్

**1980** కాలం.. గోవా సెంట్రల్ జైల్

తాంత్రిక విద్యల్లో ఆరితేరినవాడు ఫకీర్. ఎదుటి వారి కళ్లల్లోకి నేరుగా చూస్తే చాలు వాళ్ల శరీరంలోంచి ఆత్మను లాగేయగలడని.. చేతులతో గుండెను పిండేయగలడని ప్రతీతి. అలా కొంతమంది ప్రాణాలు తీసిన నేరం కింద ఉరిశిక్షపడి జైల్లో ఉన్నాడు. చేతులకు బేడీలు, కళ్లకు గంతలతో. మరో రెండు రోజుల్లో ఉరి తీయనున్నారు అతణ్ణి.

మాధవ్ మాథ్యూ.. దయ్యాల కథలను వర్చువల్ రియాలిటీతో ఎక్స్‌పీరియెన్స్ అయ్యేలా రాయడంలో సిద్ధహస్తుడు. చిన్నా, పెద్ద అందరికీ ఫేవరేట్ రైటర్. కత్తగా రాయబోయే దయ్యం కథకు సబ్జెక్ట్ దొరక్క సతమతమవుతున్న అతనికి ఫకీర్ గురించి తెలిసి అతని జీవితాన్నే దయ్యం కథగా రాద్దామనుకుంటాడు.

''ఉత్తర గోవాలోని బార్డేజ్ తాలూకా, సుల్తాన్‌పూర్ గ్రామం మాది. నేనూ, అమ్మ (చారు) ఇద్దరమే మా కుటుంబం. అమ్మకు తాంత్రిక విద్యలు వచ్చినా ఎవరికీ ఏ చిన్న హానీ తలపెట్టలేని మంచి మనసు ఆమెది. కాని సమాజం ఏం చేసింది? మా ఇంటికి నిప్పుపెట్టి ఆమెను చంపేసింది. మా అమ్మలా ఉంటే లాభంలేదని.. అదే విద్యతో రాజ్యమేలడం మొదలుపెట్టా. ఉరితో నన్ను చంపాలనుకుంటున్నారు. కాని నాకు చావులేదు. శరీరం కోసం ఆత్మ తపిస్తూనే ఉంటుంది. చనిపోయిన మూడు రోజులకు మళ్లీ తన శరీరంలోకే వెళ్లేందుకు ప్రయత్నిస్తుంది. కుదరకపోతే బ్లడ్‌మూన్ డే నాడు ఎవరి శరీరం దొరికినా అందులోకి వచ్చేస్తుంది'' అని చెప్పుకుపోతాడు ఫకీర్. తర్వాత ఇదే ''ఘోస్ట్ ఆఫ్ సుల్తాన్‌పూర్'' అనే నవల రూపంలో బయటకు వస్తుంది. అయితే.. ఫకీర్ చెప్పిన చావులేదు అనే మాటలో నిజం ఎంతుందో కనుక్కోవడానికి ఫకీర్‌ను ఉరితీశాక అతని శవాన్ని ఇంటికి తెప్పిస్తాడు మాధవ్ మాథ్యూ జైల్లోని పోలీస్ ఇన్‌స్పెక్టర్ సహాయంతో. ఫకీర్ చనిపోయిన మూడో రోజు రాత్రి మాధవ్ మాథ్యూ ఇల్లు బార్డేజ్ విల్లాలో.. ఫకీర్ శవం ముందు మాధవ్, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మోసెస్ అనే వ్యక్తీ ఎదురు చూస్తుంటారు అతను తన శరీరంలోకి ఎలా వస్తాడోనని. ఎంత సమయం గడిచినా ఫకీర్ కళ్లు తెరవకపోయేసరికి ''ఫకీర్ చెప్పిందంతా హంబక్.. శవాన్ని తీసుకెళ్లిపోండి''అని అసహనం వ్యక్తం చేస్తాడు మాధవ్. పోలీస్ ఇన్‌స్పెక్టర్ శవాన్ని కదిలిస్తుండగా ఫకీర్ కళ్లు తెరుస్తాడు. ''సర్.. లేచాడు''అని గాభరాగా ఇన్‌స్పెక్టర్ చెప్పేసరికి ఏంచేయాలో తోచక కంగారుగా పక్కనే ఉన్న టైప్‌రైటర్‌తో ఫకీర్ తల మీద కొట్టి అతణ్ణి చంపేస్తాడు మాధవ్ మాథ్యూ. తర్వాత కొన్నాళ్లకు వయసు రీత్యా మాధవ్ కూడా మరణిస్తాడు.

ఇదీ ''టైప్‌రైటర్'' అనే వెబ్ సిరీస్‌లోని ముఖ్య భాగం. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది.

మిగతా కథ..

**ప్రెజెంట్ టైమ్స్.. బార్డేజ్ విల్లా..**

మాధవ్ మాథ్యూ మనవరాలు జెన్నీ, తన భర్త, ఇద్దరు పిల్లలతో ముంబై నుంచి బస మారుస్తుంది బార్డేజ్ విల్లాకు. అప్పటికే ఆ విల్లా అంటే దయ్యాల బంగ్లా అనే అభిప్రాయం బార్డేజ్ జనాల్లో. సమీరా, గబ్లూ, బంటీ అనే పదేళ్ల పిల్లలకేమో కుతూహలం ఆ బంగ్లాలోని దయ్యాన్ని చూడాలని.


● బార్డేజ్ విల్లా ప్రాంగణంలో ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌గా నటించిన పూరబ్ కోహ్లీతో లిటిల్ సోల్జర్స్ సమీరా, బంటి, గబ్లూ

దయ్యాలు, దయ్యాల కథలు అంటే చెవికోసుకోవడమే కాదు కళ్లు పీక్కుంటారు ఆ ముగ్గురు పిల్ల స్నేహితులు. వీలు దొరికినప్పుడల్లా స్కూల్ బంక్ కొట్టి ఆ విల్లా చుట్టే తచ్చాడుతుంటారు. ఈ పిల్లలకు బార్డేజ్ విల్లా పట్ల ఆసక్తి కలగడానికి ''ఘోస్ట్ ఆఫ్ సుల్తాన్‌పూర్'' నవలే కారణం. జెన్నీ పిల్లలిద్దరూ సమీరా వాళ్ల స్కూల్లోనే చేరడంతో వాళ్లతో ఫ్రెండ్‌షిప్ చేస్తారు సమీరా, గబ్లూ, బంటి. ఆ వంకతో ఆ విల్లాలోకి అడుగుపెట్టొచ్చనే ఆశతో. మరోవైపు జెన్నీ వాళ్ల ఆ బంగ్లాలోకి చేరడంతోనే అక్కడ పాడైపోయిన పాత టైప్‌రైటర్ కనపడుతుంది. దాన్ని బయటపడేయ్యమని ఇల్లు సర్దడానికి వచ్చిన ఓ వ్యక్తికి పురమాయిస్తుంది జెన్నీ. కాని ఆమె కూతురు పడేయనివ్వదు. నిరాశగా వెనుదిరుగుతాడు ఆ వ్యక్తి. నిజానికి అతను సామాన్లు సర్దడానికి వచ్చిన వ్యక్తి కాదు. ఆ ఇంట్లో ఉన్న టైప్‌రైటర్‌ను అపహరించడానికి వచ్చిన మనిషి. సమీరా స్కూల్లోనే పనిచేసే అమిత్ రాయ్ అనే మ్యాథ్స్ టీచర్ ఆ వ్యక్తికి ఆ దొంగతనాన్ని అప్పజెప్తాడు. ఒట్టి చేతులతో వెళ్లడమే కాక.. ఎఫర్ట్స్ పెట్టినందుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో సిరామిక్ ఫ్లోరింగ్ మీద నీళ్లు చల్లి ఆ వ్యక్తి కాలు జారి కిందపడి చచ్చిపోయేలా చేస్తాడు అమిత్ రాయ్.


● బార్డేజ్ విల్లా

**జెన్నీ అండ్ జెన్నీ**

జెన్నీ వాళ్లింట్లో పనికి కుదురుతుంది ఒకావిడ. ఆమెకు ఆ ఇంట్లో జెన్నీ రూపంలో ఇద్దరు కనపడ్తూంటారు. వాళ్లలో అసలు జెన్నీ ఎవరో తెలియక.. అందరూ అనుకున్నట్టుగానే ఆ ఇంట్లో దయ్యం ఉందన్న భయంతో ఇంట్లోంచి పారిపోతుంది. వెళ్తూ వెళ్తూ మార్గమధ్యంలోనే రక్తం కక్కి చచ్చిపోతుంది. ఆ మరుసటి రోజు మాధవ్ మాథ్యూ ఫ్రెండ్ జేమ్స్.. జెన్నీ కలిసి..బార్డేజ్ బంగ్లాలో దయ్యం ఉందని.. దాన్ని కనిపెట్టి బయటకు తరిమేయాలని చెప్తాడు. ''ముందు నిన్ను పంపిస్తాను'' అంటూ జేమ్స్‌ను చంపేస్తుంది. ఆ హత్యను చూస్తుంది సమీరా. షాక్ అవుతుంది. ఆ క్షణం నుంచి సమీరాక్కూడా ఇద్దరు జెన్నీలు కనిపిస్తుంటారు. దాంతో బార్డేజ్ విల్లాలో ఉన్న దయ్యం జెన్నీ అనే కన్‌ఫ్యూజన్‌కు వస్తుంది ఆ అమ్మాయి. తల్లి లేని పిల్ల సమీరా. ఆమె తండ్రి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్.

**ఇన్వెస్టిగేషన్..**

జెన్నీ వాళ్లు ఆ ఊళ్లోకి అడుగుపెట్టగానే వరసగా మూడు హత్యలు జరగడం.. ఆ ముగ్గురూ జెన్నీని కలిసిన తర్వాతే హత్యకు గురవడంతో వాటికి, జెన్నీకి ఏదో లింక్ ఉన్నట్టు అనిపిస్తుంది ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కు. విచారణలో భాగంగా జెన్నీని పోలీస్‌స్టేషన్‌కు పిలిపిస్తాడు. ఆ హత్యలను తనకు ముడి పెట్టడంతో విస్తుపోతుంది జెన్నీ. ఆలోచనల్లో పడ్తుంది. అర్ధరాత్రిళ్లు విల్లాలో టైప్‌రైటర్ చప్పుళ్లు, హత్యలు, తనను చూసి సమీరా భయపడ్డం.. ఏంటో అంతా అయోమయంగా అనిపిస్తుంది ఆమెకు. తన చిన్నప్పుడు ఆ ఇంట్లో ఆయాగా పనిచేసిన వ్యక్తిని కలిసి ఆ విల్లా మర్మం తెలుసుకోవాలనుకుంటుంది. ఆచూకీ వెదికి మరీ ఆమెను కలుస్తుంది జెన్నీ. వాళ్ల తాత గురించి ఆస్తకికరమైన విషయాలు జెన్నీకి చెప్తుంది ఆమె. ఫకీర్ శవం కోసం అతని భార్య, కొడుకు ఆ విల్లాకు వస్తే శవం లేదు గివం లేదు అంటూ వాళ్లను మాధవ్ బయటకు గెంటేయించాడనే వివరంతో సహా. ఇంకోవైపు అమిత్‌రాయ్ తరచుగా మోసెస్‌ను కలవడం.. వాళ్లిద్దరూ ఏవో మాట్లాడుకోవడాన్ని గమనిస్తుంది సమీరా. ఈ దయ్యం కథ మలుపు మోసెస్ దగ్గర ఉందని గ్రహించిన సమీరా నెమ్మదిగా మోసెస్‌తో ఫ్రెండ్‌షిప్ పెంచుకుంటుంది. ఒకరోజు అతని దగ్గరున్న చిన్న చెక్కబొమ్మను చూస్తుంది. దాని గురించి అడుగుతుంది. చెప్తాడు.. ''ఇది ఫకీర్ బొమ్మ. ఇతని ఆత్మ బార్డేజ్ విల్లాలోని టైప్‌రైటర్‌లో ఉంది. రాబోయే బ్లడ్ మూన్ డే నాడు ఫకీర్ ఆత్మ ఆ టైప్‌రైటర్ నుంచి ఈ చెక్కబొమ్మ ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇదంతా అమిత్‌రాయ్ సమక్షంలో జరుగుతుంది'' అని. అవాక్కవుతుంది సమీరా. అదంతా తన ఫ్రెండ్స్‌కి చెప్పి.. ఫకీర్ ఆత్మ మళ్లీ మనిషి శరీరంలోకి రాకుండా ఆపాలనుకుంటుంది. ఫ్రెండ్స్‌తో కలిసి ఆ టైప్‌రైటర్‌ను నాశనం చేయాలనే ప్లాన్ చేస్తుంది.

> **ఇది ఫకీర్ బొమ్మ. ఇతని ఆత్మ బార్డేజ్ విల్లాలోని టైప్‌రైటర్‌లో ఉంది. రాబోయే బ్లడ్ మూన్ డే నాడు ఫకీర్ ఆత్మ ఆ టైప్‌రైటర్ నుంచి ఈ చెక్కబొమ్మ ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది.**

**బ్లడ్‌మూన్ డే..**

ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కు అమిత్‌రాయ్ మీద అనుమానం వస్తుంది. అతణ్ణి పట్టుకోవడానికి వెళితే తప్పించుకుంటాడు. ఇంతలోకి బ్లడ్ మూన్ డే రానే వస్తుంది. టైప్‌రైటర్‌ను ఎత్తుకుపోయే ప్రయత్నంలో అమిత్‌రాయ్‌కు పట్టుబడ్డారు పిల్లలు. జెన్నీతోపాటు వాళ్లనూ బార్డేజ్ విల్లాలోనే బంధిస్తాడు. అక్కడే జెన్నీ లాంటి ఇంకో వ్యక్తి తారసపడ్డుంది వాళ్లకు. పిల్లలతోపాటు జెన్నీ దిగ్భ్రమకు లోనవుతుంది. మరోవైపు ఫకీర్‌ఆత్మను మానవ శరీరంలోకి తెచ్చే చివరి ఘట్టంలో ఉంటాడు అమిత్ రాయ్. సమీరా, పిల్లలు గొడవపడ్తున్నట్టు నాటకమాడి అమిత్‌రాయ్ నిష్టను భంగపరిచి టైప్‌రైటర్‌ను ఎత్తుకొని పారిపోతారు. వాళ్లను వెంబడిస్తూ పరిగెడ్తున్న అమిత్‌రాయ్. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కంటపడ్తాడు. అతణ్ణి అడ్డుకుంటాడు. బాహాబాహీకి తలపడ్తారిద్దరూ. ఇన్‌స్పెక్టర్ కొట్టిన దెబ్బతో అమిత్ రాయ్ స్పృహ కోల్పోతాడు. అప్పుడు పిల్లలు, ఆనంద్ కలిసి ఆ టైప్‌రైటర్‌ను అమిత్‌రాయ్ వ్యాన్‌లోనే పెట్టి.. పెట్రోల్ చల్లి నిప్పంటించి కొండ మీద నుంచి తోసేస్తారు. స్పృహలోకి వచ్చిన అమిత్ దాన్ని ఆపేందుకు వెళ్లి అతనూ కొండ మీద నుంచి కిందకు పడిపోతాడు.


● తల్లి చారుతో చిన్నప్పటి ఫకీర్

**బార్డేజ్ విల్లాలో...**

ఆ చెక్కబొమ్మను మంటల్లో వేసేస్తుంది జెన్నీ. చెక్కకాలి అందులోంచి చిన్న అస్థిపంజరం జెన్నీవైపు వస్తుంటే దాన్ని కాలితో తొక్కేస్తుంది. అంతకు ముందు రోజే పనిమీద ముంబై వెళ్లిన జెన్నీ భర్త ఇంటికొచ్చేస్తాడు. ''ఎలా ఉన్నావ్? ఏదేదో విన్నాను. ఫ్రెషప్ అయ్యి వస్తా.. వివరంగా చెప్పు'' అంటూ బాత్రూమ్‌లోకి వెళ్తాడు. తలుపి అతను అటు తిరుగుతాడో లేదో ఇటు జెన్నీ అదృశ్యమవుతుంది. బ్యాగ్‌లోంచి రక్తంతో తడిసిన షర్ట్ తీస్తాడు జెన్నీ భర్త వాష్ చేయడానికి.

ఆ షర్ట్.. అమిత్‌రాయ్ వేసుకున్నదే!

ఇక్కడితో ''టైప్‌రైటర్'' సీజన్ వన్ ఎండ్ అవుతుంది. ఇంకెంతో సస్పెన్స్‌ను రేకెత్తిస్తూ!

– సరస్వతి రమ

**రేపటి 'ఫన్‌డే'లో..!**

## కాంచన

తన లగేజీని తోసుకుంటూ ఎవరికో ఫోన్ చేస్తూ అరైవల్ హాల్ అప్పుడే దాటబోతున్నాడు కుర్రాడు.

మరోవైపు...

చెత్తతో నిండిపోయిన డస్ట్‌బిన్‌లో ఖర్జూరం పిక్క ఆ ఆఫీసర్‌ను వెక్కిరిస్తోంది.

కాంచన మాటలు చెవిన మోగుతున్నాయి.

''నేనేమన్నా బంగారం తెమ్మన్నానా, ఖర్జూర మేగా...''

అంతే! ఒక్కసారిగా ఏదో వెలిగింది. ముందుకు పోతున్న యువకుడిని వెనక్కి పిలిపించాడు.

''ఏంటి మళ్లీ?'' కందిపోయిన ఎర్రటి మొహంతో అడిగాడు ఆ యువకుడు.

''ఇంకోసారి నీ లగేజి చెక్ చెయ్యాలి'' అన్నాడు ఆఫీసర్ కటువుగా.

డస్ట్‌బిన్ లోని ఖర్జూరం పిక్క ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ ఆఫీసర్‌కు చెప్పిన రహస్యం ఏమిటి?

రేపటి ఫన్‌డేలో చదవండి.



## నమామి దేవి నర్మదే!

రోజులు గడిచిపోతున్నాయి. శంకరుడక్కడ గురుసన్నిధిలో ఎలా ఉన్నాడో తెలియదు. ఏం చదువుతున్నాడో తెలియదు. ఆయన నేర్పుతున్నదేమిటో, ఈయనకు ఇంకా నేర్వవలసిన విద్యలేమిటో తెలియదు.

గుహ లోపల వారికి అన్నాదులు ఎలా సమకూరుతున్నాయో తెలియదు.

నిజంగా వారు అక్కడే ఉన్నారా?

బిలమార్గాన్ని అనుసరించి మరెక్కడికైనా వెళ్లిపోయారా?

నమామి దేవి నర్మదే! (ఆదిశంకరాచార్యుల జీవితచరిత్ర–7)లో చదవండి.

## పెళ్లిబువ్వ

పొగలు గక్కే సాంబారు, తియ్యగా నోరూరిస్తున్న లడ్డులు, వాసనతో మరో లోకానికి తీసుకెళ్తున్న బంగాళదుంపలు, మునక్కాయలు...ఓర్నీ....ఒక్కటా రెండా! పెళ్ళిబువ్వ అంటే మామూలా ఏంది!

పాతికేళ్ళ క్రితం...ఒంటి మీద ఓ జత, దండెం మీద ఓ జత, ట్రంకు పెట్టెలో మరో జత ఉన్నరోజుల్లో, నీరు నిప్పులు లేని పేదరికపు రోజుల నాటి 'పెళ్లి బువ్వ' కథ రేపటి ఫన్‌డేలో చదవండి.



**ఇంకా...**

**అయ్యో పులి!(ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా ముఖచిత్రకథనం), సిరాచుక్క నెత్తుటిమరక: గణేష్ శంకర్ విద్యార్థి(ధృవ తారలు), శ్రీరామ పట్టాభిషేకం (పురానీతి), బీ47 (కిర్ర్...ర్ర్!), 'అమెరికా అమ్మాయి' సినిమాలోని 'ఒక వేణువు వినిపించెను అనురాగ గీతిక' పాటతత్వం ప్రసిద్ధ గాయకుడు జి. ఆనంద్ మాటల్లో..**

**మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి.**

బ్యూటిప్స్

## చర్మకాంతి పెరగడానికి...

● చర్మం పాడిబారుతోంది అంటే సరైన నిద్రకు దూరంగా ఉన్నారని అర్థం చేసుకోవాలి. రోజూ ఎనిమిది గంటల నిద్ర లేకపోతే కళ్ల కింద వలయాలు ఏర్పడతాయి. ఉదయం, రాత్రి పడుకునే ముందు వేలి కొసలతో తేనె అద్దుకొని కళ్ల కింద ఉబ్బుగా ఉన్న చోట రాయాలి. అలాగే ముఖమంతా తేనె రాసి, మృదువుగా రుద్దాలి. తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా వారంలో మూడు సార్లు చేస్తే చర్మకాంతి పెరుగుతుంది.

● రోజూ రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్‌లో ముంచిన దూదితో ముఖమంతా రాయాలి. అదే ఉండతో కాస్త ఒత్తిడి చేస్తూ మసాజ్‌లా చేయాలి. దీంతో ముఖంపైన దాగున్న దుమ్ము కణాలు, శుభ్రపరిచినా మిగిలిన మేకప్ డస్ట్ సులువుగా వదిలిపోతుంది. తర్వాత ముఖాన్ని ఫేస్‌వాష్‌తో శుభ్రపరుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలి.



చెట్టు నీడ

## ఈ నిజాన్ని ఎవరితోనూ చెప్పకండి

అదొక జంతు ప్రదర్శనశాల. అక్కడ ఒకే బోనులో ఓ పులి, కుందేలు కలిసి ఉంటున్నాయి. ఈ విచిత్రాన్ని చూడడానికి రోజూ ప్రజలు అక్కడికి వచ్చేవారు. పులి నిద్రపోతున్నప్పుడు దాని పొట్టకు ఆనుకుని ఓ మేక విశ్రాంతి తీసుకుంటూ ఉన్న దృశ్యం చూసిన వారికి ఆశ్చర్యంగా ఉండేది.

ఓ మహిళ ఇది చూసి ఆశ్చర్యంతో ఆ ప్రదర్శనశాల నిర్వాహకులలోని ఓ ప్రతినిధితో ''ఇదెలా సాధ్యమైంది?'' అని ఎంతో ఆసక్తితో అడిగింది.

ఆరోజే ఆ ప్రతినిధి విధుల నుంచి రిటైర్ అవుతున్న రోజు. ఆయన ఆ మహిళతో నెమ్మదిగా చెప్పాడిలా...

''ఇందులో రహస్యమేమీ లేదు. రోజూ ఓ మేకను మారుస్తుంటాం. ఈ నిజాన్ని ఎవరితోనూ చెప్పకండి'' అన్నాడతను.

పులి ఇతర జంతువులను చంపి తినే క్రూర మృగమే. కాదనను. కానీ అది ఆకలి వేసినప్పుడు మాత్రమే తనకు అవసరమైన మేరకు మరొక జంతువును చంపుతుంది. ఆకలి తీరిపోతే అది మహాసాధువవుతుంది. ఇంకేదీ పట్టించుకోదు. ఎవరి మీదా దాడికి పూనుకోదు. కానీ మనిషే కారణం లేకున్నా సరే ఇతరులను నాశనం చేసే గుణం కలిగి ఉంటాడు. ఓ అణుబాంబుతో వేలాది మందిని హతమార్చగలడు. హిట్లర్ వంటి మనుషులే లక్షల మంది మరణానికి కారకులయ్యారు. అలాటి వారు ఎంతటి దుర్మార్గానికైనా వెనుకాడరు.

– యామిజాల జగదీశ్




సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
27-7-2019

# ఇలా పకోడీ అయ్యింది

వానలు పడుతుంటే... నోటికి కరకరలు కావాలి...
వేడివేడిగా... అప్పటికప్పుడు చేసుకుని తినాలి...
వెంటనే పకోడీలు గుర్తుకు వచ్చాయి కదూ...
అబ్బా... అవే పకోడీలా అనుకుంటున్నారా...
అవును... అవే పకోడీలు... కానీ పకోడీ మారింది...
ఏంటా అనుకుంటున్నారా...
షేప్ అందాజాగా అలాగే ఉంది...
స్వరూపం మారలేదు...
స్వభావం మారింది...
మీరు కూడా ప్రయత్నించండి...
నోటికి కరకరలు
అందించండి...
వానలను ఆస్వాదించండి...

నిర్వహణ:
డా. వైజయంతి
పురాణపండ



## కార్న్ పకోడీ

**కావలసినవి:** మొక్కజొన్న గింజలు – 2 కప్పులు (ఉడికించాలి); సెనగ పిండి – రెండు కప్పులు; ఉల్లికాడల తరుగు – పావు కప్పు; తరిగిన పచ్చి మిర్చి – 6; అల్లం తురుము – పావు టీ స్పూను; మిరప కారం – ఒక టీ స్పూను; పసుపు – పావు టీ స్పూను; గరం మసాలా – పావు టీ స్పూను; ఇంగువ – కొద్దిగా; మిరియాల పొడి – పావు టీ స్పూను; సోంపు పొడి – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత; నీళ్లు – తగినన్ని; చాట్ మసాలా – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● ఒక పాత్రలో ఉల్లికాడల తరుగు, ఉడికించిన మొక్కజొన్న గింజలు, అల్లం తురుము, పచ్చి మిర్చి తరుగు, మిరప కారం, పసుపు, గరం మసాలా, ఇంగువ, మిరియాల పొడి, సోంపు పొడి, ఉప్పు వేసి కలపాలి ● సెనగ పిండి, తగినన్ని నీళ్లు జత చేసి పకోడీల పిండిలా కలుపుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాచాలి ● పిండిని పకోడీల మాదిరిగా నూనెలో వేసి బాగా దోరగా వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి (కరకరలాడేలా వేయించుకోవాలి) ● ప్లేట్‌లో అందించేటప్పుడు పైన చాట్ మసాలా చల్లాలి ● గ్రీన్ చట్నీ, టొమాటో సాస్‌లతో తింటే రుచిగా ఉంటాయి.



## బ్రెడ్ పకోడీ

**కావలసినవి:** బంగాళ దుంపలు – 2 (మీడియం సైజువి); పచ్చి మిర్చి తరుగు – ఒక టీ స్పూను; కొత్తిమీర తరుగు – 5 టీ స్పూన్లు; పుదీనా తరుగు – 2 టీ స్పూన్లు; మిరప కారం – పావు టీ స్పూను; ఆమ్ చూర్ పొడి – అర టీ స్పూను; ఉప్పు – తగినంత.

**పిండి కోసం:** సెనగ పిండి – ఒక కప్పు; వాము – అర టీ స్పూను; మిరప కారం – పావు టీ స్పూను; గరం మసాలా పొడి – పావు టీ స్పూను; ఇంగువ – పావు టీ స్పూను; బేకింగ్ సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; ఉప్పు – తగినంత; వీట్ బ్రెడ్ – 5 స్లైసులు; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● బంగాళ దుంపలను కుకర్‌లో ఉంచి మెత్తగా ఉడికించాలి ● బయటకు తీసి తొక్క వేరు చేసి, బంగాళ దుంపను సన్నగా తురిమి పక్కన ఉంచాలి ● కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు, పచ్చి మిర్చి తరుగు, మిరప కారం, ఆమ్ చూర్ పొడి, ఉప్పు, బంగాళ దుంప తరుగులను ఒక పాత్రలో వేసి బాగా కలపాలి ● పెనం మీద కొద్దిగా నూనె వేసి బ్రెడ్ స్లైసులను దోరగా కాల్చి, చిన్న చిన్న ముక్కలుగా చేయాలి ● ఒక పాత్రలో సెనగ పిండి, వాము, మిరప కారం, గరం మసాలా, ఇంగువ, ఉప్పు, బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి ● అర కప్పు నీళ్లు జత చేసి మరోమారు కలపాలి ● ఒక టీ స్పూను వేడి వేడి నూనె జత చేయాలి ● బ్రెడ్ ముక్కలను ఈ పిండిలో వేసి బాగా కలపాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, సిద్ధంగా ఉంచుకున్న పిండిని పకోడీల మాదిరి గా వేసి దోరగా వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.



## రైస్ పకోడీ

**కావలసినవి:** అన్నం – ఒక కప్పు; ఉల్లి తరుగు – అర కప్పు; తరిగిన పచ్చి మిర్చి – 4; మిరప కారం – ఒక టీ స్పూను; అల్లం తురుము – అర టీ స్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; వాము – అర టీ స్పూను; జీలకర్ర పొడి – అర టీ స్పూను; ధనియాల పొడి – అర టీ స్పూను; పసుపు – పావు టీ స్పూను; ఇంగువ – చిటికెడు; సెనగ పిండి – 5 టేబుల్ స్పూన్లు; నీళ్లు – తగినన్ని; ఉప్పు – తగినంత; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● ఒక పాత్రలోకి అన్నం తీసుకుని, మెత్తగా అయ్యేలా చేతితో మెదపాలి (అన్నం మెత్తగా ఉండాలి) ● నూనె మినహా మిగతా పదార్థాలన్నీ జత చేసి పకోడీ పిండిలా కలపాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, పిండి మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేసి దోరగా వేయించి పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.



## చీజ్ పకోడీ

**కావలసినవి:** సెనగ పిండి – అర కప్పు; ఇంగువ – కొద్దిగా; మిరియాల పొడి – పావు టీ స్పూను (రవ్వ మాదిరిగా ఉండాలి); ధనియాల పొడి – పావు టీ స్పూను (రవ్వ మాదిరిగా ఉండాలి); బేకింగ్ సోడా – చిటికెడు; పసుపు – అర టీ స్పూను; మిరప కారం – పావు టీ స్పూను; నువ్వులు – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత; నీళ్లు – కొద్దిగా; చీజ్ – 125 గ్రా.; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● ఒక పాత్రలో సెనగ పిండి, మిరియాల పొడి, ధనియాల పొడి, ఇంగువ, బేకింగ్ సోడా, పసుపు, మిరప కారం, నువ్వులు, ఉప్పు వేసి కలపాలి ● కొద్దిగా నీళ్లు జత చేసి పకోడీ పిండిలా కలుపుకోవాలి (ఉండలు లేకుండా చూసుకోవాలి) ● చీజ్‌ను చిన్న చిన్న ముక్కలుగా చేయాలి (ఫ్రిజ్‌లో నుంచి తీసి, వెంటనే వాడాలి) ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక కొద్దిగా నూనెను పిండి మిశ్రమంలో వేసి కలపాలి ● చీజ్ ముక్కలను సెనగ పిండి మిశ్రమంలో ముంచి, పకోడీల మాదిరిగా కాగిన నూనెలో వేయాలి (మీడియం మంట మీద వేయించాలి) ● కొద్దిగా గట్టి పడి, బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి, కిచెన్ పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● చట్నీతో కాని, సాస్‌తో కాని అందించాలి.



## కంద పకోడీ

**కావలసినవి:** కంద – పావు కేజీ; సెనగ పిండి – పావు కేజీ; బియ్యప్పిండి – 2 టీ స్పూన్లు; అల్లం తురుము – 2 టీ స్పూన్లు; తరిగిన పచ్చి మిర్చి – 6; జీలకర్ర – ఒక టీ స్పూను; వాము – ఒక టీ స్పూను; ఉప్పు – తగినంత; ఉల్లి తరుగు – పావు కప్పు (సన్నగా తరగాలి); నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● కందను శుభ్రంగా కడిగి చెక్కు తీసేయాలి ● చెక్కు తీసిన కందను మరోమారు శుభ్రంగా కడిగి, ఒక గిన్నెలోకి సన్నగా తురమాలి ● ఒక పాత్రలో సెనగ పిండి, బియ్యప్పిండి, కంద తురుము, అల్లం తురుము, పచ్చి మిర్చి తరుగు, ఉల్లి తరుగు, జీలకర్ర, వాము, ఉప్పు వేసి బాగా కలపాలి ● ఒక టేబుల్ స్పూను వేడి నూనె జత చేయాలి ● తగినన్ని నీళ్లు జత చేసి పకోడీల పిండిలా కలుపుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, పిండిని పకోడీలుగా వేసి బాగా కరకరలాడేలా వేయించాలి ● పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



చిత్రం : కొండవీటి దొంగ (1990)
రచన: సిరివెన్నెల
సంగీతం: ఇళయరాజా
గానం: ఎస్.పి.బాలు, చిత్ర

**పల్లవి:** అరె ఛమకు ఛమకు ఛాం
చుట్టుకో చుట్టుకో ఛాన్సు దొరికెరో హొయ్యా
ఝుణకు ఝుణకు ఝూం
పట్టుకో పట్టుకో ఝుంపె దరువులే వెయ్యా
హొయ్యారే హొయ్య హొయ్యా
హొయ్ ఒయ్యారం సయ్యందయ్యా
హొయ్యారే హొయ్య హొయ్యా
హొయ్ అయ్యారే తస్సాదియ్యా
ఛాం ఛాం చకఛాం చకఛాం ఛాం
త్వరగా ఇచ్చై నీ లంచం
ఛాం ఛాం చకఛాం చకఛాం ఛాం
చొరవే చేసై మరికొంచెం ॥అరె ఛమకు॥

**చరణం-1** నాగ స్వరములా లాగిందయ్యా
తీగ సొగసు చూడయ్యా
తాచు పొగరుతో రేగిందయ్యా
కోడె పడగ కాటెయ్యా
మైకం పుట్టే రాగం ఇందు సాగేదెట్టాగయ్యా
మంత్రం వేస్తే కస్సూ బుస్సూ ఇట్టే ఆగాలయ్యా
బంధం వేస్తావా అల్లే అందంతో
పందెం వేస్తావా తుళ్లే పంతంతో
అరె కైపే రేపే కాటే వేస్తా ఖరారుగా...
కథ ముదరగా ఝుణక్ ఝుణక్ ఝూం
పట్టుకో పట్టుకో ఝుంపె దరువులే వెయ్యా॥అరె॥

**చరణం-2**
అగ్గిజల్లులా కురిసే వయసే నెగ్గలేకపోతున్నా
ఈతముల్లులా ఎదలో దిగెరో జాతి వన్నెదీ జాణ
అంతో ఇంతో సాయం చెయ్యా చెయ్యందియ్యాలయ్యా
తీయని గాయం మాయం చేసే మార్గం చూడాలమ్మా
రాజీకొస్తాలే కాగే కౌగిళ్లో
రాజ్యం ఇస్తాలే నీకే నా ఒళ్లో
ఇక రేపో మాపో ఆపే ఊపే
హుషారుగా... పదపదమని ॥అరె॥

కట్ చేయ్...దాచేయ్...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | | | | 8 | | | 3 |
| | 9 | | 6 | | 3 | | | 7 |
| | | 5 | | 7 | | | 1 | |
| 5 | | | | | 1 | 3 | | 6 |
| | | 9 | 4 | | 5 | 7 | | |
| 1 | | 3 | 9 | | | | | 2 |
| | 2 | | | 5 | | 6 | | |
| 9 | | | 3 | | 6 | | 7 | |
| 3 | | | 7 | | | | 4 | |

**నిబంధనలు:**
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 4 | 5 | [illegible] | 1 | 7 | [illegible] | [illegible] | [illegible] |
| [illegible] | 6 | [illegible] | 2 | 4 | 3 | [illegible] | [illegible] | [illegible] |
| 7 | [illegible] | 3 | [illegible] | [illegible] | 6 | 2 | [illegible] | 8 |
| [illegible] | [illegible] | 2 | [illegible] | 8 | 1 | 9 | 5 | [illegible] |
| 5 | 9 | 1 | 6 | [illegible] | 4 | 8 | 3 | 7 |
| [illegible] | 8 | 7 | 3 | 5 | [illegible] | 1 | [illegible] | [illegible] |
| 9 | [illegible] | 4 | 1 | [illegible] | [illegible] | 3 | [illegible] | 5 |
| [illegible] | [illegible] | [illegible] | 4 | 8 | 2 | [illegible] | 1 | [illegible] |
| [illegible] | [illegible] | [illegible] | 9 | [illegible] | [illegible] | 4 | 8 | 2 |

## రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (జులై 27 నుంచి ఆగస్ట్ 2 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

### మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

జీవితంలో నిజంగా సాధించుకోవలసింది ఏదనే తీరు ఆలోచనలో పడి పడి– సంతానం భార్య/ భర్తతో కలిసి కలిసి మెలిసి ఉంటూ ఎక్కువ సేపు వాళ్లతో గడుపుతూ ఆనందాన్ని పొందడమే– నిజంగా సాధించుకోవలసిన అంశమనే దృఢమైన భావానికి వచ్చేస్తారు. నిజంగా ఇది సంతోషించదగ్గ పరిణామం. ఆహ్వానించదగ్గ ఆశయం.

మనసులో దుఃఖం అంటూ కలిగితే వెంటనే దాన్ని మీరు మరొకరితో చెప్పేసుకునే మనస్తత్వం కలిగిన వారయ్యుంటే ఆ పనిని చెయ్యకండి.

ఎవరితో మీ బాధని చెప్పుకోవాలో అలా వాళ్లతో కాకుండా మరొకరికి గాని చెప్పుకున్నట్లయితే మీరు చెప్పిన ఆ మాటలు రెక్కలు కట్టుకుని మరికొన్ని సొంత ఈకల్ని తగిలించుకుని ఎవరికి చెప్పడం మంచిది కాదో వాళ్లకే చేరిపోయే ప్రమాదముంది. నియంత్రించుకోండి.

విదేశాలకి వెళ్లాలనే తాపత్రయం, విదేశీవస్తువుల్ని తెచ్చుకోవాలనే మోజు రోజు రోజుకీ పెరిగే అవకాశముంది. ఆలోచన రావడం మంచిదేనేమోగాని, దానివల్ల మీరు ఆర్జించగలిగేదేముందనే దృక్పథాన్ని అలవరచుకోండి.

ఇక్కడ సంసారం భార్యాభర్తల్ని వేరు చేసేదిగా ఔతుంది. అక్కడ మళ్లీ కొత్త పొయ్యిని పెట్టుకుని పదిమందితో పరిచయాలని చేసుకుంటూ ఉండడం... అంత అవసరమా?

చక్కగా సాగిపోతున్న గమ్యానికి దగ్గరగా ఉన్న రథాన్ని మరో వైపుకి మళ్లించడం ఎలా సరి కాదో అలా ఇప్పుడు విదేశీ ప్రయాణం కేవలం ఉద్యోగ నిమిత్తం అంత అనవసరం. ఆలోచించుకోండి.

**లౌకిక పరిహారం:** సుఖంగా సాగుతున్న సంసారానికి విదేశీ ఆలోచన ప్రస్తుతానికి వద్దు.
**అలౌకిక పరిహారం:** మాస శివరాత్రి సందర్భంగా శివాలయంలో విభూతిని సమర్పించుకోండి.

### మిథునం (మే 21 - జూన్ 20)

ఒక త్రాసులో వస్తువుని తూచుతూ ఉంటే ఒకసారి ఇటువైపున్న పళ్లెం– మరోసారి అటువైపున్న పళ్లెం కిందికీ మీదికీ వెళ్తూ దిగుతూ బరువుని సరి చేస్తుంటే కొంతసేపటికి సమాన స్థాయికి వచ్చేటట్లుగా, మీ ఆలోచనలు కూడా ఇది సరికాదు... ఇదే సరి సుమా! అనే తీరుగా ఊహాపోహలతో సాగుతూ ఉంటాయి. చేస్తున్న వృత్తీ ఉద్యోగం నిర్వహిస్తున్న వ్యాపారమూ కూడా అసంతృప్తి ధోరణితోనే కనిపిస్తుంటాయి మీకు. జరగబోయే వ్యతిరేక ఫలితమంటూ ఏమీ ఉండదు గాని, ఆ భయం లేకుండా ఉండ(లే)కపోవచ్చు.

సంపాదన బాగానే ఉన్నప్పటికీ చేబదుళ్లు తీసుకోకుండా జరక్కపోవచ్చు. సాధారణంగా అప్పు చేయడమనే అలవాటుగాని తెరదీస్తే తప్పక మనకి అది ఓ అలవాటుగా– మాటల్లో అలా వచ్చేస్తుండే ఊతపదంలా అయిపోవచ్చు కాబట్టి రుణాన్ని తీసుకోవడమనే ఊహని పూర్తిగా తుడిచేసుకోండి మనసులో.

ఎంత అవసరమౌతుందో అంతకంటే ఓ రూపాయి ఎక్కువతోనే ప్రయాణించండి. అంగడికి వెళ్లబోతున్నా సరే ఇదే నియమాన్ని పాటించండి. ఓ చిన్న చేబదులు గురించి ఇంత చెప్పాలా? అనుకోవద్దు. పాటించండి ఈ నియమాన్ని. ఎందుకు చెప్పాల్సి వచ్చిందో ముందు నాటికి అర్థమౌతుంది.

సంతానానికీ అలాగే మీకూ ఎందుకైనా ఎప్పుడైనా ప్రయోజనపడతారు గదా అనే ఆలోచనతో పెద్ద పెద్దల పరిచయాల కోసం తపన పడతారు. అలాంటి పెద్ద పెద్ద స్థాయివాళ్లు దాదాపుగా సముద్రాలలాంటివాళ్లే. వైశాల్యం లోతుదనం అన్నీ ఉన్నా ఒక్క చుక్క కూడా తాగవీల్లేనిది కదా సముద్రజలం! వాళ్లూ అంతే అనే నిశ్చయంతో ఉండండి. ఎక్కడో కోటికొకరుంటారు ఉత్తములు!

**లౌకిక పరిహారం:** రుణం గూర్చిన ఆలోచనని విరమించుకోండి.
**అలౌకిక పరిహారం:** నవధాన్య జలంతో శివుణ్ణి అభిషేకించండి.

### సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

లోగడ ఎక్కడ దొరికితే అక్కడ ఋణాలు చేసేసి ఏదో వ్యాపారాన్ని ప్రారంభించి, తీసుకున్న అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక చిన్నచిన్న అప్రతిష్ఠాకర సంఘటనలని ఎదుర్కొన్నారో మళ్లీ అదే పరిస్థితికి వెళ్తున్నారేమో ఒంటరిగా కూర్చుని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.

ఆదాయంగా వస్తున్న ఆదాయాన్ని స్వగృహం మరమ్మతులకీ సౌకర్యాలకీ ఇతరమైన సౌందర్య పద్ధతులకీ వాడేస్తూ ఎప్పటి ఆదాయాన్ని అప్పుడు వస్తురూపంలోకి తెచ్చేస్తూ తీసుకున్న ఋణాన్ని వడ్డీలతో అలా పెంచేసుకుంటున్నారేమో గమనించుకోండి.

వ్యక్తి మీది గౌరవమనేది బాకీ తీసుకోనంతవరకే. అది సరైన కాలంలో తీర్చ(లే)ని పక్షంలో వ్యతిరేక దిశలో ప్రయాణిస్తూ అవమానాన్ని చేయాలనే ఊహకి ఋణదాత(ల)ని వచ్చేలా చేస్తుంది. జాగ్రత్త పడండి.

సంతానంలో ఒకరి విద్యాప్రతిభ ఓ మాదిరిగా ఉంటూ కొంత మనస్తాపానికి మిమ్మల్ని గురి చేయవచ్చు. అలాగని మీరేమైనా ఆ పరిస్థితిని చక్కదిద్దగలుగుతారా? అంటే అది మీ చేతిలో పని కాని కారణంగా ఇబ్బందికి గురి చేయవచ్చు. కొద్దిగా శ్రమ, అసౌకర్యమనుకుంటే సంతానం దగ్గర మీ భార్యని కొన్నాళ్లపాటు ఉంచితే అటు విద్యాస్థాయి దానితో పాటు ప్రవర్తన... అనే ఈ రెండూ సక్రమంగా అవుతాయి.

శస్త్రచికిత్స దాకా అనారోగ్యస్థాయి వెళ్లిన విషయాన్ని గుర్తుంచుకుని ఆహారవిహారాల్లో తగు జాగ్రత్తలని పాటించక తప్పదు. అత్యాశకి పోతూ దూర భార ప్రయాణాలని విరమించడం మంచిది.

**లౌకిక పరిహారం:** ఋణాలని తీర్చడం విషయంలో ఓ క్రమశిక్షణ అవసరం.
**అలౌకిక పరిహారం:** వెండి వస్తువుని ముంచిన జలం (రౌప్యజలం) తో శివాభిషేకం చేసుకోంది.

### వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

మీరనుకునే పని ఏదైనా సరే ఎంత కఠినమైనదైనా సరే సాధించుకోవాలనుకుంటే దానిక్కావలసిన ఉపాయం కేవలం నమ్రతతో ఉంటూ నిదానంగా మాట్లాడటం మాత్రమే. ఇలా కాకుండా నాది ధర్మమే అనే అభిప్రాయంతో ఉన్నదున్నట్టుగా గట్టి కంఠంతో గనుక మాట్లాడితే అనుకున్న పని కానే కాదు సరికదా... పని జరగలేదనే ఆందోళన మనసుకి కలుగుతుంది కూడా.

కుటుంబంలో ఉండే ఎవరో ఒకరి వ్యతిరేకత కారణంగా లేక ఆధిపత్యం కారణంగా చేయదలచిన ఓ శుభకార్యాన్ని ఎప్పుడు చేయాలో ఎక్కడ చేయాలో అనే విషయం ఓ స్పష్టతకి రాకపోవచ్చు. ఆ విషయం మీద మరింత దృఢంగా బలంగా నిలబడి తేల్చాల్సిందే– అనుకోకండి. అలా చేసిన పక్షంలో వ్యక్తిగత వైరం పెరిగిపోయే అవకాశముంది.

ఓ విషయాన్ని గురించిన స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడ ఆ విషయం గురించి మాట్లాడండి తప్ప సగం సగం తెలిసి మాట్లాడడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపాటుతనాన్ని చేష్టల్లోనూ సంభాషణల్లోనూ కలిగి ఉండడం సరికాదు. నిదానంగా ఉండడమే సరైనది. ఇలా నిదానాన్ని పాటించడమనేది అసమర్థతకి సాక్ష్యం అనుకోకండి. కార్యసాధనకి అనువైన మార్గమని భావించండి.

ఆరోగ్యం చెడిపోలేదు గాని, ఆహార విహారాలని సరిగా పాటిస్తూ అనారోగ్యం రాకుండా చేసుకోవడం ఎంతైనా అవసరం. శని 8వ ఇంట్లోనే ఇంకా ఉన్న కారణంగా చీకట్లో కనిపించని నల్లని దొంగలా ఎక్కడో ఓ చోట ఎప్పుడో ఒకప్పుడు మనకి మానసిక ఆందోళనకి పాల్పడేలా చేస్తాడు ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో.

**లౌకిక పరిహారం:** నిదానం ప్రధానం. కాఠిన్యం కార్యభంగానికి కారణం.
**అలౌకిక పరిహారం:** శివునికి బిల్వదళాలని ముంచిన జలంతో అభిషేకం చేసుకోండి.

### కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉందన్న సామెతలాగా ఆస్తీ అంతస్తూ బంధుబలం శారీరకమైన ఓపికా..
ఇలా అన్నీ మీ స్థాయికి తగ్గట్టే ఉన్నా సంతానం గూర్చిన ఓ చిన్న సమస్య మిమ్మల్ని సుఖంగా సంతోషంగా ఉండేలా సాగనియ్యదు.

ఎవరితో మాట్లాడుతున్నా ఏం చేస్తున్నా ఆ మనోవ్యధ మిమ్మల్ని ఓ ముల్లు గుచ్చుకుంటున్నట్లుగానే చేస్తుంటుంది. మరికొంతకాలం తప్పదు. వ్యతిరేకత ఉండదు గాని భరించక తప్పదు.

దాదాపుగా నిశ్చయం అయిపోయిందనుకున్న శుభకార్యం కొద్ది దూరంగా జరగడం కాని లేదా తాత్కాలికంగా ఆగిపోయినట్లుగా అన్పించడం గాని జరగచ్చు. దిగులు పడకండి. రవి కుజుల అనుకూలత కారణంగా సరైన ఆలోచన తోచదు. మానసిక అసంతృప్తి తప్పదు.

భార్యాభర్తల సయోధ్య అంతగా ఉండక ఓ చిన్న స్పర్థ( నేనే తెలివి కలవాణ్ణి/ దానిని) ఏర్పడి ఉండచ్చు. ఇద్దరిలో ఒకరి గొంతు పెద్దదై నలుగురిలో అప్రతిష్ఠని మిగిల్చేదిగా కూడా ఉండచ్చు.

కుటుంబపు పరువు కొంత కొంతగా దిగజారుతూ ఉండచ్చు కూడా. ప్రస్తుత దశ ప్రకారం చేయగలిగిందీ చేసుకోగలిగిందీ ఏమీ లేదు. మౌనంగా భరిస్తూ ఉండడమే.

మీ విషయంలో అపార్థ పడిన వాళ్ల క్రమక్రమంగా నిజాన్ని తెలుసుకుని మళ్లీ పూర్వం లాగా స్నేహ భావంతో ఉండడానికి ప్రయత్నించవచ్చు. అప్పటిలాగా కాకుండా ఎంత దూరంలో వాళ్లని ఉంచాలో మీరు ఎంత దూరంలో ఉండాలో అలాగే ఉండండి.

**లౌకిక పరిహారం:** తాత్కాలికంగా మనో వ్యధ తప్పదనే అభిప్రాయంతో ఉండండి.
**అలౌకిక పరిహారం:** బంగారు వస్తువుని ముంచిన జలం(స్వర్ణజలం)తో శివాభిషేకం చేయండి.

### కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

దురదృష్టవశాత్తు ఏవైనా వ్యవహారాలు న్యాయస్థానాల వరకు వెళ్లి ఉండినట్లయితే అంత అనుకూలమైన తీర్పు వచ్చే అవకాశం లేనందున వాయిదా కోరుకోవడం మంచిది. ఆషాఢమనేది దైవప్రార్థనకి విశేష అనుకూల కాలం కాబట్టి దైవ చింతన సమయానికి ప్రాధాన్యమీయడం మంచిది కూడ.

సంతానంతో కలిసి ఆధ్యాత్మిక యాత్ర లేదా విహారయాత్రని చేసే అవకాశముంది. అనారోగ్యం కనిపించిన మొదటి గంటలోనే వైద్యానికి పరుగెత్తడం సరి కాదు.

ఆ అనారోగ్యం తాత్కాలికమా? స్వయంకృతాపరాధమా?... ఇలా విశ్లేషించుకుని తాత్కాలికమైన తేలికపాటి ఆరోగ్య పరీక్షలని చేయించుకోండి అవసరమైతే.

అనుకోకుండా వచ్చే ఆర్థికలాభం ఉంది. దాన్ని విచ్చలవిడిగా కుటుంబంలోకి కావలసిన వస్తువులని కొనేయడం కాకుండా సంతానానికి చేయాల్సిన వివాహాది శుభకార్యాల నిమిత్తం వినియోగించండి. దానిలో భాగంగా వెండి బంగారాలని కొని ఉంచడం శ్రేయస్కరం.

కొత్త వ్యాపారాన్నే ప్రారంభించదలిస్తే ఎప్పటికప్పుడు తెమిలిపోయే కూరగాయల వ్యాపారాన్ని చేయడం మంచిది. ఒకవేళ నష్టం వచ్చినా లక్షల్లో ఉండదు.

ఇది వ్యాపార ప్రారంభస్థితి అనుకుంటూ పెద్దగా లాభం రాదనీ – అనుభవం మాత్రం వచ్చి తీరుతుందనీ భావించి దిగండి. అధికాధిక లాభాలు రావుగాని నష్టం మాత్రం ఉండదు.

రాజకీయ రంగం వైపుకి దిగే ఆలోచనల్ని విరమించుకోండి.

**లౌకిక పరిహారం:** న్యాయస్థాన అంశాల్లో రాజీ విధానం మంచిది.
**అలౌకిక పరిహారం:** గుడ (బెల్లం) జలంతో శివాభిషేకం ఉత్తమం.



## ఫిష్ పకోడీ

**కావలసినవి:** ముల్లు లేని చేప ముక్కలు – 250 గ్రా.లు; ఉప్పు – తగినంత; పసుపు – కొద్దిగా; నిమ్మ రసం – టీ స్పూన్; పచ్చి మిర్చి – 2 (సన్నగా తరగాలి); వెల్లుల్లి రెబ్బలు – 2 (సన్నగా తరగాలి); అల్లం – చిన్నముక్క (తురమాలి).

**పిండి తయారీకి:** కారం – తగినంత; వాము – అర టీ స్పూన్; ధనియాల పొడి – టేబుల్ స్పూన్ (వేయించి, కచ్చాపచ్చాగా దంచాలి); తందూరీ మసాలా – తగినంత; బియ్యప్పిండి / కార్న్ ఫ్లోర్ – టేబుల్ స్పూన్; సెనగపిండి – 4 టేబుల్ స్పూన్లు; యోగర్ట్ – 2 టేబుల్ స్పూన్లు.

**తయారీ:** ● చేప ముక్కలకు ఉప్పు, పసుపు, నిమ్మరసం, పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి– అల్లం తరుగు వేసి కలిపి పైన మూత పెట్టి 20 నిమిషాలు అలాగే ఉంచాలి ● స్టౌ మీద బాణలి పెట్టి కొద్దిగా నూనె వేసి వేడిచేయాలి ● ఒక గిన్నెలో పిండి, దాంతో పాటు మిగతా దినుసులన్నీ వేసి బాగా కలపాలి ● సిద్ధంగా ఉంచుకున్న చేప ముక్కలకు పిండికి పట్టేలా కలపాలి ● కావాలనుకుంటే పిండి మృదువుగా అవడానికి మరికాస్త యోగర్ట్‌ని వాడుకోవచ్చు ● పిండి కోటింగ్ ఉన్న చేప ముక్కలను కాగుతున్న నూనెలో వేసి అన్నివైపులా వేయించాలి ● అన్నీ బంగారు రంగు వచ్చేలా వేయించుకొని, ప్లేట్‌లోకి తీసుకోవాలి ● వీటిని ఏదైనా సాస్, పుదీనా –కొత్తిమీర చట్నీతో సర్వ్ చేయాలి.



## చికెన్ పకోడీ

**కావలసినవి:** చికెన్ (బోన్‌లెస్) – పావు కేజీ (250 గ్రా.లు); ఉల్లిపాయ – 1 (సన్నని ముక్కలుగా కట్ చేసుకోవాలి); పచ్చి మిర్చి – 2 (సన్నగా తరగాలి); అల్లం, వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; కారం – టీ స్పూన్ (తగినంత వేసుకోవచ్చు); గరం మసాలా– అర టీ స్పూన్; పసుపు – కొద్దిగా; ఉప్పు – తగినంత; కరివేపాకు – 2 రెమ్మలు; సెనగ పిండి – పావు కప్పు (విడిగా మరో 2 టేబుల్ స్పూన్లు); బియ్యప్పిండి లేదా కార్న్ ఫ్లోర్ – 3 టేబుల్ స్పూన్లు; గుడ్డు – 1 (తెల్లసొన మాత్రమే); నీళ్లు – తగినన్ని; నూనె – వేయించడానికి తగినంత.

**తయారీ:** ● ఒక వెడల్పాటి గిన్నెలో సెనగ పిండి, బియ్యప్పిండి, ఉప్పు, పసుపు, కారం, గరం మసాలా వేసి కలపాలి ● అన్నీ సరిపడా ఉన్నాయా లేదా చెక్‌చేసుకొని దాంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉల్లిపాయలు, తరిగిన కరివేపాకు పచ్చి మిర్చి వేసి కలపాలి ● చిన్న చిన్న క్యూబ్స్‌లా కట్ చేసుకున్న చికెన్ ముక్కలను వేసి బాగా కలపాలి ● కావాలనుకుంటే కొద్దిగా నీళ్లు కలుపుకోవచ్చు ● పిండి లూజ్‌గా కాకుండా, గట్టి ముద్దలా తయారుచేసుకోవాలి.

**ఇలా వేయించాలి:** ● స్టౌ యిు మీద బాణలి పెట్టి తగినంత నూనె పోసి వేడి చేయాలి ● చేత్తో కొద్ది కొద్దిగా పిండి ముద్ద తీసుకొని కాగిన నూనెలో వేసి, వేయించాలి ● నూనె వేడిని బట్టి మంటను సరిచూసుకోవాలి ● చికెన్ ముక్కలు అన్ని వైపులా బాగా వేగాక ప్లేట్‌లోకి తీసుకోవాలి ● ఈ చికెన్ పకోడీని పుదీనా చట్నీ లేదా సాస్‌తో వడ్డించాలి.



## ప్రాన్ పకోడీ

**కావలసినవి:** రొయ్యలు – పావు కేజీ; పచ్చి కొబ్బరి తురుము – పావు కప్పు; ఉల్లిపాయలు – 6 (సన్నగా తరగాలి); అల్లం ముక్క – చిన్నది (సన్నగా తరగాలి); వెల్లుల్లి – 5 రెబ్బలు (క్రష్ చేయాలి); పచ్చి మిర్చి – 2 (సన్నగా తరగాలి); కారం – టీ స్పూన్; ఉప్పు – తగినంత.

**మరి కొన్ని...** ఉల్లిపాయ – 1 ; సోంపు – టీ స్పూన్; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; నూనె – వేయించడానికి తగినంత; కరివేపాకు, ఉల్లి కాడలు – తగినన్ని.

**తయారీ:** ● రొయ్యలను శుభ్రం చేసుకొని సిద్ధంగా ఉంచాలి ● రొయ్యలు, కొబ్బరి పొడి కలిపి గ్రైండ్ చేసుకోవాలి ● వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, రొయ్యలు కొబ్బరి ముద్ద, ఉల్లి తరుగు, కొత్తిమీర, సోంపు, ఉప్పు, కారం.. ఇతర దినుసులన్నీ వేసి ముద్దలా కలుపుకోవాలి ● పిండిని చిన్న చిన్న ముద్దలుగా తీసుకొని, గుండ్రంగా చేసి, చేత్తో అదిమి పక్కన పెట్టాలి ● స్టౌ మీద బాణలి పెట్టి, నూనె పోసి వేడి చేయాలి ● కాగుతున్న నూనెలో 5–6 చొప్పున సిద్ధంగా ఉంచుకున్న బాల్స్ వేసి, రెండువైపులా బంగారు రంగు వచ్చేలా వేయించుకోవాలి ● కొత్తిమీర చట్నీ లేదా సాస్‌తో సర్వ్ చేయాలి.



## ఖీమా పకోడీ

**కావలసినవి:** మటన్ ఖీమా – 250 గ్రా.లు; గుడ్డు – 1; ఉల్లిపాయ – 1 (తరగాలి); పచ్చి మిర్చి – 4 (సన్నని ముక్కలుగా కట్ చేసుకోవాలి); సెనగ పిండి – అర కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; కొత్తిమీర తరుగు – 3 టేబుల్ స్పూన్లు; అల్లం–వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; కారం – టీ స్పూన్; గరం మసాలా – కొద్దిగా; వంట సోడా – కొద్దిగా; ఉప్పు – తగినంత; నూనె –వేయించడానికి తగినంత

**తయారీ:** ● ఒక గిన్నెలో పై పదార్థాలన్నీ వేసి బాగా కలపాలి ● చిన్న ముద్దలు తీసుకొని, బాల్స్ చేసి చేత్తో అదిమి, పక్కనుంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, అదిమి ఉంచుకున్న బాల్స్‌ను ఉల్లి పకోడీల్లా కొద్ది కొద్దిగా పిండి చేత్తో తీసుకుంటూ కాగుతున్న నూనెలో వేసి, అన్నివైపులా బంగారు రంగు వచ్చేలా వేయించుకొని, తీయాలి ● టొమాటో సాస్ లేదా కొత్తిమీర చట్నీతో వడ్డించాలి.

ఫుడ్ ప్రింట్స్



● గంగ భిశాణ్ ఉరఫ్ హల్దీరామ్

# భుజియాతో బిలియన్లు...

**గంగ భిశాణ్ ఉరఫ్ హల్దీరామ్... భుజియా నుంచి బిలియన్లకు చేరారు... ఒకటి రెండు కాదు మూడు బిలియన్లు... ప్రపంచ స్నాక్స్‌లో ద్వితీయస్థానానికి చేరారు.. ఎనిమిది దశాబ్దాలుగా తిండి ప్రియులకు రుచులు అందిస్తున్న గంగా భిశాణ్ స్థాపించిన హల్దీరామ్స్ విజయగాథ ఈ వారం మన ఫుడ్ ప్రింట్స్...**

బికనీర్‌లో 1937లో అతి సామాన్యంగా ప్రారంభమైన స్నాక్స్ వ్యాపారం... ఒక్కో అడుగు పైకి ఎక్కుతూ ఈ రోజు ప్రపంచంలోనే స్నాక్ ఫుడ్స్ వ్యాపారంలో రెండో స్థానానికి చేరుకుంది. బ్రేక్ ఫాస్ట్ ఉత్పత్తులైన కెలాగ్స్ కూడా హల్దీరామ్స్‌లో చేరింది. ఇప్పుడు వీరి టర్నోవర్ మూడు బిలియన్ల డాలర్లకు (కలకత్తా మినహా) చేరుకుంది. ఒక చిన్న భుజియా దుకాణంతో ప్రారంభమైన ఈ వ్యాపారం, కుటుంబ కలహాలను, అనేక ఆటంకాలను ఎదుర్కొంటూ అత్యున్నతస్థాయికి చేరుకుంది.

### విలువలతో...

హల్దీరామ్స్ పేరు భారతదేశ ఖ్యాతికి కలికి తురాయిగా నిలిచింది. 1937లో బికనీర్‌లో చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ దుకాణం ఇప్పుడు ప్రపంచస్థాయికి ఎదిగింది. గంగా భిశాణ్ అగర్వాల్‌ని తల్లి ముద్దుగా హల్దీరామ్ అని పిల్చుకునేది. భిషాణ్ ఆంటీ ఒకరు వీరి ఇంట్లోనే తరచుగా బికనీరీ భుజియా తయారుచేస్తుండేది. అది చాలా రుచిగా ఉండటంతో, అగర్వాల్ తల్లి ఆవిడ దగ్గర నేర్చుకుంది. తల్లి దగ్గర అగర్వాల్ నేర్చుకున్నారు. బికనీర్‌లోని భుజియా బజార్‌లో ఉన్న తన బంధువుల దుకాణంలో చేరిన తరవాత, తన ఆంటీ ఉపయోగించిన విధానాన్ని అనుసరించారు అగర్వాల్. పవిత్ర కుమార్ రచించిన **‘భుజియా బ్యారన్స్’**లో అగర్వాల్ కనిపెట్టిన కొత్తవిధానంలో భుజియా తయారుచేయడం గురించి ప్రస్తావించాడు. ఒకరకమైన పిండిని జతచేసి దానితో సన్నటిమెష్ మీద భుజియా తయారు చేసేవాడు. తన కొత్త ఉత్పత్తిని ఏ విధంగా మార్కెట్ చేసుకోవాలో అగర్వాల్‌కి బాగా తెలుసు. బికనీర్‌ని పరిపాలించిన మహారాజులలో **దంగర్**కి మంచి పేరు ఉంది. ఆయన పేరు మీదే **‘దంగర్ సేవ్’** అని పేరు పెట్టాడు. అంతే! ఆయన దశ మారిపోయింది. మార్కెట్‌లో మంచి పేరు సంపాదించేశాడు. వారానికి రెండు వందల కిలోలు అమ్మడం ప్రారంభించాడు. కిలో ధర 2 పైసల నుంచి 25 పైసలకి పెరిగింది’ అని పవిత్ర కుమార్ తన పుస్తకంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు.



**కెలాగ్స్ ఇందుకే ఇటు వచ్చింది...**

ఎంత విదేశీ మార్కెట్లయినా దేశీ మార్కెట్లతో కలిస్తేనే స్థానికత ఉంటుందనే ఉద్దేశంతో, హల్దీరామ్స్‌లోకి వచ్చి చేరిపోయింది కెలాగ్స్. మెక్‌డొనాల్డ్స్ మొట్టమొదట 1996లో ఢిల్లీ బసంత్‌లోక్‌లో ప్రారంభమైనప్పుడే, ఇక్కడ బీఫ్, పోర్కుకి సంబంధించిన ఉత్పత్తులు తయారుచేయకూడదని ఒక సంప్రదాయ నిర్ణయం తీసుకున్నారు. అందుకే అవి విదేశీ కంపెనీలైనా భారతీయతను సంతరించుకున్నాయి. హల్దీరామ్ వ్యాపారాన్ని మరింత వృద్ధి చేయడం కోసం, ఫ్రెంచ్ బేకరీ కేఫ్ బ్రియోక్ డోరేతో ఒప్పందం చేసుకున్నారు. ప్రపంచంలో రెండవ అతి పెద్ద చైన్ బేకరీ ఇది. ఇక్కడ కూడా శాకాహారం మాత్రమే దొరుకుతుంది.

### ఇలా మొదలైంది...

అగర్వాల్ పొడవుగా, సన్నగా, ఆరోగ్యంగా ఉండటంతో, పిల్లలకు, మనవలకు కూడా అగర్వాల్ అంటే చాలా భయం వేసేదట. ఆయన చాలా తక్కువగా నవ్వుతారట. డెబ్బై సంవత్సరాలు నిండాక కూడా తన ఊరంతా సైకిల్ మీదే తిరిగేవారట. హల్దీరామ్ ఒకసారి కోల్‌కతాలో ఒక పెళ్లికి వెళ్లినప్పుడు, అక్కడ కూడా ఒక షాపు తెరవాలనే ఆలోచన కలిగిందట. బికనీర్‌లో కాకుండా బయట ప్రారంభించిన మొట్టమొదటి దుకాణం అదే. ఆయన తరవాతి తరం వారు వ్యాపారాన్ని పెద్దగా వృద్ధి చేయలేదు. మనమలు మనోహర్‌లాల్ శివకిషన్ ఈ వ్యాపారానికి వారసులుగా నిలిచి, నాగపూర్, ఢిల్లీలలో బ్రాంచీలు తెరిచారు. ఢిల్లీలోని చాందినీచౌక్‌లో షాపు తెరిచిన కొత్తల్లోనే అందరినీ ఆకట్టుకోవటంతో, ఢిల్లీ, నాగపూర్‌లలో ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించారు. ఆ తరవాత పెద్ద పెద్ద నగరాలలో, విదేశాలలో రెస్టారెంట్లు తెరిచారు. మొత్తం 20 వేల కోట్ల వ్యాపారం జరుగుతోంది. గంగాభిశాణ్ వారసులు ట్రేడ్‌మార్కు గురించి వాదులాడుకున్నారు. ఇప్పటికీ ఆ కేసు సుప్రీంకోర్టులోనే ఉంది.

### బికనీర్ నుంచి ఫ్రెంచ్ బేకరీ దాకా...

1937లో బికనీర్‌లో గంగా భిశాణ్ భుజియా షాప్ ప్రారంభించినప్పుడు, హల్దీరామ్ స్వయంగా వెజ్ షమీ కెబాబ్, సోయా షమీ కెబాబ్, దహీ కెబాబ్, హరాభరా కెబాబ్‌లను తయారు చేసేవారు. క్రమేపీ ఇక్కడ రసగుల్లా, సోమ్ పాపిడీ, పానీపూరీ... వంటివి కూడా ప్రారంభించారు.

గుడ్ ఫుడ్

# స్ట్రాబెర్రీలతో ఎన్నెన్నో ప్రయోజనాలు!

**కంటికి మేలు కలగాలంటే క్యారట్ తినాలని తెలుసు. గర్భవతులకు పాలకూర వంటి ఆకుకూరల్లో ఉండే ఫోలిక్ యాసిడ్ మేలు కలిగిస్తుందని తెలుసు. అలాంటి మేళ్లు ఎన్నో కలగలసి ఒక్క స్ట్రాబెర్రీ పండ్లలోనే ఉన్నాయని తాజా అధ్యయనాల్లో తెలిసింది. స్ట్రాబెర్రీల వల్ల కలిగే అనేక ప్రయోజనాలు ఇవే...**

**మంచి చూపు కోసం...**

వయసు పెరుగుతున్న కొద్దీ చూపునకు సంబంధించిన కొన్ని మార్పులు వచ్చి కంటిచూపు కాస్త తగ్గుతుందన్న విషయం తెలిసిందే. ఈ సమస్యను సాధారణంగా ఏజ్ రిలేటెడ్ విజన్ లాస్ లేదా ఏజ్ రిలేటెడ్ మాలిక్యులార్ డీజనరేషన్ అంటుంటారు. కానీ వయసు పెరిగే కొద్దీ చూపు తగ్గే సమస్యను తగ్గించడానికి స్ట్రాబెర్రీ బాగా ఉపయోగపడతాయని తాజా అధ్యయనాల్లో తేలింది. ఈ పండ్లలో ఉండే విటమిన్–సి వల్ల చూపు తగ్గే సమస్య నివారితమవుతుంది. క్రమం తప్పకుండా స్ట్రాబెర్రీలు తినడం వల్ల ఈ సమస్యను దాదాపు 36 శాతానికి పైగా నివారించవచ్చని తేలింది. ఈ అధ్యయన ఫలితాలను ‘ఆర్కైవ్స్ ఆఫ్ ఆఫ్తాల్మాలజీ’లో ప్రచురించారు.

**క్యాన్సర్ నివారణ కోసం...**

స్ట్రాబెర్రీలలో ఉండే యాంథోసయనిన్, ఎలాజిక్ యాసిడ్ అనే రెండు యాంటీ ఆక్సిడెంట్ల వల్ల అనేక రకాల క్యాన్సర్లు నివారితమవుతాయని తేలింది. ఇదే విషయాన్ని ‘జర్నల్ ఆఫ్ అగ్రికల్చర్, ఫుడ్ కెమిస్ట్రీ’లో ప్రచురించారు. స్ట్రాబెర్రీలు తినేవారిలో ఊపిరితిత్తులు, ఈసోఫేగస్, రొమ్ము క్యాన్సర్లు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తక్కువని ఈ అధ్యయనంలో తెలిసింది.

**గర్భవతుల కోసం...**

గర్భధారణ ప్లాన్ చేసుకున్న స్త్రీలకు, గర్భం వచ్చిందని తెలిసిన మహిళలకు డాక్టర్లు రాసే ముఖ్యమైన పోషకం ఫోలిక్ యాసిడ్. ఇది పుట్టబోయే పిల్లల్లో వెన్ను సంబంధిత లోపమైన స్పైనాబైఫిడా వంటి సమస్యలను నివారిస్తుంది. అంతేకాదు... ఫోలిక్ యాసిడ్ ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడానికి, మూడ్స్‌ను మెరుగుపరచే సెరటోనిన్ వంటి మెదడు రసాయనాలు స్రవించడానికి కూడా ఉపయోగపడుతుంది. ఫోలిక్ యాసిడ్ తీసుకున్నప్పుడు వచ్చే ప్రయోజనాలే స్ట్రాబెర్రీలతో కలుగుతాయట. అయితే స్ట్రాబెర్రీస్ కొందరిలో అలర్జీలను కలిగిస్తాయి. అవి సరిపడని వారిలో ఎగ్జిమా, చర్మం మీద దద్దుర్లు, తలనొప్పి, నిద్రలేమి కలిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



## తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

మంచి అదృష్టయోగం నడుస్తున్న కారణంగా కుటుంబ సభ్యులందరి సంపాదననీ ఒకచోట చేర్చి గృహాన్ని/భూమిని/పొలాన్ని కొనడం గానీ లేదా ఉన్న ఇంటికి భారీగా మరమ్మతులు చేపట్టడం గానీ జరగచ్చు. కుటుంబంలో అందరిలోనూ ఐకమత్యం దృఢంగా ఉంటుంది.

వ్యవసాయదారులకి మంచి ఆదాయాలు వచ్చే సూచనలున్నాయి. అవకాశం చేసుకుని సొంత వ్యవసాయాన్నే గనక చేసుకుంటే చక్కని ఆర్థిక లాభం ఉండడమే గాక సరైన ఎరువుని సరైన తీరులో వేసుకుంటూ భూసారాన్ని పెంచుకోగలుగుతారు.

అదే మరి కౌలుకిస్తే ఈ దృఢత్వం భూమికి రాదు. ఈ విషయాన్ని ఆలోచించుకుని కౌలుకి ఇయ్యొద్దు. కొద్ది శ్రమైనా సొంతంగానే చేసుకోండి.

లోగడ ఎదుర్కొన్న ఇబ్బందులు దాదాపుగా తొలగిపోయినట్లుగానే భావించచ్చు. ప్రతి ప్రయాణమూ లాభసాటిగానే ఉంటుంది.

స్థిరమైన ఆస్తుల కొనుగోళ్లకో లేదా ఉన్న ఆస్తుల మరమ్మతులకో కొంత సొమ్ముని రుణంగా బంధువుల నుండి తీసుకోవచ్చు.

తలిదండ్రుల ఆరోగ్యం బాగానే ఉన్నట్లనిపించినా ఒకరికి మాత్రం ఔషధసేవ తప్పనిసరి కావచ్చు. మిత్రులూ బంధువులూ ఇరుగు పొరుగులూ.. ఇలా అందరూ కూడా మీ మాటనే విశ్వసించేవారు అయ్యే కారణంగా ఒకప్పుడు మీకు వచ్చిన అప్రతిష్ఠ దాదాపుగా తొలగిపోతుంది.

**లౌకిక పరిహారం:** ప్రతీకార బుద్ధి సరికాదు.

**అలౌకిక పరిహారం:** గోధుమ జలాభిషేకాన్ని శంకరునికి చేయడం మంచిది.

## ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)

అనవసర విషయాల మీద ఎక్కువ సమయాన్ని కేటాయించుకుంటూ కాలాన్ని వృథా చేసుకుంటున్నారేమో ఆలోచించుకోండి.

సరైన సమయంలో విత్తనాన్ని నాటకుండా ఆలస్యం చేసుకుని అకాలంలో విత్తనాలని చల్లి ఎరువు వేసినా ఫలితం శూన్యమే ఔతుంది. గమనించుకుని సమయాన్ని సద్వినియోగపరుచుకోండి. విషయం మీద సరైన అవగాహన లేనివాళ్లు మిమ్మల్ని బాగా ప్రశంసించేస్తూ మీ చేత తమ పనిని చేయించుకుంటూ ఉండచ్చు.

దీనివల్ల వాళ్లు ప్రయోజనాన్ని పొందుతున్నారు తప్ప, మీరేం లాభాన్ని పొందగలుగుతున్నారు.. పరిశీలించుకోండి. జీవితంలో కొంత స్వార్థం (ఇతరులకి హానికరం కాని తీరులో) అవసరం. గృహిణులకి సంతానంతో తాత్కాలిక వ్యతిరేకత వచ్చే అవకాశమున్న కారణంగా కొద్ది జాగ్రత్తగా మాట్లాడడం, మాట్లాడుకోవడం అవసరం.

ఒకవేళ వాళ్లు మాట తూలి ఓ మాటని అన్నప్పటికీ సంయమనాన్ని పాటించడం మంచిది. వినోద విహారయాత్రలకి వెళ్లే అవకాశముంది గాని వాటికై ఒక నిర్దిష్ట ప్రణాళిక (ఇన్ని రోజుల మాత్రమే) అవసరం. దానికి అటూ ఇటూ ఉండడం సరికాదు. విద్యార్థులకి సమస్యాకాలం ఇది.

ఎక్కడ చేరాలో అనే విషయం గూర్చిన చర్చలు జరుగుతూనే ఉండచ్చు. కాలయాపన లేకుండా విషయాన్ని తెంచేసుకుని ఒక స్థిర నిర్ణయానికి రావడం మంచిది.

పిల్లల చదువులూ వాటి కోసం కావలసిన ఆర్థికమైన వనరులూ.. గమనించుకుని కొత్త ఆస్తుల్ని సంపాదించుకోవాలనే ఆలోచనని కొద్దిగా వాయిదా వేయడం మంచిది.

**లౌకిక పరిహారం:** సమయాన్ని వృథా చేసుకోకండి. పొగడ్తలకి లొంగిపోకండి.

**అలౌకిక పరిహారం:** ఆవుపెరుగుతో శివాభిషేకం ఉత్తమం.

## కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)

వ్యవసాయదారులయ్యుంటే పరిస్థితి నిరాశజనకంగా ఉండచ్చు. పొలం పనులకి కూలీల రాకా, యంత్రపరికాలు పనిచేసే విధానం, భూమిలో ఉండాల్సిన సారం, కూలీలని పర్యవేక్షించే నమ్మకమైన వ్యక్తీ.. ఇలా అన్నిటా ప్రతికూలతే ఉండచ్చు.

ధైర్యంగా ఉండడమే తప్ప చేయగలిగింది లేదు. కుజుడు బుధుడూ అర్ధశుభులుగా ఉన్నారు. వ్యాపారం చేసేవారు సరుకుకోసం ముందుకి ముందే సొమ్ము నిచ్చి ఆ సరుకు రాకపోవడమో లేక చెప్పినదీ చూపించినదీ అయిన సరుకు ఆ వచ్చినది కాకపోవడమో జరిగి, ఆ ఇచ్చిన సొమ్ముని వెనక్కి తెచ్చుకునే ఆలోచనతో సతమతమయ్యే అవకాశముంది కాబట్టి తగిన వ్యవహారంలో తగిన బందోబస్తుతో వ్యవహరించడం మంచిది.

ఉద్యోగస్థులయినట్లయితే అధికారుల వ్యతిరేకతకీ ఆగ్రహానికీ నిష్కారణంగా గురయ్యే అవకాశం ఉంది. మాటకి మాట బదులు చెప్పడం పెద్ద పనేమీ కాదు గాని, వ్యవహారం మలుపు తిరిగితే దాన్ని సరి చేసుకోవడం సామాన్యమైన పని కా(బో)దు.

కాబట్టి కొద్దిగా తలొంచుకుని వ్యవహారాన్ని ముగించుకోవడం ఉత్తమం. నిదానంగా వ్యవహరించిన పక్షంలో మాత్రమే మీరు గెలుపుని సాధించుకోగలుగుతారు తప్ప దూకుడుతనంతో వెళ్లినట్లయితే ఇబ్బందికి గురౌతారు. అందుకే రెండోసారి కూడ ఈ విషయాన్ని చెప్పడం జరుగుతోంది.

ఎన్నెన్నో ప్రయాణాలు చేయవలసి రావడంతో ప్రయాణించి ప్రయాణించి శారీరకంగా నిస్సత్తువతో ఉండిపోతారు ఇల్లు కదలక. ఆరోగ్యం జాగ్రత.

**లౌకిక పరిహారం:** శారీరక స్థితిని గమనించుకుని మాత్రమే ప్రయాణాలు చేయండి.

**అలౌకిక పరిహారం:** శంకరునికి చెరుకు రసంతో అభిషేకాన్ని చేయించుకోండి.

## వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)

లోగడ అవసరం కోసం చేసిన రుణాలకి అదనంగా మరికొంత రుణాన్ని చేయవలసి రావచ్చు. ప్రతి ప్రయాణమూ ప్రయోజనకరం ఏమాత్రమూ కాదని తెలిసి కూడా ప్రయాణాలు చేయవలసి రావచ్చు.

ప్రయాణాల్లో అతి ముఖ్యమైన పత్రాలూ వస్తువుల పట్ల జాగరూకత అత్యంత అవసరమని గుర్తించండి.

జీవిత భాగస్వామితో సత్సంబంధాలు లేకపోవడం గాని– న్యాయస్థానంలో వ్యవహారం నడుస్తుండడం గాని– ప్రతీకార బుద్ధితో దంపతుల్లో ఒకరు (ముఖ్యంగా భార్య) ఉండడం గాని– ఒకవేళ తనతో కలిసి అదే గృహంలోనే ఉంటే భర్త ఆరోగ్యం దెబ్బతినడం గాని జరిగే అవకాశముంది. దూరంగా గాని భార్యాభర్తలున్న పక్షంలో సంతానాన్ని చూసే వీలుని ఆమె ఈయకపోవచ్చు.

మీరు మాట్లాడే ప్రతి మాటనీ ఎవరో వింటున్నారనే ఆలోచనతో ఉండండి. ప్రత్యక్షంగా మాట్లాడడమే అయితే ఆచితూచి మాట్లాడడం మంచిది తప్ప తోచిన విధంగా మాట్లాడడం ప్రమాదకరం. అనుకూలంగా ఉంటూ శత్రుభావంతో ఉన్న మిత్రులున్నారు. ఓ కంట కనిపెట్టి ఉండండి.

వ్యాపారస్థులకి ప్రభుత్వం వారి నుండి జరిమానాలు విధింపబడవచ్చు. చిన్న చిన్న అభియోగాలు మోపబడచ్చు. అనారోగ్యాన్ని అశ్రద్ధ చేసే అవకాశముంది.

కాబట్టి కుటుంబ సభ్యులు కుటుంబంలో అనారోగ్యవంతులుంటే వారిపట్ల శ్రద్ధని వహించి ఉండాల్సిందే.

**లౌకిక పరిహారం:** ఆచితూచి మాట్లాడాలి. అనుకూల శత్రువులున్నారు జాగ్రత్త!

**అలౌకిక పరిహారం:** ఆవుపాలతో శివాభిషేకం ఉత్తమం.

## మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)

‘క్షణం తీరికలేదు – దమ్మిడీ ఆదాయం లే’దనేది ఓ సామెత ఒకప్పుడుండేది. సరిగ్గా దానికి ఉదాహరణగా మీరు తీవ్రంగా శ్రమిస్తూ ఉంటారు.

అయితే ఫలితం మాత్రం ఖాళీ అరచేయి మాత్రమే అవుతూ ఉంటుంది. ఆదాయం రాకుంటే బాధ లేదు గాని సమయం వ్యర్థం అవుతూ ఉండడం – దాంతో పాటు మానసిక నిరుత్సాహం కల్గడం జరుగుతూ ఉంటుంది. అది సరి కాదు.

వెంటనే సరైన వ్యాపారం కోసం అన్వేషణ చేయండి. మీరు మాట్లాడే తీరు ధర్మబద్ధంగానూ వ్యవహార శైలితోనూ హానికరం కాని లౌక్యంతోనూ ఉండే కారణంగా మీ మధ్యవర్తిత్వాన్ని ఆకాంక్షిస్తూ మీ బంధువులో ఆప్తులో మరెవరో మీ వద్దకి వచ్చే అవకాశముంది. తప్పక సహాయపడండి తప్ప, మొత్తం బాధ్యతనంతా భుజాన వేసుకుని దిగిపోకండి మధ్యవర్తిత్వానికి. సహజంగా ముందుగా ఎవరు మనదగ్గరకొచ్చి ఓ విషయాన్ని చెప్తారో దాన్నే మనం నిజమని నమ్ముతాం.

అలాటి ధోరణిని విడనాడి తలదూర్చండి, శృతిమించి పోకండి. సంతానానికి అంటే సంతానంలో ఒకరికి తాత్కాలిక అనారోగ్యబాధ కలగచ్చు.

అది తేలికపాటిదే కాబట్టి మరింత పెద్దవైద్యుని దగ్గరికి వెళ్లక్కర్లేదు. అయితే అనారోగ్యం ఎందుకొచ్చిందో ఒక్కసారి విశ్లేషించుకున్న పక్షంలో ఆ సమస్యకి మూల కారణం తెలుస్తుంది.

సమస్యకి పరిష్కారం లభిస్తుంది కూడ.

**లౌకిక పరిహారం:** మధ్యవర్తిత్వంలో శ్రుతిమించద్దు.

**అలౌకిక పరిహారం:** శివునికి తేనెతో అభిషేకం చేయడం ఉత్తమం.

## మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)

సంతానం గాని ఇంకా విద్యార్థి దశలోనే ఉన్నట్లయితే వాళ్లకి విద్యేతర విషయంలో – అంటే సంగీతం క్రీడలు ఈత చిత్ర లేఖనం సంగీతవాద్యాల మీదా ఆసక్తి క్రమంగా పెరిగి, ప్రధానమైన విద్యమీద దృష్టి తగ్గిపోతూండే ప్రమాదం ఉంది. గమనించుకుని తోవకి తెచ్చుకోండి.

భయపెట్టీ వారించీ హెచ్చరిస్తూ ప్రవర్తించినట్లయితే పరిస్థితి మరోలా కూడ ఉండచ్చు. పరిస్థితిని బట్టి సరిచేసుకోండి. సంతానంలో ఒకరికి వ్యాపార దృక్పథం చిన్నతనం నుండే అలవడే అవకాశం – దాంతోపాటు మీరు వ్యాపారస్థులే గాని అయ్యుంటే మీతో పాటు వ్యాపార స్థలానికి అప్పుడప్పుడు వస్తూండే అలవాటూ ఉండచ్చు. ఇది కూడ ప్రధాన విద్యకి విఘాతం కల్గించేదే కావచ్చు. ఆలోచించుకోండి.

అకస్మాత్తుగా ఆధ్యాత్మిక ధోరణి మీలో కలిగి దానధర్మాలూ పుణ్యక్షేత్ర సందర్శనాలూ పుణ్యనదీ స్నానాలూ.. వంటివి చేయాలనే ఆలోచన దృఢంగా రావచ్చు. ఏ పనైనా సరే విద్యాభ్యాసం ధన సంపాదనం దైవభక్తీ.. ఇలా ఏదైనా సరే శ్రుతి మించి ఉండకూడదనే ఆలోచనకి రండి.

శుభకార్యం ఒకటి సిద్ధంగా ఉండచ్చు. తగు ప్రయత్నాల్లో ఉండండి. వాహనాలనీ యంత్రాలనీ మార్పులు చేసే ఆలోచనలో మీరుంటూ కొత్తవాటిని కొనుక్కుందా మనుకోవచ్చు. ‘లోతు చూసి గోతులోకి దిగు’ అన్న సామెత ప్రకారం ప్రస్తుతం అంత ఖర్చుకి తట్టుకోగలనా? అనుకుని ఆ మీదట దానికి తగ్గట్టు చేసుకోండి.

వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో ఏ అడ్డూ లేని – రాని కారణంగా ఆదాయం బాగా ఉంటుంది. సంతోషంగా ఉంటారు ఈ వారమంతా.

**లౌకిక పరిహారం:** పిల్లలకి ప్రధాన విద్య మీదే దృష్టి ఉండేలా చూసుకోండి.

**అలౌకిక పరిహారం:** శివునికి ఏవైనా సరే 5 ఫలాల రసంతో అభిషేకం చేయడం ఉత్తమం.

# గ్యాంగ్‌స్టర్ గానా బజానా!


● అధర్వ, వరుణ్ తేజ్

సెటిల్‌మెంట్స్ చేయాల్సిన గ్యాంగ్‌స్టర్ సెట్‌లో స్టెప్పులేశాడు. ఇదంతా ‘వాల్మీకి’ సెట్‌లో జరిగిందని తెలిసింది. వరుణ్ తేజ్, అధర్వ ముఖ్యతారాగణంగా హరీష్ శంకర్ దర్శకత్వంలో ‘వాల్మీకి’ అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజాహెగ్డే, మృణాళిని రవి కథానాయికలుగా నటిస్తున్నారు. ఇందులో గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటిస్తున్నారు వరుణ్. ప్రస్తుతం ఈ సినిమాలోని ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించారని తెలిసింది. ఈ పాటకు వరుణ్ వేసిన స్టెప్స్ అదుర్స్ అని సమాచారం. అలాగే ఈ సినిమా చిత్రీకరణలో తొలిసారి పాల్గొన్నారు పూజా హెగ్డే. గురువారం పూజ వాల్మీకి సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... తమిళ చిత్రం ‘జిగర్తండా’కు ఇది రీమేక్. ఓ గ్యాంగ్‌స్టర్ జీవితం ఆధారంగా సినిమా తీయాలని రియల్ గ్యాంగ్‌స్టర్ జీవితంతో ట్రావెల్ అయ్యే ఓ ఫిల్మ్ మేకర్ కథ ఆధారంగా ‘జిగర్తండా’ తెరకెక్కింది.

# రీమేక్ క్వీన్


● తమన్నా

రెగ్యులర్ సినిమాలతో పాటు రీమేక్ సినిమాలను అదే సంఖ్యలో చేస్తున్నట్టున్నారు తమన్నా. లేటెస్ట్‌గా ఓ తమిళ సినిమా హిందీ రీమేక్‌లో తమన్నా నటించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. తమిళ సూపర్ హిట్ చిత్రం ‘జిగర్తండా’ హిందీలో రీమేక్ కాబోతోంది. తమిళంలో సిద్ధార్థ్ చేసిన పాత్రలో ఆర్యన్ కార్తీక్, బాబీ సింహా చేసిన పాత్రలో సంజయ్ దత్ కనిపించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా తమన్నా నటిస్తారని తెలిసింది. ఈ చిత్రాన్ని అజయ్ దేవగణ్ నిర్మించనున్నారు. ఇది మాత్రమే కాదు.. ఈ ఏడాది తమన్నా ఎక్కువ రీమేక్స్‌లో కనిపించనున్నారు. ఇటీవలే హిందీ ‘క్వీన్’ను తెలుగులో ‘దటీజ్ మహాలక్ష్మి’గా రీమేక్ చేశారు. ఆ సినిమా రిలీజ్‌కు రెడీ అయింది . ఆల్రెడీ తెలుగు సూపర్ హిట్ ‘ఆనందో బ్రహ్మ’ను ‘పెట్రోమాక్స్’ టైటిల్‌తో తమిళంలో రీమేక్ చేశారు. అందులో తమన్నా లీడ్ రోల్ చేశారు. ఇప్పుడు తమిళ ‘జిగర్తండా’ హిందీ రీమేక్‌లో తమన్నా నటిస్తున్నారు. ఇలా ఒకేసారి తెలుగు టు తమిళం టు హిందీ సినిమాల రీమేక్స్‌తో ప్రస్తుతానికి ‘రీమేక్ క్వీన్’ అయ్యారు తమన్నా.

# రాజమండ్రికి పోదాం!


● కమల్ హాసన్


● రకుల్ ప్రీత్ సింగ్

రకుల్ ప్రీత్‌సింగ్ రాజమండ్రికి వెళ్లడానికి సూట్‌కేస్ సర్దుకుంటున్నారు. ఎందుకంటే ‘ఇండియన్ 2’ సినిమా కోసమే. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ‘ఇండియన్ 2’. ఇందులో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. సిద్ధార్థ్ సరసన రకుల్‌ప్రీత్ సింగ్ నటించనున్నారు. ప్రియాభవానీశంకర్, ఐశ్వర్యా రాజేష్ కీలకపాత్రలు చేస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ వచ్చే నెల 19న రాజమండ్రిలో ప్రారంభించడానికి టీమ్ సన్నాహాలు చేస్తోందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో రకుల్, కాజల్ పాల్గొంటారని కోలీవుడ్ టాక్. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం తమిళ ‘బిగ్ బాస్ 3’తో బిజీగా ఉన్నారు కమల్. అయితే ఆగిపోయిన ‘తలైవన్ ఇరుక్కిండ్రాన్’ (2015లో దర్శక-నిర్మాతగా కమల్ ప్రకటించారు) సినిమా పనులను కూడా కమల్ ఇటీవల మొదలుపెట్టారు. సో.. ‘ఇండియన్ 2’, ‘తలైవన్ ఇరుక్కిండ్రాన్’ సినిమా షూటింగ్ లొకేషన్స్‌కి, బిగ్ బాస్ షోతో కమల్ బిజీ బిజీగా ఉంటారన్నమాట.

# మిస్టర్ బచ్చన్ పాండే


● అక్షయ్ కుమార్

నాన్‌చాక్ పట్టుకుని ‘నేను రెడీ’ అంటున్నారు బచ్చన్ పాండే. అక్షయ్ కుమార్ నటించనున్న తాజా చిత్రానికి ‘బచ్చన్ పాండే’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలోని అక్షయ్ లుక్‌తో పాటు సినిమాను వచ్చే ఏడాది క్రిస్మస్‌కు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రం అజిత్ నటించిన తమిళ చిత్రం ‘వీరమ్’కి (తెలుగులో ‘కాటమరాయుడు’ గా రీమేక్ అయ్యింది) హిందీ రీమేక్ అని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ప్రస్తుతం లక్ష్మీబాంబ్, సూర్యవన్షీ సినిమాలతో బిజీగా ఉన్నారు అక్షయ్. అలాగే ఆయన నటించిన ‘మిషన్ మంగళ్’ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

# మంచి కంటెంట్ ఉన్న సినిమా


● సిద్ధేశ్వరరావు, వినాయక్, జాకట్ రమేశ్

**- వీవీ వినాయక్**

పూల సిద్ధేశ్వరరావు హీరోగా పరిచయం కానున్న చిత్రం ‘రథేరా’. జాకట్ రమేష్ దర్శకత్వం వహించారు. నరేష్ యాదవ్, వైఎస్ కృష్ణమూర్తి, పూల సిద్ధేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన ప్రముఖ దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ– ‘‘టైటిల్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. చాలా బాగుంది. కొత్త ఆర్టిస్టులతో ఈ సినిమాను రమేష్ అద్భుతంగా తెరకెక్కించాడు. హీరోకి మంచి భవిష్యత్ ఉంది. దర్శకుడు మంచి కంటెంట్‌తో తెరకెక్కించాడు. ఈ సినిమాతో బ్రేక్ రావాలి. నిర్మాతలకు డబ్బులు రావాలి’’ అన్నారు. ‘‘ఎంతోమంది నూతన దర్శకులకు వీవీ వినాయక్‌గారు స్ఫూర్తిదాయకం. ఆయన మా సినిమా ట్రైలర్‌ను విడుదల చేయడంతో మా సినిమాకు మంచి బజ్ వచ్చింది’’ అన్నారు రమేష్. ‘‘ట్రైలర్‌ను విడుదల చేసిన వినాయక్‌గారికి థ్యాంక్స్. దర్శకుడు ప్యాషన్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు’’ అన్నారు నిర్మాతలు.

# అందరూ ఆలోచించేలా...

‘‘శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట’ చిత్రం ఫేమ్ శేఖర్ వర్మ హీరోగా, వివియా, విద్య హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం ‘నివాసి’. సతీష్ రేగళ్ళ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గాయత్రి ప్రొడక్షన్స్ పతాకంపై కె.ఎస్.రావు నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 9న విడుదల కానుంది. శేఖర్ వర్మ మాట్లాడుతూ– ‘‘శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట’ అనే చిత్రాన్ని ఇటీవల అమేజాన్ ప్రైమ్‌లో చూసిన ప్రేక్షకుల నుంచి వస్తున్న ప్రశంసలు


● శేఖర్ వర్మ, వివియా

నాలోని ఉత్సాహాన్ని రెట్టింపుచేశాయి. ఒక మంచి ట్రావెల్ స్టోరీ ఇది. ప్రతి మనిషి ఒకసారి ఆలోచించుకునేలా ఈ చిత్రకథ ఉంటుంది. నా కెరీర్‌లో ‘నివాసి’ మరో మంచి చిత్రంగా నిలుస్తుందనే నమ్మకం ఉంది’’ అన్నారు. ‘‘ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. మంచి భావోద్వేగాలతో ప్రతి ఒక్కరి మనసు గెలుచుకునేలా ఉంటుంది. ఈ సినిమా తర్వాత శేఖర్ మంచి నటుడిగానే కాకుండా సక్సెస్‌ఫుల్ హీరోగా నిలబడతాడు. నిర్మాతలు కె.ఎస్.రావు, వర్మగార్లు కాంప్రమైజ్ కాకుండా చిత్రాన్ని తెరకెక్కించారు’’ అని సతీష్‌రేగళ్ళ అన్నారు. ఈ సినిమాకి సంగీతం: చరణ్–అర్జున్, కెమెరా: కె.చిట్టిబాబు.













సాక్షి స్పోర్ట్స్
శనివారం
27-7-2019



## యువీ రెండో ఇన్నింగ్స్ షురూ

అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ కొత్తగా గ్లోబల్ టి20 కెనడా లీగ్‌లోకి అడుగు పెట్టాడు. యువీ కెప్టెన్‌గా వ్యవహరించిన టొరంటో నేషనల్స్, క్రిస్ గేల్ నాయకత్వంలోని వాంకోవర్ నైట్స్ మధ్య గురువారం టోర్నీ తొలి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో వాంకోవర్ 8 వికెట్లతో గెలిచింది. యువరాజ్ 27 బంతుల్లో 14 పరుగులు చేశాడు. గ్లోబల్ లీగ్ మ్యాచ్‌లకు ఐపీఎల్ తదితర లీగ్‌ల తరహాలో దేశవాళీ టి20 మ్యాచ్‌లుగా కూడా గుర్తింపు లేదు.

# ఫైనల్లో నిఖత్, హుసాముద్దీన్


నిఖత్

**థాయ్‌లాండ్ ఇంటర్నేషనల్ బాక్సింగ్**

**న్యూఢిల్లీ:** బ్యాంకాక్‌లో జరుగుతున్న థాయ్‌లాండ్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు నిఖత్ జరీన్, హుసాముద్దీన్ ఫైనల్లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో మహిళల 51 కేజీల విభాగంలో తెలంగాణకు చెందిన జరీన్ 4–1తో జుతమస్ జిత్పోంగ్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించగా... మరో తెలంగాణ బాక్సర్, కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత హుసాముద్దీన్ పురుషుల 56 కేజీల విభాగంలో 3–2తో అమ్మరిట్ యోదమ్ (థాయ్‌లాండ్)పై గెలిచి తుది పోరుకు అర్హత సాధించాడు. వీరితో పాటు ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ రజత పతక విజేత దీపక్ సింగ్ (49 కేజీలు), ఆశిష్ కుమార్ (75 కేజీలు), బ్రిజేష్ యాదవ్ (81 కేజీలు)లు సెమీస్‌లో తమ ప్రత్యర్థులను మట్టికరిపించి ఫైనల్స్‌కు చేరారు. మహిళల విభాగంలో మంజు రాణి (48 కేజీలు), భాగ్యబతి కచారి (81 కేజీలు) సెమీస్‌లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.


హుసాముద్దీన్

# సింధు ఔట్ సెమీస్‌లో ప్రణీత్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ పోరాటం ఒక్కడి చేతుల్లోనే మిగిలుంది. తెలుగు తేజం భమిడిపాటి సాయిప్రణీత్ అలవోక విజయంతో సెమీ ఫైనల్ చేరగా... స్టార్ షట్లర్ పూసర్ల వెంకట సింధు ఆట క్వార్టర్స్‌లోనే ముగిసింది.


సాయి ప్రణీత్

**జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్**

**టోక్యో:** ఈ సీజన్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు మళ్లీ టైటిల్ వేటకు దూరమైంది. జపాన్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 టోర్నమెంట్ కూడా ఆమెకు అందని ద్రాక్షగా ముగిసింది. ఈ టోర్నీ మహిళల ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ స్టార్ సింధు క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. మరో వైపు ఈ టోర్నీలో అసాధారణ ఆటతీరుతో ముందడుగు వేస్తున్న సాయి ప్రణీత్ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. పురుషుల సింగిల్స్‌లో ఈ అన్‌సీడెడ్ ఆటగాడు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ షెట్టి జోడీకి నిరాశే ఎదురైంది.

**అలవోక విజయంతో...**

పురుషుల సింగిల్స్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాయిప్రణీత్ వరుస గేముల్లో అలవోక విజయం సాధించాడు. అతను 21–12, 21–15తో ఇండోనేసియాకు చెందిన టామి సుగియార్తోను ఇంటిదారి పట్టించాడు. కేవలం 36 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆటకట్టించాడు. తొలి గేమ్‌లో సుగియార్తోనే ఖాతా తెరిచినా... జోరు మాత్రం ప్రణీత్‌దే! ఇండోనేసియా ఆటగాడు ఒక పాయింట్ చేయగానే... సాయిప్రణీత్ వరుసగా 5 పాయింట్లు సాధించాడు. అక్కడి నుంచి మొదలైన జోరుకు ఏ దశలోనూ సుగియార్తో ఎదురు నిలువలేకపోయాడు. ప్రత్యర్థి 10 పాయింట్లు సాధించే లోపే 19 పాయింట్లతో తెలుగు షట్లర్ గెలుపు తీరం చేరాడు. రెండో గేమ్ కూడా ఇందుకు భిన్నంగా ఏమీ జరగలేదు. ఆరంభం నుంచే సాయిప్రణీత్ కోర్టులో చురుగ్గా కదంతొక్కడంతో పాయింట్లు చకచకా వచ్చేశాయి. రెండు సార్లు 5–4, 12–10 స్కోరు వద్ద ప్రణీత్‌కు చేరువైనప్పటికీ... సుగియార్తోను ఓడించేందుకు భారత ఆటగాడికి ఎంతోసేపు పట్టలేదు.

**సింధు మరోసారి...**

మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ షట్లర్ ఐదో సీడ్ సింధు 18–21, 15–21తో నాలుగో సీడ్ యామగుచి (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్‌లో చక్కని పోరాటపటిమ కనబరిచిన సింధు... రెండో గేమ్‌లో ఆ ఆటతీరు కొనసాగించలేకపోయింది. చివరకు 50 నిమిషాల్లో ప్రత్యర్థి ధాటికి ఇంటిదారి పట్టింది. ఈ సీజన్‌లో సింధు ఒకే ఒక్క టోర్నీ (ఇండోనేసియా ఓపెన్)లో ఫైనల్ చేరింది. అంతిమ పోరులో యామగుచి... సింధును ఓడించి టైటిల్ ఎగరేసుకుపోయింది. తాజాగా ప్రతీకారం తీర్చుకునే అవకాశం సింధుకు వచ్చింది. కానీ తెలుగుతేజం కసితీరా ఆడలేకపోయింది. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ షెట్టి ద్వయం 19–21, 18–21తో రెండో సీడ్ తకెషి కముర– కెయిగో సొనొద (జపాన్) జంట చేతిలో ఓడింది.

## కపిల్ కమిటీకే కోచ్ ఎంపిక బాధ్యత

**న్యూఢిల్లీ:** ముందుగా ఊహించిన మేరకు భారత పురుషుల క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ ఎంపిక బాధ్యతను దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఆధ్వర్యంలోని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)నే చేపట్టనుంది. ఈ మేరకు క్రికెట్ పాలకుల కమిటీ (సీఓఏ) చీఫ్ వినోద్ రాయ్ శుక్రవారం ప్రకటించారు. 'కోచ్ ఎంపికకు కపిల్ బృందం ఆగస్టు రెండో వారంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇది తాత్కాలిక కమిటీ కాదు. కపిల్, శాంత రంగస్వామిలకు పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం వర్తిస్తుందా? లేదా? అనేది మేం చూసుకుంటాం. ఇది పూర్తిగా న్యాయబద్ధమైనదే' అని ఆయన పేర్కొన్నారు. కోచ్ ఎంపిక ప్రక్రియపై కెప్టెన్ కోహ్లి ఏమీ చెప్పలేదని రాయ్ వివరించారు.

**బంగర్‌కు ఉద్వాసన!**

కొత్త సహాయ బృందం ఎంపిక సందర్భంగా టీమిండియా బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్‌కు ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. నాలుగేళ్ల పదవీ కాలంలో బలమైన మిడిలార్డర్‌ను తయారు చేయలేకపోవడం బంగర్ ప్రధాన వైఫల్యంగా చెబుతున్నారు. ప్రపంచ కప్ సెమీస్‌లో ధోనిని ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపాలన్న నిర్ణయమూ అతడిదేనని సమాచారం. బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్ స్థానానికి భరోసా దక్కుతోంది. ఏడాదిన్నరగా పేస్ విభాగాన్ని అతడు తీర్చిదిద్దిన తీరే ఇందుకు కారణం. ఫీల్డింగ్ కోచ్‌గా ఆర్.శ్రీధర్ పై మంచి అభిప్రాయమే ఉన్నా... జాంటీ రోడ్స్ (దక్షిణాఫ్రికా) వంటి మేటి ఫీల్డర్ పోటీ పడుతుండటం ప్రతికూలంగా మారింది. సహాయ కోచ్ పదవులకు సెలక్టర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.



**మలింగ వన్డే కెరీర్**

- 226 వన్డేల్లో 338 వికెట్లు
- బౌలింగ్ సగటు 28.87
- అత్యధిక వికెట్ల జాబితాలో 9వ స్థానం
- అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన 6/38

# మలింగకు ఘనంగా వీడ్కోలు

- తొలి వన్డేలో బంగ్లాదేశ్‌పై శ్రీలంక భారీ విజయం
- సెంచరీ బాదిన కుశాల్ పెరీరా

**కొలంబో:** యార్కర్ల కింగ్ లసిత్ మలింగ వీడ్కోలు వన్డేలో శ్రీలంక ఘన విజయం సాధించింది. తద్వారా తమ వెటరన్ పేసర్‌కు మంచి బహుమతి ఇచ్చింది. బంగ్లాదేశ్‌తో శుక్రవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో లంక 91 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు వన్‌డౌన్ బ్యాట్స్‌మన్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కుశాల్ పెరీరా (99 బంతుల్లో 111; 17 ఫోర్లు, సిక్స్) సెంచరీకి తోడు, కుశాల్ మెండిస్ (49 బంతుల్లో 43; 4 ఫోర్లు), ఆల్ రౌండర్ ఏంజెలో మాథ్యూస్ (52 బంతుల్లో 48; 3 ఫోర్లు) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. భారీ స్కోరు ఛేదనలో బంగ్లాను మలింగ (3/38) వరుస యార్కర్లతో కంగారుపెట్టాడు. ఓపెనర్లు, కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ (0), సౌమ్య సర్కార్ (15)లను అతడు ఈ విధంగానే బౌల్డ్ చేశాడు. మొదట్లోనే కష్టాల్లో పడిన జట్టును ముష్ఫికర్ రహీమ్ (86 బంతుల్లో 67; 5 ఫోర్లు), షబ్బీర్ రెహ్మాన్ (56 బంతుల్లో 60; 7 ఫోర్లు)లు ఐదో వికెట్‌కు 111 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరు వెనుదిరిగాక బంగ్లా పోరాటం ఎంతోసేపు సాగలేదు. తన చివరి ఓవర్లో ముస్తఫిజుర్ (18)ను ఔట్ చేసి ప్రత్యర్థి ఇన్నింగ్స్‌కు తెరదించి మ్యాచ్‌తో పాటు వన్డేలకు మలింగ సగర్వంగా బై బై చెప్పాడు.

# టైటాన్స్ 0–4



**ఆడిన నాలుగూ ఓడిన వైనం • పట్నా పైరేట్స్ గెలుపు**

**సాక్షి, హైదరాబాద్:** తెలుగు టైటాన్స్ తెలుగు నేలపై చేతులెత్తేసింది. సొంతప్రేక్షకులు మద్దతిచ్చినా... అసలు బోణీనే కొట్టలేకపోయింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలయ్యింది. శుక్రవారం జరిగిన హైదరాబాద్ అంచె ఆఖరి పోరులో టైటాన్స్ 22–34 స్కోరుతో పట్నా పైరేట్స్ చేతిలో పరాజయం చవిచూసింది. కోటి ఆశల సిద్ధార్థ్ దేశాయ్ మళ్లీ నిరాశపరిచాడు. స్టార్ రైడర్‌గా బరిలోకి దిగిన దేశాయ్ 12 సార్లు రైడింగ్‌కు వెళ్లి కేవలం 5 పాయింట్లే తెచ్చాడు. ఒక టాకిల్ పాయింట్ సాధించాడు. డిఫెండర్లు అబోజర్ మిఘాని (2), విశాల్ భరద్వాజ్ (2)లు ప్రత్యర్థి రైడర్లను టాకిల్ చేయలేకపోయారు. దీంతో తెలుగు జట్టు భారీ తేడాతో ఓడిపోయింది. మరోవైపు పట్నా జట్టులో స్టార్ ఆటగాళ్లయిన ప్రదీప్ నర్వాల్, జైదీప్‌లు ఆరంభం నుంచే పట్టుబిగించారు. రైడింగ్‌లో నర్వాల్ 7 పాయింట్లు సాధించగా, డిఫెండర్ జైదీప్ (6) టైటాన్స్ రైడర్లను చక్కగా ఒడిసిపట్టాడు. మిగతా ఆటగాళ్లలో జంగ్ కున్ లీ (4), నీరజ్ కుమార్ (3) ఆకట్టుకున్నారు. మొహమ్మద్ ఎస్మైల్, హాది ఒస్తరక్ చెరో 2 పాయింట్లు చేశారు. అంతకు ముందు మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ 44–19 స్కోరుతో యూపీ యోధపై ఘనవిజయం సాధించింది. గుజరాత్ తరఫున రైడింగ్‌లో రోహిత్ గులియా (10), డిఫెన్స్‌లో పర్వేశ్ బైన్స్వాల్ (6) రాణించారు. యూపీ జట్టులో రైడర్ శ్రీకాంత్ జాదవ్ (5) ఒక్కడే మెరుగనిపించాడు. నితీశ్ కుమార్, మోను గోయత్, ఆజాద్ రెండేసి పాయింట్లు చేశారు.

**అతిథిగా కోహ్లి**

నేటి నుంచి ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ పోటీలు ముంబైలో జరుగుతాయి. శనివారం ఇక్కడ జరిగే ఆరంభ వేడుకకు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అతిథిగా హాజరు కానున్నాడు.

**నేటి మ్యాచ్‌లు**

**యు ముంబా x పుణేరి పల్టన్ రా.గం. 7.30 నుంచి**
**జైపూర్ x బెంగాల్ వారియర్స్ రా.గం. 8.30 నుంచి**
**స్టార్‌స్పోర్ట్స్–2లో ప్రత్యక్షప్రసారం**

## టెస్టులకు ఆమిర్ గుడ్‌బై



**కరాచీ:** పాకిస్తాన్ లెఫ్టార్మ్ పేస్ బౌలర్ మొహమ్మద్ ఆమిర్ (27) టెస్టు క్రికెట్‌నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. వన్డేలు, టి20లపై ఎక్కువ దృష్టి పెట్టేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అతను వెల్లడించాడు. ఆమిర్ పాక్ తరఫున 36 టెస్టుల్లో 30.47 సగటుతో 119 వికెట్లు పడగొట్టాడు. అతని కెరీర్ రెండు దశలుగా సాగింది. 17 ఏళ్ల వయసులో టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఆమిర్ ముందుగా 14 టెస్టుల్లో 51 వికెట్లు పడగొట్టాడు. ఈ దశలో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడి ఐదేళ్ల నిషేధానికి గురయ్యాడు. శిక్షాకాలం పూర్తయిన తర్వాత 2016లో అతను పునరాగమనం చేశాడు. ఆ తర్వాత ఆడిన 22 టెస్టుల్లో 68 వికెట్లు తీశాడు. ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు 4 సార్లు పడగొట్టిన ఆమిర్... తన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన (6/44)ను వెస్టిండీస్‌పై నమోదు చేశాడు.

## రసెల్ లేకుండానే విండీస్ వన్డే జట్టు

**సెయింట్ జాన్స్:** భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌కు వెస్టిండీస్ జట్టును ప్రకటించారు. ఈ సిరీస్ తర్వాత రిటైరయ్యే అవకాశం ఉన్న స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. గాయంతో వరల్డ్‌కప్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న హార్డ్‌హిట్టింగ్ ఆల్ రౌండర్ ఆండ్రీ రసెల్‌కు మాత్రం వన్డే టీమ్‌లో చోటు దక్కలేదు.

**జట్టు వివరాలు:** హోల్డర్ (కెప్టెన్), గేల్, క్యాంప్‌బెల్, లూయిస్, షై హోప్, హెట్‌మైర్, పూరన్, ఛేజ్, అలెన్, కార్లోస్ బ్రాత్‌వైట్, కీమో పాల్, కాట్రెల్, థామస్, కీమర్ రోచ్




# అయ్యో... ఐర్లాండ్

- రెండో ఇన్నింగ్స్‌లో 38 పరుగులకే ఆలౌట్
- ఇంగ్లండ్‌తో టెస్టులో 143 పరుగుల తేడాతో ఓటమి
- కుప్పకూల్చిన వోక్స్ (6/17), బ్రాడ్ (4/19)

**పటిష్టమైన ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో కనీసం వంద పరుగులైనా చేయకుండా అడ్డుకుని, ఆపై బ్యాటింగ్‌లో మెరుగ్గా ఆడి చెప్పుకోదగ్గ ఆధిక్యం సాధించిన ఐర్లాండ్ జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం ఆ స్థాయి ఆటను కనబర్చలేకపోయింది. బౌలింగ్‌లో పట్టువిడిచి, బ్యాటింగ్‌లో చేతులెత్తేసి అత్యల్ప స్కోరుకు కుప్పకూలింది. ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో సంచలన విజయం సాధించే సువర్ణావకాశాన్నీ చేజార్చుకుంది.**


వోక్స్ (6/17)

**లండన్:** ఇంగ్లండ్ దెబ్బకు ఐర్లాండ్ హడలెత్తిపోయింది. 181 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఆతిథ్య జట్టు పేసర్లు క్రిస్ వోక్స్, స్టువర్ట్ బ్రాడ్ ధాటికి నిలవలేక రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 38 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా 143 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండు జట్ల మధ్య ఇక్కడ జరిగిన నాలుగు రోజుల టెస్టు మూడో రోజే ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 303/9తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ అదే స్కోరు వద్ద ఆలౌటైంది. అనంతరం ఐర్లాండ్ ఏదశలోనూ లక్ష్యం అందుకునేలా కనిపించలేదు. నాలుగో ఓవర్ చివరి బంతికి కెప్టెన్ పోర్టర్‌ఫీల్డ్ (2)ను పెవిలియన్ చేర్చిన వోక్స్... ప్రత్యర్థి పతనానికి బాటలు వేశాడు. ఆ వెంటనే మరో ఎండ్‌లో బాల్‌బ్రైన్ (5)ను బ్రాడ్ బలిగొన్నాడు. వోక్స్ ప్రతాపానికి స్టిర్లింగ్ (0) ఖాతా కూడా తెరవలేకపోయాడు. జేమ్స్ మెకల్లమ్ (11), విల్సన్ (0)లను మూడు బంతుల వ్యవధిలో అతడే ఔట్ చేశాడు. దీంతో ఐర్లాండ్ 24 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. తర్వాత బ్రాడ్ విజృంభించి మూడు వికెట్లు తీశాడు. ముర్టాగ్ (2) వికెట్లను గిరాటేసి వోక్స్ లాంఛనం పూర్తిచేశాడు. మూడో బౌలర్ ప్రమేయం లేకుండా 15.4 ఓవర్ల (బ్రాడ్ 8; వోక్స్ 7.4)లోనే ఐర్లాండ్ కథ ముగియడం విశేషం. ఆ జట్టు ఇన్నింగ్స్‌లో మెకల్లమ్ చేసినవే అత్యధిక పరుగులు. ఏకైక రెండంకెల స్కోరూ అదే కావడం గమనార్హం. ముగ్గురు డకౌటవగా మరొకరు సున్నా పరుగులతో నాటౌట్‌గా మిగిలారు. 11వ నంబర్ ఆటగాడే అయినా...రెండో ఇన్నింగ్స్‌లో నైట్‌వాచ్‌మన్‌గా వచ్చి 92 పరుగులు చేసిన ఇంగ్లండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్ జాక్ లీచ్ తన బ్యాటింగ్ ప్రదర్శనకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం విశేషం.

సాక్షి బిజినెస్
శనివారం
27-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 52 ▲ | 32 ▲ |
| 37,883 | 11,284 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గంటలకు)

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,327 | ▲ | 89 |
| డోజోన్స్ | 27,152 | ▲ | 11 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,549 | ▲ | 60 |
| డాక్స్ | 12,419 | ▲ | 58 |
| షాంఘై | 2,945 | ▲ | 7 |
| నికాయ్ | 21,658 | ▼ | 98 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.35 | 69.99 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.58 | 87.66 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.70 | 78.56 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.48 | 64.90 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.16 | 49.34 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.71 | 51.46 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.40 | 10.75 |

# మారుతీ లాభం 32 శాతం డౌన్

- 18 శాతం తగ్గిన అమ్మకాలు
- ప్రతికూల పరిస్థితుల్లోనూ 10 శాతానికి మించి మార్జిన్
- ఈ ఏడాది చివరి కల్లా బీఎస్–సిక్స్ అన్ని మోడళ్లు




**న్యూఢిల్లీ:** దేశంలోనే అతి పెద్ద వాహన కంపెనీ మారుతీ సుజుకీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 32 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ.2,015 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.1,377 కోట్లకు తగ్గిందని మారుతీ సుజుకీ ఇండియా తెలిపింది. అమ్మకాలు తక్కువగా ఉండటం, తరుగుదల వ్యయాలు ఎక్కువగా ఉండటంతో నికర లాభం ఈ స్థాయిలో తగ్గిందని వివరించింది. ఆదాయం రూ.21,814 కోట్ల నుంచి రూ.18,739 కోట్లకు తగ్గిందని తెలిపింది. తరుగుదల, అమోర్టైజేషన్ వ్యయాలు రూ.720 కోట్ల నుంచి రూ.919 కోట్లకు పెరిగాయని పేర్కొంది. నిర్వహణ లాభం 39% తగ్గి రూ.2,048 కోట్లకు తగ్గిందని, మార్జిన్ 4.5% తగ్గి 10.4 శాతానికి చేరిందని తెలిపింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఈ కంపెనీ 10%కి మించి మార్జిన్‌ను సాధించడం విశేషమని నిపుణులంటున్నారు. కాగా ఈ క్యూ1లో మొత్తం అమ్మకాలు 18 శాతం తగ్గి 4,02,594 యూనిట్లుగా ఉన్నాయని మారుతీ తెలిపింది. దేశీయ అమ్మకాలు 19 శాతం తగ్గి 3,74,481 యూనిట్లకు చేరాయని, ఎగుమతులు 28,113 యూనిట్లుగా ఉన్నాయని పేర్కొంది.

**రూపాయిల్లో రాయల్టీ చెల్లింపులు...**

వరుసగా నాలుగో క్వార్టర్‌లోనూ అమ్మకాలు తగ్గాయని మారుతీ సుజుకీ ఇండియా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అజయ్ సేత్ పేర్కొన్నారు. వాహన పరిశ్రమలో నెలకొన్న మందగమనం తమపై బాగానే ప్రభావం చూపించిందని తెలిపారు. అయితే ఈ పరిస్థితి చక్రీయమేనని వివరించారు. దీర్ఘకాలంలో అమ్మకాలు బాగా ఉంటాయని భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటిదాకా తమ మాతృ కంపెనీ సుజుకీ మోటార్ కార్పొకు రాయల్టీని యెన్ కరెన్సీలో చెల్లించామని, రానున్న మూడు సంవత్సరాల్లో రాయల్టీని రూపాయిల్లో చెల్లించనున్నామని తెలిపారు.

**గ్రామీణ అమ్మకాలు తగ్గుతున్నాయ్**

గతంలో జోరుగా ఉన్న గ్రామీణ ప్రాంత అమ్మకాలు కూడా తగ్గుతున్నాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) ఆర్.ఎస్. కల్సి పేర్కొన్నారు. భారత్ స్టేజ్–సిక్స్(బీఎస్–6) పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఉండే వాహనాలను ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి తెస్తామని వివరించారు. బీఎస్–సిక్స్ వాహనాలను 2020 కల్లా అందుబాటులోకి తేవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అధికంగా అమ్ముడయ్యే ఐదు మోడళ్లు–ఆల్టో, వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్, డిజైర్, బాలెనోలను ఇప్పటికే బీఎస్–సిక్స్ పర్యావరణ నియమాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసి అందుబాటులోకి తెచ్చామని కల్సి వివరించారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో మారుతీ సుజుకీ షేర్ 0.7 శాతం లాభంతో రూ.5,806 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయి రూ.5,685కు పతనమైంది.




## జీఎంఆర్ సంస్థల విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఓకే

**హైదరాబాద్:** జీఎంఆర్ గ్రూప్ సంస్థల విలీనం, విభజనకు సంబంధించిన ప్రతిపాదనలకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రతిపాదనల ప్రకారం జీఎంఆర్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ లిమిటెడ్‌లో జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్ కార్గో అండ్ లాజిస్టిక్స్‌ను విలీనం చేయనున్నారు. అలాగే, జీఎంఆర్ ఏరోటెక్నిక్‌కి చెందిన మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాలింగ్ (ఎంఆర్‌వో) వ్యాపార విభాగాన్ని జీఎంఆర్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ సంస్థ కింద విడగొట్టనున్నారు. మూడు సంస్థల వాటాదారులకు ప్రయోజనాలు చేకూర్చేందుకు, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఈ చర్యలు దోహదపడగలవని జీఎంఆర్ గ్రూప్ పేర్కొంది.

# లాభాల్లోకి పీఎన్‌బీ

- గత క్యూ1లో రూ.940 కోట్ల నష్టాలు
- ఈ క్యూ1లో 1,019 కోట్ల లాభం
- తగ్గిన మొండి బకాయిలు




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంక్ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో మళ్లీ లాభాల్లోకి వచ్చింది. గత క్యూ1లో రూ.940 కోట్ల నికర నష్టాలు రాగా, ఈ క్యూ1లో రూ.1,019 కోట్ల నికర లాభం వచ్చిందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ తెలిపింది. సీక్వెన్షియల్‌గా చూస్తే, గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో రూ.4,750 కోట్ల నికర నష్టాలు వచ్చాయని పేర్కొంది. రుణ నాణ్యత మెరుగుపడటంతో కేటాయింపులు తగ్గాయని, ఫలితంగా ఈ క్యూ1లో లాభాల బాట పట్టామని బ్యాంక్ ఎమ్‌డీ, సీఈఓ సునీల్ మెహతా చెప్పారు. గత క్యూ1లో రూ.15,072 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ1లో రూ.15,162 కోట్లకు పెరిగిందని తెలిపారు. గత క్యూ4 ఫలితాల వెల్లడి సందర్భంగా అధ్వాన పరిస్థితులు ముగిశాయని, రానున్న క్వార్టర్లలో మంచి పనితీరు చూపిస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

**రుణ నాణ్యత మెరుగు...**

బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ1లో 18.26 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ1లో 16.49 శాతానికి తగ్గాయని మెహతా తెలిపారు. నికర మొండి బకాయిలు 10.58 శాతం నుంచి 7.17 శాతానికి చేరాయని పేర్కొన్నారు. విలువ పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు రూ.82,889 కోట్ల నుంచి రూ.77,267 కోట్లకు, నికర మొండి బకాయిలు రూ.43,872 కోట్ల నుంచి రూ.30,180 కోట్లకు తగ్గాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి కల్లా మొండి బకాయిలు 10–12 శాతం రేంజ్‌లో దిగిరాగలవని ఆయన ధీమాగా చెప్పారు. మొండి బకాయిలు తగ్గడంతో మొండి బకాయిలకు కేటాయింపులు దాదాపు సగం తగ్గాయి. గత క్యూ1లో రూ.4,982 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ1లో రూ.2,147 కోట్లకు తగ్గాయని తెలిపారు. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 61.80 శాతం నుంచి 74.63 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు.

**రిటైల్ రుణాలు 22 శాతం అప్...**

భారీ మార్పుల దిశగా చర్యలు చేపట్టామని, ఫలితంగా వ్యాపారంలోనూ, రుణ నాణ్యతలోనూ మెరుగుదల సాధించామని మెహతా తెలిపారు. కేంద్రీకృత రుణ ప్రాసెసింగ్ ప్రక్రియ, ఒత్తిడిలోని రుణాల నిర్వహణలో మెరుగైన విధానం, పర్యవేక్షణ విభాగాల మెరుగుదల వంటి ప్రయత్నాలు ఫలాలనివ్వడం మొదలైందని పేర్కొన్నారు. రిటైల్ రుణాలు 22 శాతం, గృహ రుణాలు 30 శాతం పెరిగాయని పేర్కొన్నారు.

నష్టాల్లోంచి లాభాల్లోకి రావడం, రుణ నాణ్యత మెరుగుపడటంతో బీఎస్‌ఈలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేర్ 2.5 శాతం లాభంతో రూ.67.75 వద్ద ముగిసింది.

# విని'యోగం' మళ్లీ ఎప్పుడు?

- వ్యవస్థలో తగ్గిన వినియోగం
- ప్రభుత్వ మద్దతు నామమాత్రం
- వ్యవస్థలో నగదు లభ్యత తక్కువ
- ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో సంక్షోభం
- దీంతో షేర్లలో భారీ నష్టాలు
- కొంత కాలం పాటు ఇదే పరిస్థితి



| సూచీ/షేరు | క్లోజింగ్ | ఈ ఏడాది లాభం/నష్టం |
|---|---|---|
| నిఫ్టీ 50 | 11284 | 3.75% |
| నిఫ్టీ కన్జంప్షన్ | 4569.45 | -9.30% |
| టీవీఎస్ మోటార్ | 375.60 | -37% |
| ఎం అండ్ ఎం | 564.70 | -31.5% |
| గోద్రేజ్ కన్స్యూమర్ | 618 | -24% |
| మారుతి సుజుకీ | 5820 | -23% |
| హీరో మోటో | 2466 | -22.5% |

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక రంగానికి చోదక శక్తిగా నిలుస్తున్న వినియోగ రంగం ఈ ఏడాది గడ్డు పరిస్థితులను చవిచూస్తోంది. దేశీయ వినియోగం, ఉత్పాదకతపైనే ఎక్కువగా ఆధారపడిన మన ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు వృద్ధి క్షీణతను చవిచూస్తోంది. భారీ మెజారిటీతో రెండోసారి కొలువు దీరిన ఎన్డీయే సర్కారు కుంగిన ఆర్థిక వ్యవస్థను పరుగెత్తించే చర్యలు చేపడుతుందన్న ఆకాంక్షలు బలంగా ఉండగా, బడ్జెట్ తర్వాత నిరాశ చెందాల్సి వచ్చింది. ముఖ్యంగా వ్యవస్థలో నిధుల లభ్యత పడిపోవడం, ఎన్‌బీఎఫ్‌సీ రంగం సంక్షోభం వినియోగాన్ని దెబ్బతీశాయన్న విశ్లేషణ వినిపిస్తోంది.

**తగ్గిన డిమాండ్...**

జూలై 5న బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి నుంచి చూస్తే నిఫ్టీ కన్జంప్షన్ ఇండెక్స్ 5.7 శాతం పడిపోయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు చూసుకుంటే నిఫ్టీ కన్జంప్షన్ ఇండెక్స్ 9.4 శాతం నష్టపోగా, ఇదే కాలంలో నిఫ్టీ–50 3.8 శాతం మేర పెరిగింది. దేశ ఆర్థిక రంగ విస్తరణలో బ్యాంకులతోపాటు ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలది కీలకపాత్రగా చెప్పుకోవాలి. ఎందుకంటే బ్యాంకింగ్ రంగం నుంచి లోటు ఉన్న రంగాలకు రుణ అవసరాలను ఎన్‌బీఎఫ్‌సీ విభాగమే తీరుస్తోంది. ఎన్‌బీఎఫ్‌సీ రంగం నిధుల కటకటతో ఆర్థిక రంగ విస్తరణ కూడా ఆగిపోయిందన్నది విశ్లేషకుల అభిప్రాయం. వినియోగం తగ్గుదల అన్నది మరికొంత కాలం పాటు కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) భారత దేశ జీడీపీ వృద్ధి రేటు అంచనాను 2019–20 ఆర్థిక సంవత్సరానికి 0.3 శాతం మేర తగ్గించి 7%గా పేర్కొనడం గమనార్హం. డిమాండ్ తగ్గడమే అంచనాలను తగ్గించడానికి కారణమని ఐఎంఎఫ్ తెలిపింది.

**మరికొంత కాలం పాటు...**

కొత్త ఉద్యోగాలు లేకపోవడం, నగదు లభ్యత తక్కువగా ఉండడం తదితర కారణాలతో డిమాండ్/వినియోగం మరికొంత కాలం బలహీనంగానే ఉంటుందన్న అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ రంగంపై ప్రభుత్వ వ్యయాలు పెరగడం సానుకూల చర్య అని, అయితే గతంలో అధిక బేస్‌తోపాటు ప్రభుత్వ వ్యయాలు గణనీయంగా లేని అంశాలను వారు గుర్తు చేస్తున్నారు. కంపెనీల పరంగా చూస్తే... ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) 2019–20లో తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో గత ఏడు త్రైమాసికాల్లోనే తక్కువ విక్రయాలను నమోదు చేసింది. ఇక వినియోగంలో భాగమైన ఆటోమొబైల్ రంగం కూడా గడ్డు పరిస్థితులను చూస్తోంది. వాహన అమ్మకాలు గత కొన్ని నెలలుగా అంతకంతకూ తగ్గుతూ వస్తున్నాయి. ''ప్రస్తుతం వినియోగ రంగంలో ఉన్న పరిస్థితిని చూస్తుంటే... రానున్న త్రైమాసికాల్లోనూ అమ్మకాల వృద్ధి పెద్ద సవాలుగానే కనిపిస్తోంది. కన్స్యూమర్ స్టాపుల్స్, ఆటో, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు (క్యూఎస్ఆర్) జ్యుయలరీ విభాగాలు ఇప్పటికే ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత మందగమనం కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించనుంది'' అని ఈక్విరస్ సెక్యూరిటీస్ తన నివేదికలో పేర్కొంది.

**అప్రమత్తంగా ఉండాలి...**

సమీప కాలంలో ఆర్థిక వ్యవస్థ మరిన్ని సవాళ్లు ఎదుర్కోనున్న నేపథ్యంలో వినియోగ రంగ కంపెనీల ఫలితాల వృద్ధి పుంజుకోకవచ్చు. దీంతో స్టాక్స్ ధరలు మరింత క్షీణించే అవకాశాలు ఉన్నాయని ఈ రంగం షేర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. దీర్ఘకాల దృష్టితోనే కొనుగోళ్లకు దిగాలని సూచిస్తున్నారు. ఈ విభాగంలో ఎంఅండ్ఎం, టీవీఎస్ మోటార్, మారుతి సుజుకీ, హీరో మోటోకార్ప్, గోద్రేజ్ కన్స్యూమర్, కోల్గేట్ పామోలివ్, బ్రిటానియా, డీమార్ట్, యునైటెడ్ స్పిరిట్స్, హెచ్‌యూఎల్ షేర్లు నిఫ్టీ కన్జంప్షన్ సూచీలో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎక్కువగా నష్టపోయిన షేర్లు.

## ప్రైవేటీకరణ బాటలో మరిన్ని విమానాశ్రయాలు

- రెండో దశలో 20–25 ఎయిర్‌పోర్టులపై దృష్టి
- ఏఏఐ చైర్మన్ గురుప్రసాద్ వెల్లడి



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం మరిన్ని విమానాశ్రయాలను ప్రైవేటీకరించడంపై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆరు విమానాశ్రయాలను ప్రైవేటీకరించగా రెండో విడతలో మరో 20–25 ఎయిర్‌పోర్టులను ప్రైవేటీకరించాలని భావిస్తోంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. ఏటా 15 లక్షల మంది పైగా విమాన ప్రయాణీకులు ఉండే ఈ ఎయిర్‌పోర్టుల పేర్లను త్వరలోనే ఖరారు చేసి, కేంద్ర పౌర విమానయాన శాఖకు ఏఏఐ పంపనున్నట్లు ఆయన వివరించారు. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశాలు ఉన్న విమానాశ్రయాల జాబితాను సిద్ధం చేసేందుకు ప్రత్యేకంగా కన్సల్టెంట్‌ను నియమించినట్లు మహాపాత్ర చెప్పారు. 'తొలి రౌండు విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రెండో విడత కూడా విజయవంతం కాగలదని ఆశిస్తున్నాం. పలు విదేశీ ఎయిర్‌పోర్టులు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనవచ్చని అంచనా వేస్తున్నాం' అని ఆయన తెలిపారు. డబ్లిన్, మ్యూనిక్ ఎయిర్‌పోర్టులు ఇక్కడి విమానాశ్రయాల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఆసక్తిగా ఉన్నా.. తొలి విడత ప్రైవేటీకరణ ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందనేది వేచి చూడాలనే ఉద్దేశంతో అవి ముందుకు రాలేదని మహాపాత్ర చెప్పారు. 'మొదటి రౌండు విజయవంతంగా పూర్తవడాన్ని అంతా చూశారు. కాబట్టి రెండో రౌండులో ఆ తరహా విదేశీ ఎయిర్‌పోర్ట్స్ మరిన్ని ముందుకు వచ్చే అవకాశం ఉంది' అని ఆయన చెప్పారు. తొలి దశలో ప్రైవేటీకరించిన లక్నో, అహ్మదాబాద్, జైపూర్, మంగళూరు, తిరువనంతపురం, గువాహతిల్లోని ఆరు ఎయిర్‌పోర్టుల నిర్వహణ, అభివృద్ధి బిడ్స్‌ను అదానీ గ్రూప్ దక్కించుకున్న సంగతి తెలిసిందే.

## వొడాఫోన్ ఐడియా నష్టాలు 4,874 కోట్లు

**ఆదాయం రూ.11,270 కోట్లు**

**న్యూఢిల్లీ:** వొడాఫోన్ ఐడియా కన్సాలిడేటెడ్ నష్టాలు జూన్ త్రైమాసికంలో రూ.4,874 కోట్లుగా ఉన్నాయి. మార్చి త్రైమాసికంలో ఈ సంస్థ రూ.4,882 కోట్ల నష్టాలను నమోదు చేసింది. అంటే రూ.8 కోట్ల నష్టాలను తగ్గించుకుంది. వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులర్ రెండూ 2018 ఆగస్ట్ 31 నుంచి విలీనమై వొడాఫోన్ ఐడియాగా ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్రితం ఏడాది జూన్ త్రైమాసికం ఫలితాలతో ఈ ఏడాది జూన్ త్రైమాసికం ఫలితాలను పోల్చి చూడడం సరికాదు. జూన్ క్వార్టర్‌లో ఆదాయం మార్చి క్వార్టర్‌లో వచ్చిన రూ.11,775 కోట్ల నుంచి రూ.11,270 కోట్లకు తగ్గింది. కొంత మంది కస్టమర్లను కోల్పోవడం, ఉన్న కస్టమర్లలో కొంత మంది తక్కువ విలువ కలిగిన ప్లాన్లకు మారిపోవడం, సగటు యూజర్ నుంచి వచ్చే ఆదాయం తగ్గడం (ఏఆర్‌పీయూ) ప్రభావం చూపించాయి. ''మేము చెప్పిన విధానాన్నే ఆచరణలో అమలు చేస్తున్నాం. దీని తాలూకు ఫలితాలు ఇంకా కనిపించలేదు. మా నెట్‌వర్క్ అనుసంధానత, కస్టమర్ల డేటా వినియోగ అనుభవం చాలా ప్రాంతాల్లో మెరుగుపడింది'' అని వొడాఫోన్ ఐడియా సీఈవో బాలేష్ శర్మ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 4జీ కవరేజీ విస్తరిస్తామని, డేటా సామర్థ్యాలను కూడా పెంచుకుంటామని చెప్పారు. జూన్ త్రైమాసికంలో రూ.2,840 కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టామని కంపెనీ తెలిపింది. కంపెనీ యూజర్ల సంఖ్య 33.4 కోట్ల నుంచి 32 కోట్లకు తగ్గడం గమనార్హం.

## వేదాంత లాభం రూ.1,351 కోట్లు



**న్యూఢిల్లీ:** మైనింగ్ కంపెనీ, వేదాంత నికర లాభం (కన్సాలిడేటెడ్) ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ క్వార్టర్‌లో 12 శాతం తగ్గింది. గత క్యూ1లో రూ. 1,533 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.1,351 కోట్లకు తగ్గింది. కమోడిటీ ధరలు తగ్గడంతో నికర లాభం కూడా తగ్గిందని వేదాంత సీఈఓ శ్రీనివాసన్ వెంకటకృష్ణన్ తెలిపారు. మొత్తం ఆదాయం రూ.22,624 కోట్ల నుంచి రూ.21,754 కోట్లకు తగ్గిందని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి తమ స్థూల రుణ భారం రూ.59,517 కోట్లని, రూ.30,774 కోట్ల నగదు నిల్వలున్నాయని ఆయన వివరించారు.

## నిస్సాన్ చెన్నై ప్లాంట్‌లో 1,700 ఉద్యోగాల కోత..!




**న్యూఢిల్లీ:** జపాన్‌కు చెందిన కార్ల తయారీ కంపెనీ నిస్సాన్.. భారత్‌లోని తన చెన్నై ప్లాంట్‌లో భారీ స్థాయిలో ఉద్యోగాలను తగ్గించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఆరు వేలకు మించి ఉద్యోగులను తీసివేయనున్నట్లు కంపెనీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. 2020 ఆర్థిక సంవత్సరం నుంచి 2022 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా 6,100 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు వెల్లడించింది. ఆరు ప్రధాన నగరాల్లో ఈ కోతలు ఉండనున్నట్లు పేర్కొంది. ఈ తాజా ప్రకటన ఆధారంగా.. రెనో–నిస్సాన్ భాగస్వామ్యంతో చెన్నైలో ఏర్పాటైన ఈ ప్లాంట్‌లో 1,700లకు మించి ఉద్యోగులు ఉపాధి కోల్పోనున్నారని ఆటో రంగ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కలిపి దాదాపు 40,000 మంది ఇక్కడి ప్లాంట్‌లో పనిచేస్తుండగా.. ఏడాదికి 4.8 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఈ ప్లాంట్‌కు ఉంది. తయారీ విభాగంలోనే ఈ కోతలు అధికంగా ఉండేందుకు ఆస్కారం ఉందని భావిస్తున్నాయి. అమెరికా, యూరప్‌లో అమ్మకాలు భారీగా క్షీణించడం వల్ల తొలి త్రైమాసిక నిర్వహణ లాభం గణనీయంగా తగ్గిపోయిందని.. నిస్సాన్ చైర్మన్ కార్లోస్ ఘోన్ అరెస్టు తరువాత ఆర్థిక సంక్షోభాన్ని చవిచూస్తున్నామని సంస్థ తాజాగా వెల్లడించిన అంశం తెలిసిందే.

# కంపెనీల రవాణా సేవలకు 'విజిల్'

- విజిల్ డ్రైవ్‌లో ఉద్యోగుల రవాణా, టెక్నాలజీ సేవలు
- రోజుకు 2,500 ట్రిప్స్; 12 వేల మంది వినియోగం
- ఏడాదిలో రూ.70 కోట్ల నిధుల సమీకరణ పూర్తి
- 'స్టార్టప్ డైరీ'తో ఫౌండర్ అండ్ సీఈఓ రాకేశ్




విజిల్ డ్రైవ్ బృందం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఉద్యోగుల ట్రాన్స్‌పోర్టేషన్ కంపెనీలకు పెద్ద సవాలే. వ్యాపార కార్యకలాపాల కంటే ఎక్కువగా ఉద్యోగుల రవాణా సేవల నిర్వహణ కష్టం. ఎంప్లాయిస్ ట్రాన్స్‌పోర్టేషన్ థర్డ్ పార్టీకి ఇద్దామంటే? వాహనాలు మాత్రమే ఉంటే సరిపోదు. టెక్నాలజీ, నిర్వహణ కూడా అవసరమే. సొంత వాహనాలు, డ్రైవర్లు, ఏఐ ఆధారిత ట్రాన్స్‌పోర్ట్ టెక్నాలజీ మూడు విభాగాలను నిర్వహణ చేసే స్టార్టప్పే విజిల్ డ్రైవ్! మరిన్ని వివరాలు కంపెనీ ఫౌండర్ అండ్ సీఈఓ రాకేశ్ మున్ననూరు 'స్టార్టప్ డైరీ'కి వివరించారు.

''మాది కరీంనగర్ జిల్లా. నోయిడాలో బీటెక్ పూర్తయ్యాక.. టాప్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. జాబ్‌లో చేరితే లాక్ అయిపోతానని వచ్చిన ఆఫర్‌ను వదిలేసి.. ఇంటికొచ్చేశా. బీటెక్ చేస్తూనే చాలా స్టార్టప్స్‌కు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, నిర్వహణ, ఇన్వెస్ట్‌మెంట్స్ అప్రూవల్స్ తదితర విభాగాల్లో పనిచేశా. ఈ అనుభవంతో సొంతంగా స్టార్టప్ పెట్టాలని నిర్ణయించుకొని 2016 ఏప్రిల్‌లో హైదరాబాద్ కేంద్రంగా విజిల్ డ్రైవ్.కామ్‌ను ప్రారంభించాం. డ్రైవర్లను అద్దెకిచ్చే సేవలతో ప్రారంభమైన విజిల్ డ్రైవ్.. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలకు క్యాబ్స్, టెక్నాలజీ సేవలందించే కంపెనీగా ఎదిగింది.

**28 కంపెనీలు; 12 వేల మంది..**

ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో సేవలందిస్తున్నాం. ఏడీపీ, ఇన్వెస్కో, ఐటీసీ హోటల్స్, రెయిన్‌బో ఆసుపత్రి, ఎల్ అండ్ టీ వంటి 28 కంపెనీలు, 12 వేల మంది ఉద్యోగులు కస్టమర్లుగా ఉన్నారు. ప్రస్తుతం 700 క్యాబ్స్ ఉన్నాయి. ఇందులో 20 శాతం సొంతానివి. విజిల్ ఫ్లీట్‌లో 4–7 సీట్ల వాహనాలు, విజిల్ షటిల్‌లో వింగర్స్, మినీ బస్‌లు, విజిల్ 360 డిగ్రీస్‌లో వాహనాలతో పాటూ టెక్నాలజీ సేవలు కూడా ఉంటాయి. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఉంటుంది. వచ్చే ఏడాది కాలంలో 1,500 క్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం రోజుకు క్యాబ్స్ 2,500 ట్రిప్పులు, లక్ష కి.మీ. వరకు తిరుగుతున్నాయి.

**రూ.15 కోట్ల ఆదాయం లక్ష్యం..**

నెల ప్యాకేజ్, ట్రిప్ వారీగా ఆదాయం ఉంటుంది. ధరలు నెల ప్యాకేజీ రూ.30 వేల నుంచి రూ.50 వేలు, ట్రిప్‌కు అయితే రూ.350 నుంచి రూ.1,000కు చార్జీలుంటాయి. డ్రైవర్ కం ఓనర్ క్యాబ్ ఆదాయంలో విజిల్ డ్రైవ్‌కు 20 శాతం కమీషన్ ఉంటుంది. గతేడాది రూ.8 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాం. 2019–20లో రూ.15 కోట్ల రెవెన్యూను లక్ష్యించాం. ఈ ఏడాది ముగింపు నాటికి పుణేలో సేవలను ప్రారంభించనున్నాం. 2020 నాటికి విశాఖపట్నం, ముంబై, ఢిల్లీలోకి ఎంట్రీ ఇస్తాం.

**రూ.70 కోట్ల నిధుల సమీకరణ..**

ప్రస్తుతం విజిల్ డ్రైవ్‌లో 62 మంది ఉద్యోగులున్నారు. ఏడాదిలో ఈ సంఖ్యను 150కి చేర్చుతాం. ప్రస్తుతం ఉద్యోగుల ట్రాన్స్‌పోర్టేషన్ కోసం ఫోర్డ్స్ కంపెనీతో చర్చలు జరుగుతున్నాయి. నెల రోజుల్లో ఎంవోయూ పూర్తవుతుంది. దీంతో ముంబై, కోల్‌కతా వంటి ఇతర నగరాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్టే. ఏడాది కాలంలో క్లయింట్ల సంఖ్యను 50కి చేర్చుతాం. ''ఇప్పటికే మా కంపెనీలో కొలీజియం గ్రూప్ రూ.5 కోట్ల పెట్టుబడులు పెట్టింది. త్వరలోనే రూ.70 కోట్ల నిధులు సమీకరించనున్నాం. అమెరికాకు చెందిన పలు ఇన్వెస్ట్‌మెంట్ నెట్‌వర్క్స్‌తో చర్చలు జరుగుతున్నాయి'' అని రాకేశ్ వివరించారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.com కు మెయిల్ చేయండి...

## కంపెనీల చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం




**న్యూఢిల్లీ:** సీఎస్ఆర్ నిబంధనల కఠినతరం సహా ఎన్నో సవరణలతో కూడిన కంపెనీల చట్టం సవరణ బిల్లు 2019కు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. దీనిపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... మరింత సులభంగా వ్యాపారాల నిర్వహణ జరిగేలా చూడడం, కంపెనీలపై నిబంధనల భారం తగ్గించడం సవరణల లక్ష్యాలుగా చెప్పారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద (సీఎస్ఆర్) కంపెనీలు నిబంధనల మేరకు తమ లాభాల్లో 2 శాతాన్ని ఖర్చు చేయకపోతే, నిధులు ప్రత్యేక ఖాతాకు బదలాయించాల్సి ఉంటుందన్నారు. షెల్ కంపెనీలపై సభ్యుల ఆందోళనలకు మంత్రి స్పందిస్తూ... ప్రభుత్వం 4 లక్షల షెల్ కంపెనీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్టు తెలిపారు. నిబంధనల్లో షెల్ కంపెనీలకు నిర్వచనం లేదని, కార్యకలాపాలు లేని లేదా రిజిస్టర్డ్ కార్యాలయాన్ని నిర్వహించని కంపెనీలుగా భావిస్తున్నట్టు సూచించారు. చర్చ అనంతరం ఈ బిల్లుకు లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం గమనార్హం. చట్టం ప్రకారం రూ.5కోట్లకు పైగా లాభం, రూ.100 కోట్లకు పైగా టర్నోవర్ లేదా రూ.500 కోట్ల నికర విలువ కలిగిన కంపెనీలు తమ లాభాల్లో ఏటా 2 శాతాన్ని సీఎస్ఆర్‌కు కేటాయించాల్సి ఉంటుంది.

# తుప్పు వదిలిస్తాం బాబూ..!

- మామిడి ఆకుల నుంచి తుప్పు వదిలించే రసాయనం
- అభివృద్ధిపరిచిన తిరువనంతపురం పరిశోధకులు



మామిడి ఆకులను ఎందుకు వాడతారు? గుమ్మానికి తోరణంగా వాడొచ్చు.. యాగాలు, హోమాలు చేస్తూంటే ప్రోక్షణకు పనికొస్తుంది. అంతకుమించి దానివల్ల ఇంకేం ఉపయోగం అంటున్నారా? మీ ఆలోచనలకు కళ్లెం వేయండి. ఎందుకంటే.. ఇకపై ఈ మామిడాకులు ఏటా లక్షల కోట్లు ఆదా చేస్తాయి మరి! ఎలాగంటే.. ఇనుమును అలాగే వదిలిస్తే ఏమవుతుంది? కొంత కాలానికి తుప్పు పడుతుంది. సముద్రంలో ఎప్పుడూ ఉండే పెద్ద పెద్ద నౌకలు మరింత వేగంగా తుప్పుపడతాయి. ఈ తుప్పు వదిలించుకునేందుకు అవుతున్న ఖర్చు ఎంతో తెలుసా? ఏకంగా.. రెండున్నర లక్షల కోట్ల డాలర్లు! అయితే మామిడాకుల నుంచి తీసిన ఓ పదార్థం ఇనుముకు తుప్పు అసలే పట్టనివ్వదని తిరువనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు రుజువు చేశారు. ఈ పదార్థాన్ని వాడటం ద్వారా పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న కృత్రిమ రంగుల వాడకాన్ని నిలిపివేయవచ్చని అంచనా. మామిడాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, తుప్పు తట్టుకునే పాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయని.. అందుకే తాము వీటిపై పరిశోధనలు ప్రారంభించామని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త నిషాంత్ కె.గోపాలన్ తెలిపారు. ఎథనాల్ సాయంతో ఎండిపోయిన మామిడాకుల నుంచి పాలీఫినాల్స్ వంటి రసాయనాలను తొలుత వేరు చేశామని చెప్పారు. వేర్వేరు సాంద్రతలతో ఈ రసాయనాలను పరిశీలించగా ఇనుము లాంటి లోహాలతో బంధం ఏర్పరచుకున్న పాలీఫినాల్స్ తుప్పును సమర్థంగా అడ్డుకుంటుందని వివరించారు. గరిష్టమైన నిరోధకత కలిగిన పదార్థపు పూత పూసిన ఇనుమును ఉప్పునీటిలో ఉంచి పరీక్షించినప్పుడు తుప్పు పట్టడం 99 శాతం తగ్గిందని చెప్పారు. ఈ పదార్థంపై మరిన్ని పరిశోధనలు, ప్రయోగాలు చేయాల్సి ఉందని గోపాలన్ చెప్పారు. మార్కెట్‌లో తుప్పును నిరోధించే రసాయనాలు ఎన్నో ఉన్నా వాటి ఖరీదు చాలా ఎక్కువని.. పైగా వాటితో మానవ ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు తాము మొక్కల రసాయనాలను అన్వేషించామని చెప్పారు. మామిడాకులతో పాటు ఈత/ఖర్జూరపు గింజలు, అల్లం నుంచి వేరు చేసిన రసాయనాలు కూడా తుప్పును తట్టుకోగలవని తమ ప్రయోగాల ద్వారా తెలిసిందని వివరించారు.



– సాక్షి నాలెడ్జ్ సెంటర్



# నేనెట్లా ఎండిపోత!

పొలంలో అడ్డంగా ఉందని భావించాడో ఏమో.. ఓ రైతు ఈ రావిచెట్టు కొమ్మలన్నీ నరికేసి మోడు చేశాడు. తర్వాత మంట పెట్టి కాల్చేశాడు. కొమ్మలన్నీ ఎండిపోయినా.. మొదలు సగానికి పైగా కాలిపోయినా ఆ చెట్టు మాత్రం చావలేదు. నేనున్నానంటూ మళ్లీ ఇలా చిగురించింది. జగిత్యాల మండలం తాటిపల్లి గ్రామశివారులో ఈ దృశ్యం కనిపించింది.

– ఏలేటి శైలేందర్ రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, జగిత్యాల

# ఎరువులకు తెలివొస్తే..

**ఏటిలోకి వేయాలనుకున్నా... లెక్క వేసి వేయాలంటారు. వృథా చేస్తున్నా దానికీ ఓ లెక్క ఉండాలన్నది దీని అర్థం. మరి వ్యవసాయంలో.. ఎరువుల విషయంలో మనం చేస్తున్నదేంటి? అవసరానికి మించి వాడటం ఒకటైతే.. వేసే ఎరువు మొక్కకు ఉపయోగపడుతుందా.. లేదా అన్నది కూడా అస్పష్టమే. కానీ ఈ పరిస్థితిలో మార్పు రాబోతోంది.. ఎరువులకూ తెలివి వచ్చేస్తోంది!**

ప్రపంచ జనాభా ఏటికేటికీ పెరుగుతోంది. భూమి, నీరు వంటి వనరుల విషయంలో మాత్రం తేడా లేదు. పెరిగే జనాభా కడుపు నిండాలంటే.. ఉన్న భూమిలోనే



ఎక్కువ పండించక తప్పదు. ఎలా మరి..? కొత్త వంగడాల సృష్టి ఒక మార్గమైతే.. ఎరువులను తెలివిగా వాడుకోవడం.. తెలివైన ఎరువులను ఉపయోగించడం ఇంకో పద్ధతి. అయితే రైతులు సాధారణంగా రెండు విధాలుగా ఎరువులను వాడుతుంటారు. అమ్మోనియా, యూరియాల వంటివి పిచికారి చేయడం లేదా చల్లడం. ఈ పదార్థాలు నీటితో కలిసి నైట్రోజన్ను ఉత్పత్తి చేస్తాయి. ఫాస్ఫరస్ కోసం వాడే పొటాష్ గుళికలు కూడా నీటితో కలిసి అసవరమైన పోషకాన్ని ఉత్పత్తి చేస్తాయి. అయితే మనం వేసే ఎరువుల్లో మొక్కకు చాలా తక్కువగా చేరుతుంది. నైట్రోజన్ వాతావరణంలోకి చేరితే.. పొటాష్ నీళ్లల్లో కలిసిపోతుంది. ఇలా కాకుండా మొక్కలకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు మాత్రమే పోషకాలు విడుదల చేయగలిగితే.. మొక్కలు ఏపుగా ఎదుగుతాయి. దిగుబడులూ పెరుగుతాయి. ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది.

**ఎప్పుడు వస్తాయి?**

తెలివైన ఎరువులు ఇప్పటికే వాడుకలో ఉన్నాయి. 'స్లో రిలీజ్ ఫర్టిలైజర్స్'పేరిట ఉన్నాయి. నైట్రోజన్, ఫాస్ఫరస్ వంటి పోషకాలను చిన్న చిన్న క్యాప్సూల్స్‌లో పెట్టడం దీంట్లో కీలకం. క్యాప్సూల్ తయారైన పదార్థాన్ని బట్టి.. ఇందులోని ఎరువులు నెమ్మదిగా విడుదల అవుతుంటాయి. అయితే పదార్థాలు, టెక్నాలజీ, తయారీ రంగాల్లో మార్పుల కారణంగా ఇప్పుడు శాస్త్రవేత్తలు స్లో రిలీజ్ ఫర్టిలైజర్ల స్థానంలో కంట్రోల్డ్ రిలీజ్ ఫర్టిలైజర్లను అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. గుళిక పైపొర చుట్టూ ఉన్న నేల పరిస్థితికి అనుగుణంగా ఇది విచ్ఛిన్నమవుతుంది. ఎప్పుడు.. ఎలా పోషకాలు అందించాలన్నది మన చేతుల్లోనే ఉంటుంది. ఉదాహరణకు మట్టి ఉష్ణోగ్రత, ఆమ్లత, తేమ శాతంలోని తేడాలకు అనుగుణంగా ఎరువులను అందించేందుకు కంట్రోల్డ్ ఫర్టిలైజర్స్ ఉపయోగపడతాయి. ఈ వేర్వేరు లక్షణాలన్నింటినీ వాడుకుంటూ పంటకు తగిన ఎరువులను తయారు చేసుకోవచ్చు. ఇజ్రాయెల్‌కు చెందిన హైఫా అనే కంపెనీ నేల ఉష్ణోగ్రతల్లో వచ్చే తేడాల ఆధారంగా ఎరువులను విడుదల చేసే ప్రత్యేక గుళికలు తయారు చేసింది. వేడి ఎక్కువ అవుతున్న కొద్దీ పోషకాలు విడుదలయ్యే వేగమూ ఎక్కువ అవుతుంటుంది.

**లాభాలే లాభాలు..**

కంట్రోల్డ్ రిలీజ్ ఫర్టిలైజర్స్‌తో ఎరువులతో వచ్చే లాభాలపై ఇప్పటికే కొన్ని అధ్యయనాలు జరిగాయి. ఈ రకమైన ఎరువులకు జీపీఎస్ సెన్సర్లు, కృత్రిమ మేధ వంటి ఆధునిక టెక్నాలజీలు జోడిస్తే వ్యవసాయం ద్వారా వాతావరణంలోకి విడుదల అవుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల మోతాదును 68 లక్షల టన్నుల వరకు తగ్గించొచ్చని మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ అధ్యయనం చెబుతోంది. అయితే ఈ కొత్త తరం ఎరువులతో సమస్యలన్నీ తొలగిపోకున్నా సుస్థిర వ్యవసాయానికి మాత్రం ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. యూరియా, పొటాష్, అమ్మోనియా వంటి రసాయనాల తయారీతో వాతావరణంలోకి విడుదలవుతున్న విష వాయువులు కూడా భూతాపానికి కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణానికి హాని చేయని విధంగా మొక్కలు నైట్రోజన్, ఫాస్ఫరస్‌లను మరింత మెరుగ్గా శోషించుకునేలా చేసేందుకు సూక్ష్మజీవులను ఉపయోగించుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



గాంధీ ఫిజియోథెరపీ విభాగంలో టిక్ టాక్ చేస్తున్న విద్యార్థులు

# విధులు మరచి టిక్‌టాక్

- ఇద్దరు అప్రెంటీస్ విద్యార్థుల తొలగింపు
- సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఘటన

**హైదరాబాద్:** టిక్‌టాక్.. మాయలో పడి కొందరు సెలబ్రిటీలుగా మారుతుంటే, మరికొందరు ఉద్యోగాలను పోగొట్టుకుంటున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉంటూ టిక్‌టాక్ వీడియోలు చేసిన ఇద్దరు అప్రెంటీస్ విద్యార్థులను శుక్రవారం విధుల నుంచి తొలగించారు. రాంనగర్ సాధన పారా మెడికల్ కాలేజీకి చెందిన శ్యామ్‌మిల్టన్, అత్తాపూర్ జెన్ ఒకేషనల్ కాలేజీకి చెందిన వీణాకుమారీ.. గాంధీ ఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగంలో శిక్షణ కోసం అప్రెంటీస్‌లుగా చేరారు. విధులను మరచి ఫిజియోథెరపీ విభాగంలోనే పలు టిక్‌టాక్ వీడియోలు చేశారు. ఆ వీడియోలు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో ఆస్పత్రి పాలనాయంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. చికిత్స కోసం వచ్చిన రోగులను పట్టించుకోకుండా విధులను నిర్లక్ష్యం చేస్తూ టిక్‌టాక్ వీడియోలు చేసిన శ్యామ్‌మిల్టన్, వీణాకుమారీని విధుల నుంచి తొలగించి ఆయా కాలేజీలకు సరెండర్ చేశామని ఆర్ఎంఓ–1 జయకృష్ణ తెలిపారు. ఫిజియోథెరపీ విభాగ వైద్యులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. వైరల్‌గా మారిన టిక్‌టాక్ వీడియోలు చేసిన వారు గాంధీ ఆస్పత్రిలో కేవలం శిక్షణ పొందేందుకు మాత్రమే వచ్చారని స్పష్టం చేశారు.

# న్యాక్‌లో మరో రెండు కోర్సులు

**120 సీట్లతో ప్రారంభం..**

**సాక్షి, హైదరాబాద్:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) మరో రెండు కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టింది. కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ పేరుతో పీజీ డిప్లొమా కోర్సుల్ని ప్రారంభిస్తోంది. సైట్ ఇంజనీర్లుగా పనిచేసే వారికి నిర్మాణ రంగానికి సంబంధించిన అవగాహన, సామర్థ్యం ఉండేందుకు న్యాక్ ఈ కోర్సుల్ని ప్రారంభించింది. నిర్మాణ ప్రాజెక్టును ప్రారంభించేటప్పుడు ప్లానింగ్‌పై సమగ్ర అవగాహన కల్పించేదే కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కోర్సు. కాంట్రాక్టు, ప్రైస్ ఎస్కలేషన్, భూమి విలువ నిర్ధారణ, నిర్మాణానికి వాడే యంత్రాలపై అవగాహన, బీఓటీ కాన్సెప్ట్, మెజర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ సాఫ్ట్‌వేర్.. ఇలా అన్ని రంగాల్లో అవగాహన కల్పించేది రెండో కోర్సు. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తయినవారు ఈ పీజీ డిప్లొమా కోర్సులకు అర్హులని న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి పేర్కొన్నారు. శనివారం ఈ కోర్సులను రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

# హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ నివేదించండి

- ఎర్రమంజిల్ భవన కేసులో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- కొత్త చట్టసభల సముదాయానికి 25 ఎకరాలు కావాలి
- ధర్మాసనానికి విన్నవించిన ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ
- విచారణ 30కి వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** ఎర్రమంజిల్ భవన కూల్చివేతను అడ్డుకోవాలని కోరుతున్న కేసులో హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను హైకోర్టుకు నివేదించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎర్రమంజిల్ భవన ప్రదేశంలో నూతనంగా చట్టసభల సముదాయాన్ని నిర్మించాలనే ప్రయత్నాల్ని అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలను శుక్రవారం హైకోర్టు మరోసారి విచారణ చేసింది. ధర్మాసనం ఆదేశాల మేరకు రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి స్వయంగా విచారణకు హాజరయ్యారు. విచారణ సందర్భంగా హుడా చట్టంలోని 13వ నిబంధనను రద్దు చేశామని ప్రభుత్వం చెబుతున్నా ఆ నిబంధనను హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చారని ధర్మాసనానికి న్యాయవాది నివేదించారు. కొత్త అసెంబ్లీ భవన సముదాయాల నిర్మాణానికి 20 నుంచి 25 ఎకరాల భూమి అవసరమని గణపతిరెడ్డి ధర్మాసనానికి తెలిపారు. కొత్త అసెంబ్లీ భవనాల కోసం ప్రణాళిక ఇంకా సిద్ధం కాలేదన్నారు. ప్రణాళిక బాధ్యతలను ప్రభుత్వం మూడు కన్సల్టెన్సీ సంస్థలకు ఇచ్చిందని, ఆ సంస్థల నుంచి మూడు ప్రణాళికలు వచ్చాక అందులో ఒక దానిని ప్రభుత్వం ఆమోదిస్తుందన్నారు. శాసనసభ, శాసనమండలి, స్పీకర్, చైర్మన్, కార్యదర్శుల కార్యాలయాలు, నివాస సముదాయాలను నిర్మించాలన్నది ప్రభుత్వ నిర్ణయమని చెప్పారు. దీంతో ధర్మాసనం జోక్యం చేసుకుని గదులు, సమావేశ మందిరాలు ఎన్నెన్ని ఉంటాయి వంటి వివరాలు ఇవ్వాలని కోరింది. ఇవి కన్సల్టెన్సీల నుంచి ప్రణాళికలు వచ్చాకే అవి తెలుస్తాయని గణపతిరెడ్డి సమాధానమిచ్చారు. అయితే చట్టసభల సముదాయానికి ఎన్ని ఎకరాల భూమి కావాలో గణపతిరెడ్డి స్పష్టంగా చెప్పకపోయేసరికి ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. ఇప్పుడున్న అసెంబ్లీ, కౌన్సిల్ వేర్వేరుగా ఉన్నాయని, ఇవి సుమారు 25 ఎకరాల్లో ఉన్నాయని, ఇప్పుడు కూడా అదే భూమి అవసరం అవుతుందని ఆయన జవాబు చెప్పారు. ప్రభుత్వం నిబంధన 13ను రద్దు చేసిందని, ఈ పరిస్థితుల్లో ఆ నిబంధన ప్రారంభమైనప్పటి నుంచి అమల్లో లేనట్లేనని చెబుతోందని, దీనిపై ఏం చెబుతారని పిటిషనర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. అర్బన్ ఏరియా యాక్ట్ స్థానంలో హెచ్‌ఎండీఏ వచ్చిందని డెక్కన్ ఆర్కియాలజికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన జితేంద్రబాబు తరఫు న్యాయవాది బదులిచ్చారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో సెక్షన్ 13 ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చేస్తున్న వాదనలో పస లేదని అర్థం అవుతోందన్నారు. విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది.

# పీఏసీ చైర్మన్‌గా అధీర్ రంజన్ చౌదరి

**సభ్యుడిగా ఎంపీ బాలశౌరి**

**సాక్షి, న్యూఢిల్లీ:** పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా లోక్‌సభ కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి నియమితులయ్యారు. కమిటీలో సభ్యులుగా వైఎస్సార్ సీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి, సీఎం రమేశ్‌లు నియమితులయ్యారు. పీఏసీ కమిటీ చైర్మన్ సహా లోక్‌సభ, రాజ్యసభ నుంచి 22 మందిని సభ్యులుగా నియమిస్తూ లోక్‌సభ స్పీకర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ రఘురామ కృష్ణంరాజు నియమితులయ్యారు. ఈ కమిటీ చైర్‌పర్సన్‌గా మీనాక్షి లేఖి నియమితులయ్యారు. ఎస్టిమేట్స్ కమిటీ సభ్యులుగా ఎంపీలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కేశినేని నాని నియమితులయ్యారు.




# ఆరోగ్యశ్రీ నుంచి 50 వ్యాధులు ఔట్!

- ఒక్క కేసూ రానివాటిని తొలగించి కొత్తవి చేర్చాలని యోచన
- ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం తర్వాతే నిర్ణయం




**సాక్షి, హైదరాబాద్:** ఆరోగ్యశ్రీ జాబితా నుంచి దాదాపు 50 రకాల వ్యాధులను తొలగించాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఆయా వ్యాధులు జాబితాలో ఉన్నా పెద్దగా రోగులు రాకపోవడంతో తొలగించడమే సమంజసమని భావిస్తున్నట్లు ఆరోగ్యశ్రీ వర్గాలు తెలిపాయి. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆరోగ్యశ్రీపై సుదీర్ఘ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఈ మేరకు ప్రతిపాదన చేసినట్టు తెలిసింది. తొలగించిన వాటి స్థానంలో మరికొన్ని కొత్త వ్యాధులను చేర్చాలని పేర్కొన్నట్టు సమాచారం. కొన్ని రకాల వ్యాధులకు రోగులు వస్తున్నా, అవి ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తావనకు వచ్చింది. అయితే వ్యాధుల తొలగింపు, చేర్పుల విషయంలో తొందరపడకుండా ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించి అధ్యయనం చేయించాలని నిర్ణయించారు. ఆ తర్వాతే ఏ వ్యాధులను తొలగించాలి? వేటిని చేర్చాలన్న దానిపై నిర్ణయం తీసుకోవాలని మంత్రి పేర్కొన్నట్లు సమాచారం.

**200 నుంచి 300 వ్యాధులకు కేసులు నిల్..**

కొన్ని రకాల వ్యాధులు జాబితాలో ఉన్నా నాలుగైదు ఏళ్లుగా వాటికి పేద రోగులు పెద్దగా రావడంలేదని ఆరోగ్యశ్రీ వర్గాలు అంటున్నాయి. చర్మవ్యాధులకు సంబంధించి చికిత్స చేయించుకోవడానికి ఎవరూ రావడంలేదు. ఇక ఎండోక్రినాలజీ, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ, రుమటాలజీ, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్ వంటి కేసుల్లో చాలా తక్కువగా వస్తున్నాయి. వీటిలో కొన్ని రకాల వ్యాధులకు అసలు కేసులే రావడంలేదు. రాష్ట్రంలో 29 రకాలకు చెందిన 949 వ్యాధులు ఆరోగ్యశ్రీ జాబితాలో ఉండగా.. వాటిలో దాదాపు 200 నుంచి 300 వ్యాధులకు పెద్దగా రోగులు రావడంలేదనేది ఆరోగ్యశ్రీ వర్గాలు చెబుతున్నాయి. వాటిలో కొన్నింటిని ఉంచినా, 50 రకాల వ్యాధులు ఏమాత్రం అవసరం లేదని అధికారులు స్పష్టంచేస్తున్నారు. అలాంటివాటిని లెక్క కోసం ఉంచే బదులు, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వాటిని గుర్తించి, పేదలకు ఉపయోగపడేవాటిని జాబితాలో చేర్చడం వల్ల ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు గుండె, లివర్ మార్పిడి చేయించుకున్న రోగులకు జీవితాంతం ఉచిత మందులు ఇవ్వాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారికి మాత్రమే జీవితాంతం ఉచిత మందులు ఇస్తున్నారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792